www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 228 | బుధవారం | 7 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

త్వరలో రైతు కార్పొరేషన్

వారం రోజుల్లో జిల్లా రైతు సమన్వయ సమితులు

చైర్మన్‌గా గుత్తా సుఖేందర్ రెడ్డి?



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర రైతు సమన్వయ సమితికి త్వరలోనే కార్పొరేషన్‌గా ప్రభుత్వం చట్టబద్ధత కల్పించనుంది. ఆ తరువాతనే దానికి చైర్మన్, సభ్యులను ఎంపిక చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. రైతు సమన్వయ సమితులపై సిఎం కె. చంద్రశేఖర్‌రావు ఇటీవల మంత్రులు, ఎంపిలు, అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీలైనంత త్వరగా జిల్లా రైతు సమితులను ఏర్పాటు చేసుకోవాలని మంత్రులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే సమయంలో రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ తరహాలో పనిచేయనుందని ప్రకటించారు. న్యాయ నిపుణుల సలహాల మేరకు ఉన్నతాధికారులు, కార్పొరేషన్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. అందులో భాగంగా వారం లోపు జిల్లా రైతు సమన్వయ సమితుల ఏర్పాటును పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ భావిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే జిల్లా వ్యవసాయ శాఖ అధికారు(డిఎఒ)లకు ఆదేశాలు అందాయి. ఇప్పటికే సిరిసిల్ల జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుల ఎంపిక కూడా పూర్తయినట్లు తెలిసింది. ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం గ్రామ సమితుల్లో 15, మండల, జిల్లా రైతు సమితుల్లో 24, రాష్ట్ర రైతు సమితిలో 42 మంది ఉండాల్సి ఉంది. గ్రామ, మండలాలకు సంబంధించి సభ్యుల ఎంపిక ఎప్పుడో పూర్తయింది. మండల రైతు సమితుల్లో ఉన్న సభ్యుల నుంచే జిల్లా రైతు సమన్వయ సమితులకు సభ్యులను ఎంపిక చేస్తారు. మంత్రులు ఎంపిక చేసిన సభ్యుల జాబితాను డిఎఒలు జిల్లా కలెక్టర్లకు సమర్పిస్తారు. అక్కడి నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖకు సభ్యుల జాబితా చేరుతుంది. గ్రామ, మండల స్థాయిలోనే రైతు సమన్వయ సమితుల్లో చోటు కోసం తీవ్రంగా ప్రయత్నించిన టిఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు ఇప్పుడు జిల్లా సమితిలో చోటు కోసం ఎంఎల్‌ఎలు, మంత్రులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది. ఎంపిక ప్రక్రియలో మంత్రులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.



పాతాళ సూచీ

వాల్‌స్ట్రీట్ దెబ్బతో భారతీయ స్టాక్ మార్కెట్ల పతనం

సెన్సెక్స్‌కు 561, నిఫ్టీకి 168 పాయింట్లు నష్టం

ఎల్‌టిసిజి పన్ను ఎఫెక్ట్

ఒక్క రోజులోనే 33 వేల కోట్లు వారెన్ బఫెట్ సంపద ఆవిరి

9 లో

అంతర్జాతీయ పరిణామాలు ప్రత్యేకించి.. అమెరికాలో సూచీల పతనంతో దేశీయ స్టాక్‌మార్కెట్లు భయాందోళనకు గురయ్యాయి. మార్కెట్ సూచీలు ఆర్థిక మాంద్యం పరిస్థితులను గుర్తు చేశాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ 1,200 పాయింట్లు కుప్పకూలింది. అయితే తర్వాత కోలుకొని 561 పాయింట్ల నష్టంతో 34,195 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ కూడా 168 పాయింట్లు నష్టపోయి 10,498 వద్ద స్థిరపడింది.

ఆధార్ అప్‌డేట్స్‌పై 18% జిఎస్‌టి

- యుఐడిఎఐ సంస్థ సన్నాహాలు
- కొత్త ఆధార్ నమోదుకు, పిల్లలను చేర్పించడానికి వర్తించదు

10 లో



కశ్మీర్‌లో ఆసుపత్రిపై ఉగ్ర కాల్పులు

- పాక్ టెర్రరిస్టు ఖైదీని విడిపించుకొని పరార్
- ఇద్దరు పోలీసులు మృతి

10 లో



ఇంటి యజమాని ఇచ్చిన నరబలి?

- వీడుతున్న శిశువు తల మిస్టరీ
- భార్య అనారోగ్యం తొలుగుతుందని మూఢ నమ్మకం
- పాదల్లోకి చిన్నారి మొండెం
- పోలీసుల గాలింపు



(ఫైల్ ఫొటో)

మన తెలంగాణ/ ఉప్పల్: హైదరాబాద్ నగరం ఉప్పల్ నియోజకవర్గంలోని చిల్కానగర్‌లో గత వారం రోజుల క్రితం మూడునెలల పసిపాప తల ఓ ఇంటి డాబాపై ప్రత్యక్షమైన ఘటనకు త్వరలో చిక్కుముడి వీడనుంది. మూఢనమ్మకాలతో ఇంటి యజమాని, క్యాబ్ డ్రైవర్ రాజశేఖర్ తన భార్య ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చిన్నారిని బలిచ్చినట్లు పోలీసు వర్గాల విశ్వసనీయ సమాచారం. గత వారం రోజుల క్రితం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిల్కానగర్ మైసమ్మ గుడి ప్రాంతంలో క్యాబ్ డ్రైవర్ రాజశేఖర్ ఇంటి డాబాపై గుర్తు తెలియని నిందితులు పసి పాప తలను పడేసిన ఘటన విధితమే. పోలీసులు విచారణ చేపట్టగా కథంతా రాజశేఖర్ ద్వారా బయటికి వస్తున్నట్లు సమాచారం. చిల్కానగర్‌లో తరువాయి 6లో

చెరువులో దూకి నలుగురు ఆత్మహత్య




చిన్నారి మృతదేహాన్ని చెరువు నుంచి తీసుకువస్తున్న సిఐ

- భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు జలసమాధి
- మేడ్చల్ జిల్లా కీసరలో విషాదం

మన తెలంగాణ/ కీసర: మేడ్చల్ జిల్లా కీసరలో విషాదం చోటుచేసుకుంది. స్థానిక పెద్దమ్మ చెరువులో దూకి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇద్దరు చిన్నారులతో సహా దంపతులు బలవన్మరణానికి పాల్పడటం స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఘట్‌కేసర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మలిపడిగ రమేష్ (30)కు శామీర్ పేట మండలం ఉద్దమర్రి గ్రామానికి చెందిన మానస (22)తో గత మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి గీతాశ్రీ(2), తరువాయి 6లో

కుంచెపోటు



పాదయాత్రలు

భట్టి, కోమటిరెడ్డి, రేవంత్‌రెడ్డిలకు లైన్ క్లియర్

మరో బిసి నేతకు కూడా..

జూన్ 2న రాహుల్ సభ



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర నలువైపుల నుండి పాదయాత్రలకు కాంగ్రెస్ పార్టీ వ్యూహరచన చేస్తోంది. ఇందుకు నలుగురు రాష్ట్రస్థాయి నాయకులు నేతృత్వం వహించనున్నారు. ఇప్పటికే టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, సిఎల్పి ఉపనేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎ.రేవంత్‌రెడ్డిలు పాదయాత్రలు నిర్వహించేందుకు అధిష్ఠానాన్ని అనుమతి కోరారు. 2003లో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి చేసిన పాదయాత్ర కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఒక బలమైన కారణంగా నిలిచింది. దీంతో పాదయాత్ర తెలుగు రాష్ట్రాల్లో సెంటిమెంట్‌గా ఉంది. ఇదే బాటలో కార్యకర్తల్లో జోష్ నింపడంతో పాటు, ప్రజలకు చేరువయ్యేలా పాదయాత్రలు చేసేందుకు ముఖ్య నాయకులు ఉత్సాహం చూపిస్తున్నారు. కొందరికే పాదయాత్రలకు అనుమతిస్తే అది మరో సమస్యకు, పార్టీలో అనైక్యతకు దారితీస్తుందేమననే ఆలోచనతో పాదయాత్ర అంశాన్ని పెండింగ్‌లో ఉంచారు. ఇక తరువాయి 6లో

ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణం పెంచేందుకు పక్కా ప్రణాళికలు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆయిల్ పామ్ తోటల విస్తీర్ణాన్ని ప్రస్తుతం ఉన్న 17 వేల హెక్టార్లకు అదనంగా మరో 4 వేల హెక్టార్ల విస్తీర్ణం సాగు కిందకి తీసుకరావాలని ఉద్యాన శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుందని వ్యవసాయ కార్యదర్శి సి. పార్థసారధి తెలిపారు. పామాయిల్ తోటల పెంపకంలో అత్యాధునిక యాంత్రీకరణతో పాటు, ఛాప్ కట్టర్, పంటకోత పరికరాలు సబ్సిడీపై అందించడానికి ప్రణాళికను రూపొందిస్తున్నట్లు చెప్పారు. సచివాలయంలో మంగళవారం రాష్ట్ర ఆయిల్ ఫెడ్ 9వ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పార్థసారధి మాట్లాడుతూ అప్పారావుపేట లో పామాయిల్ కెర్నల్స్ నుంచి నూనె వేరుచేయడానికి 9.8 కోట్లతో ప్రత్యేక మిషనరీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉన్న వనరులను సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఉత్పత్తిని పెంచాలని ఆదేశించారు. జాతీయ నూనెగింజలు, ఆయిల్ పామ్ మిషన్ పథకంలో భాగంగా ఆయిల్ పామ్ తోటలకు ఫెన్సింగ్, ఇతర పరికరాలను సబ్సిడీపై అందించే దానిపై అధికారులకు మార్గనిర్దేశం చేసారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆయిల్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. వీరబ్రహ్మయ్య, ఉద్యాన శాఖ కమిషనర్ ఎల్. వెంకట్రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




యాంకర్ అనసూయపై కేసు నమోదు



మనతెలంగాణ/హైదరాబాద్/తార్నాక : సినీ నటి, యాంకర్ అనసూయపై ఓయు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అనసూయ తన వ్యక్తి గత పని మీద తార్నాక రావడంతో అదే ప్రదేశంలో ఉన్న ఓ బాలుడు శ్రీ చరణ్ అనసూయతో ఫొటో దిగుదామని వెళ్లగా, అన సూయ శ్రీచరణ్ చేతి నుంచి ఫోన్ లాక్కొని పగలగొట్టింది. విషయం తెలుసుకున్న శ్రీచరణ్ తల్లి గీత అనసూయతో వాగ్వాదానికి దిగింది. దీంతో అనసూయ తల్లి గీత కుమారుడు శ్రీ చరణ్‌తో దుర్భాషలాడింది. మనస్థాపానికి గురైన బాలు డి తల్లి గీత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్ వాడీలపై 'ఆన్‌లైన్' నిఘా





- ఆరోగ్య లక్ష్మి అనుబంధ పౌష్టికాహార సేవల పర్యవేక్షణ
- సంస్కరణలను పాటించాల్సిందేనంటున్న ఉన్నతాధికారులు

మన తెలంగాణ / హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీస్ (ఐసిడిఎస్) కింద అందించే ప్రధాన సేవలలో పౌష్టికాహార కార్యక్రమం ఒకటి. రాష్ట్రంలో దీనిని ఆరోగ్య లక్ష్మి పేరుతో మహిళా శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తోంది. గర్భిణులు, బాలింతల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అందిస్తోంది. 200 మి.లీ పాలు, గుడ్డు, అన్నం, పప్పు , ఆకు కూరలతో కూడిన భోజనం అందిస్తోంది. అలాగే ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల చిన్న పిల్లల కోసం కూడా గుడ్డుతో పాటు శనగపప్పు కలిపిన బాలామృతం పౌడర్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఆయా అంగన్ వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులకు ఒక్కొక్కరికీ రెండున్నర కిలోల చొప్పున ఈ బాలామృతంను అంగన్‌వాడీల ద్వారా సరఫరా చేస్తున్నారు. కోడిగుడ్ల కాంట్రాక్టర్లకు సకాలంలో డబ్బులు చెల్లించడం లేదన్న కారణంగా కొన్ని జిల్లాల్లో చిన్న సైజు గుడ్ల సరఫరా చేస్తున్నట్లు వస్తున్న ఫిర్యాదులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మి అనుబంధ పౌష్టికాహార సేవల పర్యవేక్షణకు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాల్సి వస్తోంది . ఉన్నతాధికారులు రాష్ట్ర , జిల్లా కేంద్రాల్లో ఉండడంతో క్షేత్రస్థాయిలో ఏం చేసినా చెల్లుతుందన్న పరిస్థితులు ఇంకా ఈ శాఖలో ఉన్నాయి. ఇలాంటి అంశాలను రాష్ట్ర కేంద్రం నుండే ఎప్పటి కప్పుడు మానిటర్ చేసేందుకు ఆన్‌లైన్ మానిటరింగ్ విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు 149 ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఈ విధానాన్ని రోజు వారీగా సమీక్షించనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 35,700 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 31711 ప్రధాన కేంద్రాలు కాగా, 3989 మినీ అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. పౌష్టికాహారం, కోడిగుడ్ల సరఫరాలో లోటుపాట్లు తొలగించేందుకు , చిన్న సైజు గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లపైనా , వారికి సహకరించే అంగన్ వాడీ సిబ్బందిపైనా శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మహిళా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. అధికారులు సకాలంలో విధులకు హాజరు అవుతున్నదీ? లేనిదీ కూడా ఆన్‌లైన్ అటెండెన్స్ మానిటరింగ్‌ను ఇప్పటికే అమలు చేస్తున్నామని అధికారులు గుర్తు చేస్తున్నారు. అటెండెన్స్ మానిటరింగ్‌లో కొన్ని జిల్లాల్లో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర కేంద్రంలో కూడా ఈ అటెండెన్స్ మానిటరింగ్ విధానాన్ని ప్రవేశ పెట్టారు. రోజు వారీగా ఉన్నతాధికారులు మొదలుకొని సిబ్బంది వరకు వారు వచ్చిన సమయ సూచిని తెలియజేస్తూ రోజంతా ఆ టివిల్లో సిబ్బంది ఫోటోలు డిస్‌ప్లే అవుతుండడం గమనార్హం. ఈ హాజ రు విధానం దాదాపు సక్సెస్ అయినట్లుగానే ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సంస్కరణలను పాటించాలి : విజయేందిర బోయి



ప్రభుత్వ ఉన్నతాధికారులుగా తాము చేయాల్సిందంతా చేస్తున్నామని, క్రింది స్థాయి సిబ్బందిలోనూ ఈ సంస్కరణలను గౌరవించి పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఉద్యోగిపై ఉంటుందని ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయేందిర బోయి అన్నారు.

పరిస్థితులు మారాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో అధికారులు తనిఖీలు నిర్వహించాలి : నాయిని

మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించేందుకు రూ.కోట్లు వెచ్చిస్తున్నా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని హోం మంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి అన్నారు. పదవ తరగతి ఫలితాలలో హైదరాబాద్ జిల్లా చివరి స్థానంలో ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారాలంటే విద్యాశాఖ ఉన్నతాధికారులు తరచూ తనిఖీలు, సమీక్షలు నిర్వహిస్తూ ఉపాధ్యాయుల పని తీరు మార్చాలని సూచించారు. హైదరాబాద్ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై మంగళవారం సచివాలయంలో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌లతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ, జలమండలిలో ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను నిర్ణీత వ్యవధిలో పూర్తి చెయ్యని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఎండికి సూచించారు. డిప్యూటీ సిఎం మహమూద్ అలీ మాట్లాడుతూ, తన నియోజకవర్గ నిధుల నుంచి రూ.2.5 కోట్లు విద్యా సంస్థల అభివృద్ధికి కేటాయించానని, వాటితో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, జిఒ నెం.59 కింద క్రమబద్ధీకరించాల్సిన స్థలాలకు సంబంధించి వసూలు చేయాల్సిన మిగిలిన రుసుముపై కటాఫ్ డేట్ నిర్ణయించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. 10వ తరగతి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. అలాగే అర్హులకు కెసిఆర్ కిట్ చేర్చేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ దానకిశోర్, జిల్లా కలెక్టర్ యోగితారాణా పాల్గొని మాట్లాడారు.

కోదండరామ్ మా ప్రత్యర్థి కాదు

- ఏజెంటు కూడా కాదు.. వారంలో కాంగ్రెస్‌లోకి టిఆర్ఎస్ నేతలు : కుంటియా



మన తెలంగాణ/ హైదరాబాద్ : టిఆర్ఎస్ ఆరోపిస్తున్నట్లుగా తెలంగాణ జెఎసి చైర్మన్ కోదండరామ్ తమ ఏజెంట్ కాదని, అదే సమయంలో ప్రత్యర్థి కూడా కాదని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ డాక్టర్ రామచంద్ర కుంటియా వ్యాఖ్యానించారు. ఉన్నత విద్యావంతుడైన కోదండరామ్ గౌరవనీయమైన వ్యక్తి అని తెలిపారు. వారం రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో టిఆర్ఎస్, టిడిపిల నుండి ముఖ్యనాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతారని వెల్లడించారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్టీ పెట్టుకునేందుకు ఎవరికైనా అధికారం ఉంటుందని, కెసిఆర్‌ను ఢీకొట్టాలంటే ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమని, త్వరలో ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరబోతున్నారని చెప్పారు. ఎన్నికల నాటికి రాష్ట్రంలో పోటీ టిఆర్ఎస్, కాం గ్రెస్‌ల మధ్యే కేంద్రీకృతమై ఉంటుందన్నారు. ఇందులో భాగంగా టిఆర్ఎస్ ను వ్యతిరేకిస్తున్న వివిధ గ్రూపులు, పార్టీలతో పిసిసి స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. మందకృష్ణ, ఆర్. కృష్ణయ్య వంటి సామాజిక ఉద్యమకారులతో కూడా అంశాల ఆధారంగా రాష్ట్ర నేతలు మాట్లాడుతున్నారన్నారు. ఎన్నికలకు ముందుగానే అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు.

త్వరలో కువైట్‌కు ప్రతినిధి బృందం : కువైట్‌లో వీసా గడువు ముగిసి, సరైన పత్రాలు లేని భారతీయులకు అక్కడి ప్రభుత్వం క్షమాభిక్ష (ఆమ్నెస్టీ) ప్రసాదిస్తుందని, కాబట్టి కువైట్‌కు వలస వెళ్ళిన భారతీయ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కుంటియా విజ్ఞప్తి చేశారు. అక్కడ పరిస్థితులను పరిశీలించేందుకు ఈనెల13న తాను కువైట్‌కు వెళ్ళనున్నట్లు చెప్పారు. తాము 200మందికి తిరిగి వచ్చేందుకు టిక్కెట్లు భరించేందుకు సిద్ధంగా ఉన్నామని టిపిసిసి గల్ఫ్ ఎన్ఆర్ఐ విభాగం కన్వీనర్ ఎన్.దేవేందర్‌రెడ్డి, భీమ్‌రెడ్డి తెలిపారు.

బిసిలపై ప్రత్యేక దృష్టి

వచ్చే ఎన్నికల నాటికి బిసిలకు దగ్గరయ్యేందుకు కాంగ్రెస్ రంగంలో దిగింది. అందులో భాగంగానే టిపిసిసి ఓబిసి సాధికార కమిటీని నియమించింది. ఈ కమిటీ తొలిసారిగా గాంధీభవన్‌లో మంగళవారం సమావేశమైంది. కమిటీ చైర్మన్ నాగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కుంటియా, పిసిసి అధ్యక్షు లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ కమిటీ 90 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ నియోజకవర్గాలలో పర్యటించి నివేదిక రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. వచ్చే ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు కోరుతామని కన్వీనర్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

సమ్మెకు సన్నద్ధం

- సిద్ధమవుతున్న వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు
- రేపటి నుంచి ఆందోళనలకు శ్రీకారం

మన తెలంగాణ/ హైదరాబాద్: వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ సమ్మెకు సన్నద్ధమవుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం ముందుగా వివిధ రూపా ల్లో ఆందోళనలను నిర్వహించి ఆ తర్వాత చివరి అస్త్రంగా సమ్మెను చేపడతామని ప్రజారోగ్య, వైద్య, ఉద్యోగుల యూనియన్ స్పష్టం చేసింది. నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం నాయకులు మంగళవారం తమ ఉద్యమ కార్యచరణను ప్రకటించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు ఎన్. శ్యాసుందర్, జి. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే తమ ఆందోళన తప్పదన్నారు. ప్రధానంగా ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదవ పీఆర్సీలో బేసిక్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఉమ్మడి ప్రభుత్వాలు దీన్ని అమలు చేశాయని తెలిపారు. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత వచ్చిన పదవ పీఆర్సీలో బేసిక్ వేతనం ఇచ్చేందుకు సర్కార్ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పీఆర్సీ అమలు కోసం ప్రభుత్వంతో పాటు సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. శాంతియుతంగా పలు రూపాల్లో ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

ఈ నేపథ్యంలోనే సమ్మె నిర్వహణకు సంబంధించిన నోటీసును అందజేశామన్నారు. ఆందోళనలో భాగంగానే ఈ నెల 8 నుంచి పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి పోస్టుకార్డు ద్వారా తమ సమస్యలను సంబంధిత అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యేకు తెలియజేయాలన్నారు. ఆ తర్వాత 17న అన్ని జిల్లాల్లో జిల్లా వైద్యశాఖాధికార్యాలయాల ముందు ధర్నాలు చేపడుతున్నట్లు చెప్పా రు. ఈ నెల 27 నుంచి కుటుంబ సంక్షేమశాఖ సంచాలకుల కార్యాలయం ముందు నిరవధిక నిరాహార దీక్షను చేపడుతున్నామని చెప్పారు. అయినా కూడా సమస్య పరిష్కారం కాకపోతే చివరి సమ్మెకు దిగుతామని వారు హెచ్చరించారు.

పట్టా ఉన్నా... ఉద్యోగం లేదు

- 'ఫార్మా–డి'లకు ఉద్యోగ కల్పనలో నిర్లక్ష్యం
- కమిటీ పేరుతో కాలయాపన

మన తెలంగాణ/ హైదరాబాద్: ఫార్మా–డి డాక్టర్లకు ఉద్యో గాలు కల్పించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని ఫార్మా– డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపించింది. ఫార్మా వైద్యుల ఉద్యోగాల కల్పన పట్ల ప్రభుత్వానికే ఒక స్పష్టత లేదని ఆవేదన వ్యక్తం చేసింది. డాక్టర్ పట్టా తీసుకున్న తమకు ఎలాంటి ఉద్యోగం కల్పించాలి, తమ అవసరాలను ఎక్కడ వినియోగించుకోవాలనే దానిపై ఇప్పటి వరకు తగిన విధి విధానాలే లేవన్నారు. దీంతో ప్రభుత్వం కమిటీ పేరుతో కాలయాపన చేస్తుందని ఆరోపించారు. నగరంలోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు రంజిత్, ప్రశాంత్, రామలక్ష్మి , జేరుషలు మాట్లాడుతూ డాక్టర్లుగా తమకు పట్టా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. తమ సేవలను వినియోగించుకోవాలని మూడేళ్లుగా సర్కార్‌కు విన్నవించుకుంటున్నా ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మా వైద్యులకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని రాష్ట్రంలో తాము కలవని మంత్రి లేరని.,వైద్య, ఆరోగ్యశాఖలో తమను గుర్తించే దాఖలాలు కూడా కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మా డాక్టర్లకు సంబంధించి ఒక కమిటీని వేశామని, కమిటీ నివేదిక అందిన తర్వాత పరిశీలిస్తామని చెప్తున్న ప్రభుత్వం ఆ కమిటీకి నిర్దిష్టంగా ఒక గడువను నిర్దేశించడం లేదన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా దీనిపై స్పందించి నెలన్నరలోగా కమిటీ నివేదికను తెప్పించుకొని తగిన చర్యలు తీసుకుంటామని హామినిచ్చిందన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఈ రోజు వరకు కూడా దీనిపై సానుకూలతను ప్రదర్శించడం లేదని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టేందుకు కూడా ప్రభుత్వం అనుమతించడం లేదని ఆరోపించారు. ఫార్మా డాక్టర్ల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ ఆసుపత్రులలో క్లినికల్ సర్జికల్ పోస్టును సృష్టించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య శ్రీ, 104 సర్వీసులలోనైనా తమ సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2008లో కేంద్రం ఈ కోర్సును ప్రవేశపెట్టిందని, తెలుగు రాష్ట్రాల్లోనే కోర్సుకు అత్యధిక ప్రాధాన్యత ఉందని, అయినా కూడా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కోర్సును పూర్తి చేసిన వారు తెలంగాణలో ఆరు వేల మంది ఉన్నారని తెలిపారు. కేరళ, చత్తీష్‌ఘడ్ ప్రభుత్వాలు ఫార్మా వైద్యులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నారని చెప్పారు.

ఎవరి మాట నిజం

- బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యపై తలో మాట
- సిబిఐ విచారణకు మంత్రి ఓకేనా? : కోమటిరెడ్డి

మన తెలంగాణ/ హైదరాబాద్: నల్లగొండలో కాంగ్రెస్ నేత బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యకు మిర్చి బండి వద్ద గొడవ కారణమని జిల్లా ఎస్‌పి చెబితే, కాంగ్రెస్ అంతర్గత తగాదాలే కారణమని మంత్రి జగదీశ్‌రెడ్డి అంటున్నారని, ఇందులో ఎవరి మాట సరైనదని సిఎల్‌పి ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ కేసుపై సిబిఐ విచారణకు మంత్రి అంగీకరించాలని లేకపోతే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హంతకులు మాట్లాడినట్లు చెబుతున్న కాల్‌డేటా తప్పుడుదని మంత్రి అంటున్నారని, మరి పోలీసులు మాత్రం ఆ మాట చెప్పడం లేదన్నారు. కాల్ డేటా ప్రకారం కేసును తిరిగి దర్యాప్తు చేస్తామని పోలీసులు ఉన్నతాధికారులు తనకు హామీ ఇచ్చారని అన్నారు. తనపై ఆరోపణలు చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డిపైనే హత్య కేసులు ఉన్నాయని ఆరోపించారు. జిల్లా మంత్రిగా ఉండి బొడ్డుపల్లి శ్రీను హత్యనిఇప్పటి వరకు ఖండించలేదన్నారు. ఎంఎల్‌ఏ వీరేశం తో కలిసి మంత్రి జిల్లాలో హత్యా రాజకీయాలు చేస్తున్నాడని అన్నా రు. టిఆర్ఎస్‌లో చేరిన గుత్తా సుఖేందర్‌రెడ్డిని అవమానిస్తున్నారని చెప్పా రు. వచ్చే ఎన్నికల్లో మంత్రి జగదీశ్‌రెడ్డి డిపాజిట్ గల్లంతవుతుందన్నారు

ఎత్తిపోతల విద్యుత్ చార్జీల తగ్గించేందుకు యత్నాలు

శాఖల మధ్య కొనసాగుతున్న సంప్రదింపులు

మన తెలంగాణ/హైదరాబాద్: ఎత్తిపోతల విద్యుత్ చార్జీలను వీలైనంతగా తగ్గించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ మేరకు విద్యుత్, నీటిపారుదల శాఖ అధికారుల మధ్య అంతర్గత సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలిసింది. ఉచిత కరెంటు ఇచ్చినా, ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసినా, రైతుల పొలాల చెంతకు నీళ్లు వెళ్లాలన్న ఉద్దేశంతోనేనని ఇరిగేషన్ శాఖ వర్గాలు, ఇంధన శాఖ ఉన్నతాధికారులతో తెలిపినట్లు తెలిసింది. ప్రస్తుతం ఎత్తిపోతల విద్యుత్‌కు యూనిట్‌కు రూ.రూ.6.40 వసూలు చేస్తున్నా రు. దీన్ని రూ.1.52 తగ్గించి కొత్తగా రూ.4. 88 వసూలు చేయాలని డిస్కంలు విద్యుత్ నియంత్రణ మండలికి ప్రతిపాదించాయి. దీనికి అదనంగా ఇన్నాళ్లుగా లేని డిమాండ్ చార్జీలను కొత్తగా ప్రతిపాదించారు. డిమాండ్ చార్జీలతో కలిపి లెక్కలు వేస్తే పాత చార్జీలకన్నా అధికంగా ఇరిగేషన్ శాఖపై భారం పడుతోంది. దీంతో ఇరిగేషన్ అధికారులు అవాక్కయ్యారు. ఒక చేత్తో తగ్గించి, మరో చేత్తో వసూలు చేస్తున్న విద్యుత్ అధికారుల అక్కౌంట్ల మాయాజాలంపై ఆశ్చర్యపోయారు. డిమాండ్ చార్జీలతో కలిపితే యూనిట్‌కు రూ.6.44 మేర ఇరిగేషన్ శాఖ నిధులు కట్టాల్సి వస్తుంది. అంటే పాత చార్జీల కంటే 4 పైసల భారం పరోక్షంగా వేసినట్లే. దీనికి తోడు విద్యుత్ సరఫరా వ్యయానికి, వసూలు చేస్తున్న చార్జీలకు పొంతన లేదు. గరిష్ఠంగా వసూలు చేస్తూ ఇరిగేషన్‌శాఖను సాధారణ వ్యాపార లావాదేవీలలా భావిస్తే ఎలా అన్న ప్రశ్న లేవనెత్తుతున్నారు. బడ్జెట్ మొత్తం కరెంటు బిల్లులకే పోయే ప్రమాదం కూడా పొంచివుంది. దీంతో ఎత్తిపోతల చార్జీల తగ్గింపునకు అధికారిక, అనధికారిక సంప్రదింపులు మొదలయ్యాయి. రూ.3 కే యూనిట్ విద్యుత్ చార్జీలు విధించాలని ఇరిగేషన్ శాఖ కోరుతోంది. దీంతో పాటు కొత్తగా ప్రతిపాదించిన డిమాండ్ చార్జీలను ఎత్తివేయాలని, వినియోగించిన మేర చార్జీలు వసూలు చేయాలని కోరుతున్నారు.

బల్వంత్‌జోషికి బాధ్యతలు : ఇదిలా ఉండగా ఇరిగేషన్ శాఖ మనోభావాలను స్పష్టంగా విద్యుత్ అధికారులకు, విద్యుత్ నియంత్రణ మండలి ముందు ఉంచడానికి ముంబైకి చెందిన బల్వంత్ జోషిని నియమించారు. ఫిబ్రవరి 12వ తేదీన ఫ్యాఫ్సీ భవన్‌లో జరిగే బహిరంగ విచారణలో ఇఆర్‌సి ముందు జోషి తన వాదనలు వినిపిస్తారు. ముంబైలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అడ్వైజరీ పేరుతో ఒక ప్రైవేట్ కంపెనీని జోషి నిర్వహిస్తున్నారు.



మన తెలంగాణ
3 హైదరాబాద్ బుధవారం 7, ఫిబ్రవరి 2018
www.manatelangana.news



నేడు టిటిడిపి నేతలతో చంద్రబాబు సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్: టిడిపి జాతీయ అధ్యక్షులు, ఎపి సిఎం ఎన్. చంద్రబాబు నాయుడు సమక్షంలో మాజీ ఎంఎల్ఎ బండి పుల్లయ్య టిడిపిలో చేరనున్నారు. ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం టిడిపి పొలిట్‌బ్యూరో సమావేశాన్ని చంద్రబాబు నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో తెలంగాణలో పార్టీ పరిస్థితులు, పల్లె పల్లెకు టిడిపి కార్యక్రమంపై చర్చించనున్నారు. ఇటీవల మోత్కుపల్లి నర్సింహులు చేసిన వ్యాఖ్యలపై ఇదే సమావేశంలో ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. అనంతరం ఏర్పాటు చేసిన సాధారణ సమావేశంలో చంద్రబాబు, బండి పుల్లయ్యకు కండువా కప్పి టిడిపిలోకి ఆహ్వానించనున్నారు. అంతకుముందు ఎన్‌టిఆర్ భవన్‌లో టిఎన్‌టియూసి రాష్ట్ర అధ్యక్షుడు బివిఎన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయ డెయిరీపై మంత్రి అబద్దాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజయ డెయిరీ సుమారు 6.50 లక్షల లీటర్లను సేకరించి సరఫరా చేసిందన్నారు. ఇప్పుడు అది 3.50 లక్షల లీటర్లకు పడిపోయిందన్నారు. గతంలో విజయ డెయిరీలో 1700 మంది డిస్ట్రిబ్యూటర్లు ఉండేవారని, ఇప్పుడు టిఆర్ ఎస్ ప్రభుత్వ అవగాహన లోపం వల్ల డిస్ట్రిబ్యూటర్లను తొలగించారన్నారు.

అసెంబ్లీ ప్రోరోగ్

మన తెలంగాణ/హైదరాబాద్: శాసనమండలి, శాసనసభలను గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ మంగళవారం ప్రోరోగ్ చేశారు. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ అయింది. నిరవధికంగా వాయిదా పడిన 80 రోజులు దాటిన తరువాత ఉభయ సభలు ప్రోరోగ్ అయ్యాయి. గత ఏడాది అక్టోబర్ 27న సమావేశమైన శాసనమండలి, శాసనసభలు నవంబర్ 17 వరకు కొనసాగాయి. యాభై రోజుల పాటు సమావేశాలు కొనసాగిస్తామని చెప్పినప్పటికీ వివిధ కారణాలతో 16 పని దినాల పాటు జరిగాయి. ఆ తరువాత వారం, పది రోజుల్లో పంచాయతీరాజ్ కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు వీలుగా సభను తిరిగి సమావేశపరిచే ఉద్దేశ్యంతో నిరవధికంగా వాయిదా వేసినట్లు అధికార పక్షం తెలిపింది. అనంతరం పంచాయతీరాజ్ చట్టానికి సంబంధించి బిల్లును రూపొందించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్ ఎన్నికలను ముందస్తుగానే ఫిబ్రవరిలో నిర్వహిస్తామని సమీక్షా సమావేశంలో స్వయంగా సిఎం కెసిఆర్ ప్రకటించారు. అందుకు అనుగుణంగా బిల్లు ఆమోదం పొందేందుకు రేపో మాపో సభను సమావేశపరుస్తారన్నట్లుగా పలుమార్లు ప్రచారం కూడా జరిగింది. చివరకు బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించడంతో ఉభయ సభలను ప్రోరోగ్ చేసినట్లు సమాచారం. దీంతో రైతు సమన్వయ సమితులు, ఇతర అంశాలకు సంబంధించి ఆర్డినెన్స్ తీసుకువచ్చే వెసులుబాటు ప్రభుత్వానికి కలగనుంది.

ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకురాలు డా. ఉషా శ్రీవాస్తవ మృతి



మన తెలంగాణ/న్యూఢిల్లీ: ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకురాలు డాక్టర్ ఉషా శ్రీవాస్తవ మరణించారు. గత కొద్ది కాలంగా అనారోగ్యం కారణంగా ఢిల్లీలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూనే ఆమె మంగళవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. లోధీ రోడ్‌లోని స్మశానవాటికలో బుధవారం ఉదయం 10:45 గంటలు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. డా. ఉషా ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు హెచ్.కె.వ్యాస్ కుమార్తె. ఆమె విద్యార్థిగా ఉండగా 70వ దశకంలో ఎఐఎస్‌ఎఫ్‌లో చురుకైన పాత్ర పోషించారు. అనంతర కాలంలో భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు)లో పని చేశారు. సిపిఐ జాతీయ సమితిలో ఆహ్వానితులుగా ఉన్నారు. ఆమె భర్త డాక్టర్ శంభు శ్రీవాస్తవ ఎఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు. అనంతరం ఆయన జనతాదళ్ (యునైటెడ్) అధికార ప్రతినిధిగా పని చేశారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. డా. ఉషా మృతిపై సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. సిపిఐ నాయకులు, కార్యకర్తల పట్ల ఆమె అత్యంత ఆత్మీయతగా ఉండేవారని గుర్తుచేశారు. ఆమె లేని లోటు పూడ్చలేనిదన్నారు. వారి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

పురుషోత్తంరెడ్డిపై లుకౌట్ నోటీస్

మన తెలంగాణ/సిటీబ్యూరో: అక్రమంగా ఆస్తులు కూడబెట్టిన హెచ్‌ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి విదేశాలకు పారిపోకుండా ముందస్తుగా విమానాశ్రయ అధికారులకు అతని సమాచారాన్ని ఎసిబి అధికారులు అందజేశారు. లుకౌట్ నోటీసును జారీచేసినట్టు తెలిసింది. మంగళవారం నగర శివారులోని పురుషోత్తంరెడ్డి ఫాంహౌస్‌లో ఎసిబి అధికారులు సోదాలు జరిపారు. ఆయన కుటుంబ సభ్యులు అధికారుల ముందు హాజరయ్యారు. రాధాచరణ్‌రెడ్డి, నిపుణ్‌రెడ్డి, నిషాంత్‌రెడ్డిలు హాజరైన వారిలో ఉన్నారని అధికారులు సూచనప్రాయంగా వెల్లడించారు. సుమారు రూ. 150 కోట్ల వరకు ఆయన ఆస్తులుగా ఉన్నట్టు అంచనావేస్తున్నారు. ఇప్పటి వరకు పురుషోత్తంరెడ్డి ఎసిబి అధికారులకు దొరకకుండా అజ్ఞాతంలో ఉన్నాడు.

ప్రభుత్వాన్ని నిలదీద్దాం : చాడ



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ ఉద్యమం సందర్భంగా నినదించిన 'మా భూములు మాకు, మా కొలువులు మాకు, మా నీళ్లు మాకు' కావాలని టిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. సబ్‌ప్లాన్ చట్టం కింద కేటాయించిన నిధులను గిరిజనుల సమగ్రాభివృద్ధికి, సంక్షేమం కోసం కేటాయించకుండా ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు దారిమళ్లించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ మఖ్దూంభవన్‌లో మంగళవారం జరిగింది. సదస్సుకు ఎం.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుండా మల్లేశ్, గిరిజన సమాఖ్య సీనియర్ నాయకులు ఆర్.శంకర్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ పాల్గొన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రభుత్వం ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్ చట్టం అమలు, రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం, విద్యా, వైద్యం కోసం ఉద్యమించాలన్నారు. తండాలకు, ఏజెన్సీ ప్రాంతాలకు విద్య, వైద్యం, రవాణ సౌకర్యాలు అందడం లేదన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం సబ్‌ప్లాన్ చట్టం అమలు చేయకుండా నీరుగారుస్తుందని విమర్శించారు. 2016 – 17 బడ్జెట్‌లో రూ.5035 కోట్లు కేటాయిస్తే రూ.1800 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. గుండ మల్లేశ్ మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలుకు నోచుకోవడం లేదన్నారు. రమావత్ అం జయ్య నాయక్ మాట్లాడుతూ గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి సిఎం మోసం చేశారని విమర్శించా రు.



సచివాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, పోచంపల్లి హ్యాండ్లూమ్స్ అంబాసిడర్ రేష్మీ ఠాగూర్

శెప్తైనె పంటలేశినం!

మూడు విడతల్లోనూ చివరి భూములకు అందని నీరు

- లక్ష ఎకరాల పంటకు దక్కని భరోసా
- ప్రభుత్వ హామీతోనే సాగు చేశామంటున్న అన్నదాతలు
- ఆందోళనలో పెద్దపల్లి జిల్లా రైతాంగం



కాల్వశ్రీరాంపూర్ మండలం వద్ద నీరు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కాలువ



మన తెలంగాణ/పెద్దపల్లి: అధికారుల అనాలోచిత నిర్ణయాలు, పాలకుల అత్యుత్సాహంతో పెద్దపల్లి జిల్లాలో శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలో లక్ష ఎకరాల్లో సాగవుతున్న పంటలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ప్రస్తుత సీజన్‌లో 90వేల ఎకరాల్లో వరి, 8వేల ఎకరాల్లో మొక్క జొన్న, మరో 2వేల ఎకరాల్లో వేరుశనగతో పాటు మొత్తంగా లక్ష ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. రబీకి ముందు ఒక్క ఎకరం ఎండనీయకుండా ఆయకట్టు చివరి భూములకు నీరందిస్తామని అధికారులు పాలకులు పదే పదే చెప్పడం వల్లే తాము వరి పంట సాగు చేశామని రైతులు ఆరోపిస్తున్నారు. రబీ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలకు నీరందక ఎండుముఖం పడుతున్నాయి. 8 రోజులు ఆన్ 7 ఆఫ్ ప్రాతిపదికన 8 విడతల పాటు పంటలు చేతికొచ్చే వరకు నీరిస్తామని రబీ యాక్షన్ ప్లాన్‌ను విడుదల చేసిన ప్రభుత్వం గడిచిన రెండు నెలల కాలంలో 3 విడతల్లో 3 రోజుల పాటు మాత్రమే నీటిని విడుదల చేశారు. ఫలితంగా జిల్లాలోని డి83,డి86 కాల్వల పరిధిలో పెద్దపల్లి, ధర్మారం, సుల్తానాబాద్, పాలకుర్తి మండలాల్లోని మెట్ట ప్రాంతాలతో పాటు ఆయకట్టు చివరి మండలాలైన కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, ముత్తారం మండలాలకు కాల్వ నీళ్లు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కమాన్‌పూర్, మంథని, ముత్తారం మండలంలో పరిమితంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు నీరు గుండారం రిజర్వాయర్ ద్వారా గడిచిన రెండేళ్లుగా కొంత ఆయకట్టుకు అందుతున్నా కాల్వలు సక్రమంగా లేకపోవడంతో నీరున్నా చేరని పరిస్థితి దాపురించింది. ఎండాకాలం ప్రారంభానికి ముందు ఇప్పటి వరకు మూడు విడుతల్లో విడుదల చేసిన నీరు జిల్లాలోని సగం పంటలకు చేరలేదని, ప్రస్తుత రబీ సీజన్ పూర్తి కావాలంటే మరో ఐదు విడతల పాటు నీటి విడుదల ఎలా సాధ్యమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మానేరు నది తీరాన్ని ఆనుకొని సుల్తానాబాద్, ఓదెల, కాల్వరాంపూర్ మండలాల్లో వరి సాగు చేసిన రైతులు కాల్వ నీళ్లపై ఆశలు వదులు కొని వట్టిపోయిన మానేరు నదిలో హైండ్ బోర్లు వేసేందుకు ఇప్పటి నుంచే అపర భగీరథ ప్రయత్నాన్ని మొదలు పెట్టారు.

పంటలకు పరిహారమియ్యాలె..



నీరందక ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలె. రబీలో చివరి అయకట్టు వరకు సార్లు నీళ్లందిత్తమంటెనే పంటలను సాగు చేసిన. నాకున్న మూడెకరాల్లో రెండకరాలు మొక్కజొన్న, ఎకరంలో వరి ఏశిన. నీళ్లందకపోవడంతో పంటలు ఎండిపోయినయి. అప్పుజేసి పెట్టుబడి పెడితే ఏం రాకుండా పోయేటట్టుంది. దయచేసి ప్రభుత్వం పంటకు పరిహారం ఇప్పిచ్చి ఆదుకోవాలె.

– బండ తిరుపతిరెడ్డి, లక్ష్మీపూర్

నీళ్లిచ్చి పంటల్ని కాపాడున్రి..



చివరి పంటలకు నీళ్లిత్తమంటె పంటలెశినం. రెండేండ్ల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని గుండారం రిజర్వాయర్ ద్వారా శ్రీరాంసాగర్ కాల్వలకు అనుసంధానం చేసి కొంత ఆయకట్టుకు సాగు నీరందిస్తున్నా కాల్వలు సక్కగలేక నీళ్లత్తలేవు. సార్లు మమ్ముల్ని జూసి కాల్వలు మంచిగజేసి చివరి పంటల వరకు నీళ్లందియ్యాలె.

– చెనవేని రవి, హరిపురం

30శాతం దళారులదే!

- కందుల దందాలో పావుగా మారిన రైతన్న
- ప్యాక్స్‌లలోనే భారీగా అక్రమాలు



మన తెలంగాణ/హైదరాబాద్: కందుల కొనుగోలు వ్యవహారంలో భారీ ఎత్తున గోల్‌మాల్ జరుగుతోంది. రైతులను పావులుగా ఉపయోగించుకుంటూ దళారులే దందా చేయిస్తున్నారు. ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేసిన కందులలో దాదాపు 30శాతం వరకు దళారుల నుంచే వచ్చినట్లు తెలిసింది. ఇప్పటి వరకు దాదాపు 1.25 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా, ఇందులో 41వేల క్వింటాళ్లు దళారుల నుంచి చేరినట్లు అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. సకాలంలో బ్యాంకు రుణం అందకపోవడంతో పంట వేసే ముందు కమిషన్ ఏజెంట్ల వద్ద రైతులు అప్పు తీసుకుంటారు. తరువాత వచ్చిన పంటను తిరిగి వారికే విక్రయించి, అప్పు పోను మిగతా సొమ్మును తెచ్చుకుంటారు. కందులకు మద్ధతు ధర క్వింటాకు రూ. 5450 ఉండగా దళారులు తమ దగ్గరకు వచ్చిన రైతులందరి దగ్గర రూ. 4 వేల నుంచి రూ. 4500 మధ్య కొనుగోలు చేస్తున్నారు. ఆ సమయంలోనే రైతుల దగ్గర నుంచి సంబంధిత ధ్రువపత్రాలు తీసుకుంటున్నారు. అలా కొనుగోలు చేసిన మొత్తం కందులను ఎప్పుడూ తమ దగ్గరకు వచ్చే ఒక రైతు ద్వారా ప్రభుత్వ కొనుగోలు సెంటర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు కూడా దళారులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కందుల కొనుగోళ్లలో అక్రమాలపై క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన రాష్ట్రస్థాయి అధికారుల బృందం పరిశీలనలో ఈ విషయాలు వెల్లడవుతున్నాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కొనుగోలు కేంద్రాలుగా వ్యవహరిస్తున్న చోట ఎక్కువగా అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ప్రభుత్వం ప్యాక్స్‌లలో కందుల కొనుగోళ్లను నిలిపివేసింది. సవరించిన అంచనాల ప్రకారం రాష్ట్రంలో 2.84 లక్షల టన్నుల వరకు కందుల ఉత్పత్తి రానుంది. ఈ ప్రతిపాదనల ప్రకారం కేంద్రం 1.13 లక్షల టన్నుల వరకు కొనుగోలు చేసేందుకు అనుమతించింది. ప్రైవేట్ మార్కెట్‌లో మద్ధతు ధర వచ్చే పరిస్థితి లేనందున దాదాపు 40శాతం 1.50 లక్షల టన్నుల కొనుగోలు చేసేందుకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతుంది. ఇదే విషయమై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్‌కు మంగళవారం సిఎం కెసిఆర్ లేఖ రాశారు.

బకాయిలు చెల్లించండి..

కంది రైతాంగానికి వెంటనే బకాయిలను చెల్లించాలని సిఎల్‌పి ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నాఫెడ్ ద్వారా రైతాంగం నుండి కందులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని, కాని డబ్బులు మాత్రం చెల్లించలేదన్నారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకోవడానికి పార్లమెంట్‌లో టిడిపి, వైసిపి ఎంపిలు ఆందోళన చేస్తుంటే, టిఆర్‌ఎస్ ఎంపిలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. టిఆర్‌ఎస్, బిజెపిల రహస్య ఎజెండా ఏమిటని అన్నారు. నల్లగొండలో ఇటీవల జరిగిన రాజకీయ హత్యపై మంత్రి జగదీశ్‌రెడ్డి కాంగ్రెస్ అంతర్గత కలహాలుగా మాట్లాడటం సరికాదని, చిత్తశుద్ధి ఉంటే నల్లగొండ, ఖమ్మంలలో జరిగిన రాజకీయ హత్యలపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

గొర్రెల పంపిణీ అధ్యయనం తాత్కాలిక వాయిదా : తలసాని



మన తెలంగాణ/హైదరాబాద్ : గొర్రెల అభివృద్ధి పథకంపై అధ్యయనం చేయాలని భావించినప్పటికీ, ఈ పథకం ద్వారా కలిగిన లబ్ధిని అంచనా వేసేందుకు ఒక సంవత్సర కాలం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉన్నందున తాత్కాలికంగా వాయిదా వేసిన పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గొర్రెల యూనిట్ల పంపిణీ 2 లక్షల యూనిట్లకు చేరిన సందర్భంగా మంగళవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన సబ్సిడీ గొర్రెలను అమ్ముకోకుండా గొర్రెల పెంపకందారుల ప్రాథమిక సంఘాలు బాధ్యత వహించాల్సిందిగా సిఎం కెసిఆర్ పలుమార్లు సూచించారని తెలిపారు. ఈ పథకం ద్వారా కొనుగోలు చేసిన గొర్రెల ఆరోగ్య సంరక్షణకై ఒక యూనిట్‌కు రూ. 425తో ప్రత్యేకమైన మందులను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. గొర్రెలకు అవసరమైన మేతను అందించేందుకు ప్రభుత్వం 75 శాతం రాయితీపై 197 మెట్రిక్ టన్నుల స్టైలో హెమాటా రకం గడ్డి విత్తనాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.


రెండు వారాల్లో టి ఫైబర్ టిడిఎన్ పూర్తి

- టిఎస్ఐఐసి అధికారులతో సమీక్షలో ఐటి మంత్రి కెటిఆర్





మన తెలంగాణ/హైదరాబాద్: టి ఫైబర్ ఆధ్వర్యంలో చేపడుతున్న టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ నెట్‌వర్క్ (టిడిఎన్) మరో రెండు వారాల్లో పూర్తవుతుందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామరావు తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని నాలుగు గ్రామాల్లో ఈ పనులు కొనసాగుతున్నాయని, ఇవి పూర్తి అయితే ఈ గవర్నెన్స్, ఈ ఎడ్యుకేషన్, ఈ హెల్త్ రంగాల్లో టి ఫైబర్ ప్రాజెక్టు ద్వారా రానున్న మార్పులను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. బషీర్‌బాగ్‌లోని టిఎస్ఐఐసి కార్యాలయంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టిఎస్ఐఐసి చైర్మన్ బాలమల్లు, వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ. వెంకట నర్సింహారెడ్డి, టి ఫైబర్ యండి సుజయ్ కారంపురి ఇతర అధికారులతో పరిశ్రమలు, ఐటి శాఖ పరంగా కొనసాగుతున్న పలు కార్యక్రమాలపై కెటిఆర్ సమీక్షించారు. ముఖ్యంగా ఐటి శాఖ పరిధిలోని టి – ఫైబర్, టి– వర్క్స్ (హార్డ్‌వేర్ ఇంక్యుబేటర్), టి– క్లౌడ్ వంటి కార్యక్రమాల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. టి ఫైబర్ ఆధ్వర్యంలో చేపడుతున్న టిడిఎన్‌పై ఈ సందర్భంగా మాట్లాడారు. ఇంటింటికీ ఇంటర్‌నెట్ ద్వారా కలిగే ప్రయోజనాలను రానున్న వరల్డ్ ఐటి కాంగ్రెస్ సదస్సులో ఈ నెట్ వర్క్ ద్వారా ప్రదర్శిస్తామని కెటిఆర్ అన్నారు. వచ్చే వారం ఈ నెట్ వర్క్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్‌ను ఆదేశించారు. టి వర్క్స్ డిజైన్లకు తుది ఆమోదం లభించనుందన్నారు. ఈ డిజైన్ల మేరకు టి వర్క్స్ మొదటి దశ జూన్ నాటికి పూర్తి అవుతుందని మంత్రి తెలిపారు. టి – క్లౌడ్ ఏర్పాటు కోసం ఐటి శాఖ చేపడుతున్న పనిని మంత్రి సమీక్షించారు. టి క్లౌడ్ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ఇలాంటి కార్యక్రమం చేపట్టిన దేశాలు , లేదా రాష్ట్రాలు ఉంటే వాటి అనుభవాలను అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు. టిఎస్ఐఐసి చేపడుతున్న పలు కార్యక్రమాలను సైతం ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కులో అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుకు రెవెన్యూశాఖ 20 ఎకరాల స్థలాన్ని కోరినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. పార్కు పనులు వేగంగా పూర్తిచేసి పెట్టుబడులకు అంగీకరించిన కంపెనీలు ప్రారంభం అయ్యేలా చూడాలన్నారు. ఇందుకోసం అవసరం అయితే స్థానిక ఎంఎల్‌ఎ ధర్మారెడ్డి సహకారం కూడా తీసుకోవాలని సూచించారు. డ్రైపోర్టుల ఏర్పాటుపైన మంత్రి సమీక్షించారు. వీటి ఏర్పాటు కోసం ఇంతకు ముందు గుర్తించిన భువనగిరి, జహీరాబాద్, జడ్చర్ల వంటి ప్రాంతాలతో పాటు రాష్ట్రానికి నలువైపులా ఉన్న మరిన్ని ప్రాంతాలను పరిశీలించాలని కోరారు. టిఎస్ఐఐసి చేపట్టిన మెడికల్ డివైజెస్ పార్కు పురోగతి పైన కెటిఆర్ సమీక్షించారు. ఇప్పటికే అక్కడ 9 కంపెనీలకు అనుమతులు ఇచ్చామని, దీంతో పాటు జహీరాబాద్ నిమ్జ్, దండు మల్కాపూర్‌లోని గ్రీన్ ఇండస్ట్రియల్ యంఎస్‌ఎంఈ పార్కు, మెగా ఫుడ్ పార్కు, సీడ్ పార్కుల పనుల పురోగతిని మంత్రి కెటిఆర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.



"నిరాడంబరంకన్నాగొప్పది ఏదీ లేదు. గొప్పదనం ఎప్పుడూ నిరాడంబరంగానే ఉంటుంది. – ఎమర్సన్"

మాల్దీవుల పరిణామాలు

సంపాదకీయం

ఇండియా చేరువనే ఉన్న హిందూ మహాసముద్ర ద్వీపదేశం మాల్దీవులలో తల ఎత్తిన రాజకీయ సంక్షోభం అక్కడ ప్రజాస్వామ్యాన్ని చెరబట్టింది. వాస్తవానికి మాల్దీవులలో ప్రజాస్వామ్య వ్యవస్థ నిరంతరం పడగనీడలోనే బిక్కుబిక్కుమని బతుకుతూ వచ్చింది. ఎన్నికలు జరగడం వాటిద్వారా ప్రభుత్వాలు ఏర్పడడం అనేది బయటికి కన్పిస్తున్న దృశ్యమే తప్ప లోలోపల ఎప్పుడూ కుట్రలూ, తిరుగుబాట్లతోనే అక్కడి ప్రజాస్వామ్యం కునుకుతూ ఉంది. తాజాగా దేశాధ్యక్షుడు అబ్దుల్లా యమీన్‌కు, సుప్రీంకోర్టుకు మధ్య తల ఎత్తిన ఘర్షణ ఎమర్జెన్సీకి, న్యాయమూర్తుల అరెస్టుకు దారితీసింది.

ఏ దేశంలోనైనా పాలనా వ్యవస్థకు రాజ్యాంగం కవచం వంటిదైతే దాని కంటికి రెప్పవంటిది న్యాయవ్యవస్థ. దాని అత్యున్నత ధర్మపీఠం సుప్రీంకోర్టు. అధ్యక్షుడు యమీన్ ఇప్పుడు నేరుగా సుప్రీంకోర్టునే ఢీకొన్నాడు. చీఫ్ జస్టిస్‌ను మరో కీలక న్యాయమూర్తిని అరెస్ట్ చేయించాడు. మాల్దీవులను 30 ఏళ్లపాటు పాలించిన తన జ్ఞాతి అబ్దుల్ గయూమ్‌ను కూడా నిర్బంధంలోకి తీసుకున్నాడు. ఎమర్జెన్సీ ప్రకటనతో అనుమానితులనే నెపంతో ఎవరినైనా అరెస్ట్ చేసే అధికారం భద్రతా దళాలకు, పోలీసులకు సంక్రమించింది.

స్వదేశంలో శిక్ష పడి ప్రస్తుతం ప్రవాసిగా తలదాచుకుంటున్న మాజీ దేశాధ్యక్షుడు మహమ్మద్ నషీద్ సహా తొమ్మిదిమంది రాజకీయ ఖైదీలపై కేసును కొట్టివేస్తూ వారిని విడుదల చేయాలని, 12మంది పార్లమెంటు సభ్యుల సభ్యత్వాలను పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పే ఈ చీకటి పరిణామాలకు దారితీసింది. ఈ తీర్పును అమలు చేస్తే ప్రెసిడెంట్ యమీన్ పదవినుంచి తొలగిపోక తప్పని పరిస్థితి తలెత్తుతుంది. అందుకే దానిని తిరస్కరించి ఆయన అత్యవసర పరిస్థితిని విధించాడు.

2013లో యమీన్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి మాల్దీవులలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు, ప్రతిపక్ష నేతల అరెస్టులు సర్వసాధారణమైపోయాయి. శాసనసభ్యత్వాల పునరుద్ధరణకు సుప్రీంకోర్టు ఆదేశించిన 12 మంది గతంలో అధ్యక్షుడు యమీన్ పార్టీ నుంచి ప్రతిపక్షంలోకి ఫిరాయించిన వారే. వారు తిరిగి చట్టసభలో అడుగుపెడితే యమీన్ పార్టీ మైనార్టీలో పడిపోయి ఆయన అధికారాన్ని కోల్పోతాడు.

బ్రిటిష్ వలస పాలననుంచి స్వాతంత్ర్యం పొంది 1968లో రిపబ్లిక్‌గా ఏర్పడి ఇబ్రహీం నసీర్ అధ్యక్షతన ప్రజాస్వామ్య ప్రభుత్వం అవతరించినప్పటికీ 1970లలో తల ఎత్తిన రాజకీయ సంక్షోభంలో ఎన్నికైన అప్పటి ప్రధాని అహ్మద్ జకీ అరెస్టయ్యాడు. చివరకు అధ్యక్షుడు నసీర్ కూడా విశేష ధనరాశులతో 1978లో సింగపూర్‌కు పారిపోయాడు. అప్పటినుంచి అబ్దుల్ గయూమ్ 30ఏళ్లపాటు ఏకచ్ఛత్రాధిపత్యం వహించాడు. నియంతగా మారిపోయాడు. నసీర్ మద్దతుదారులు ఆయనపై మూడుసార్లు తిరుగుబాటు చేశారు. 1988లో శ్రీలంకకు చెందిన 80మంది తమిళ ఈలం వాద కమాండోలు మాల్దీవుల రాజధాని మాలె విమానాశ్రయాన్ని స్వాధీనం చేసుకుని గయూమ్‌ను, ఆయన ప్రభుత్వాన్ని గడగడ లాడించిన సమయంలో ఇండియా 1600మంది సైనికులను అక్కడ దింపి ఆ కుట్రను భగ్నం చేసి ఆయన సర్కారును కాపాడింది. భూలోక స్వర్గసీమ అనదగిన, బీచ్ పారడైజ్‌గా ప్రసిద్ధిగాంచిన మాల్దీవులు తాజా విపత్కర పరిణామాలనుంచి ఎలా బయటపడగలుగుతుందనేది ఉత్కంఠతో కూడుకున్న ప్రశ్న.

ఇండియాకు సన్నిహితంగా వుంటూవచ్చిన మాల్దీవులు ఇప్పుడు చైనాకు చేరువగా వుంటున్నట్లు సమాచారం. అందుచేత మనం మెళకువతోనూ, వ్యూహ నేర్పుతోనూ వ్యవహరించవలసి ఉంటుంది. అమెరికా ఇప్పటికే అధ్యక్షుడు యమీన్ చర్యలను ఖండిస్తూ ప్రకటన విడుదల చేసింది. పర్యాటకరంగంనుంచే ప్రధాన ఆదాయాన్ని పొందుతున్న మాల్దీవులకు వచ్చిపోయే వారికి, అక్కడ గల విదేశీయులకు ఎటువంటి హాని కలుగనివ్వబోమని అధ్యక్షుడి కార్యాలయం ప్రకటించింది. అయినా అక్కడి పరిస్థితి నమ్మదగినంత ప్రశాంతంగా లేదన్నది వాస్తవం. భారత్ సహా అంతర్జాతీయ సమాజం కల్పించే ఒత్తిడి వల్ల మాత్రమే సంక్షోభం పరిష్కారమయ్యే అవకాశాలున్నాయి. మాజీ అధ్యక్షుడు నషీద్ మాత్రం ఇండియా వైపే ఆశగా చూస్తున్నారు.

విదేశీ విరాళాల బండారం

చూపు


విదేశీ కంపెనీల నుంచి విరాళాలు అందుకున్న నేరం బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు అంటకుండా చేయడానికి ఆర్థిక బిల్లులో విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ చట్టా(ఎఫ్‌సిఆర్‌ఎ)నికి మళ్లీ సవరణ చేర్చారు. ఆ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ఆరోపణపై పలు ఎన్‌జిఒ సంస్థలపై ప్రభుత్వం విరుచుకు పడుతున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. 2016 ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఆ ఏడాది ఆర్థిక బిల్లులో ఎఫ్‌సిఆర్‌ఎ చట్టానికి సవరణ ప్రతిపాదించారు. దానిద్వారా బిజెపి, కాంగ్రెస్ రెంటికీ 2010నాటి ఎఫ్‌సిఆర్‌ఎ ఆంక్షల నుంచి రక్షణ లభించింది. ఆ పార్టీలు రెండూ 2016లో లండన్‌లోని అంతర్జాతీయ సంస్థ వేదాంత నుంచి విరాళాలు స్వీకరించాయి. 2014లో ఢిల్లీ హైకోర్టు ఆ రెండు పార్టీలనూ ఎఫ్‌సిఆర్‌ఎ ఉల్లంఘన దోషులుగా నిర్ధారించింది. వాటిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను తప్పించుకోవడానికి ఆ సవరణ తెచ్చారు.

ఎఫ్‌సిఆర్‌ఎ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆరోపణపై పలు ఎన్‌జిఒల బ్యాంకు ఎకౌంట్‌లను ప్రభుత్వం స్తంభింపచేసింది. ఆయా సంస్థలలో గ్రీన్ పీస్, సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ వంటివి కూడా ఉన్నాయి. మత వ్యతిరేక కార్యకలాపాల కార్యకర్త టీస్టా సెతల్వాడ్‌పై క్రిమినల్ విచారణను ప్రారంభించింది కూడా. 2016 సవరణ ద్వారా విదేశీ కంపెనీలకు నిర్వచనాన్ని 'భారతీయ' కంపెనీగా మార్చారు. ఎఫ్‌సిఆర్‌ఎ తాజా రూపం అమలులోకి వచ్చిన 2010 నుంచి కొత్త నిర్వచనం అమలులోకి వచ్చింది. దీనర్థం ఏమిటంటే 2010కి ముందు అందిన విదేశీ కంపెనీల విరాళాలు ఆ సవరణ కిందకు రావు. వేదాంత విరాళాలు 2010కి ముందు నాటివి.

ఎఫ్ సిఆర్‌ఎకు మళ్లీ మళ్లీ మార్పులు

2018 ఆర్థిక బిల్లులో కొత్త సవరణ 2016 నాటి చట్టాన్ని సవరించటానికి ఉద్దేశించింది. 1976 ఆగస్టు 5 తరువాత అందిన విరాళాలకు గాను బిజెపి, కాంగ్రెస్ పార్టీలను దోషులను చేయకుండా కాపాడటానికి ఉద్దేశించిన మార్పు అది. 1976నాటి అసలైన విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ చట్టం (ఎఫ్‌సిఆర్‌ఎ) ఆ తేదీన అమలులోకి వచ్చింది. 1976నాటి చట్టాన్ని రద్దు చేసి 2010లో స్వల్ప మార్పులతో వేరే చట్టాన్ని అమలులో పెట్టారు. 2018 ఆర్థిక బిల్లులోని సవరణ ఆమోదం పొందితే 2010కి ముందు రూ.5కోట్ల విలువగల విరాళాలను విదేశీ కంపెనీలనుంచి అందుకున్న బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు నేరం అంటదు.

2018 ఆర్థిక బిల్లు ప్రకారం బిల్లులోని 2017 క్లాజు 2016 ఆర్థికచట్టం సెక్షన్ 236ను సవరించటానికి ఉద్దేశించినది. 2010 ఫెరా చట్టంలోని కొన్ని క్లాజులు, సబ్‌క్లాజుల సవరణకు సంబంధించిన ప్రతిపాదన అది. 2016 సవరణ విదేశీ కంపెనీ నిర్వచనాన్ని మార్చింది. ఏదన్నా కంపెనీ షేర్ కాపిటల్ విలువ సాధారణ విదేశీ పెట్టుబడుల పరిమితులకు లోబడి ఉంటే అది విదేశీ సంస్థగా పరిగణనలోకి రాదు. ఇది ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వు నుంచి బిజెపి,కాంగ్రెస్ పార్టీలను రక్షించడంతోపాటు భారతీయ రాజకీయ పక్షాలకు వందలాది విదేశీ కంపెనీలు విరాళాలు అందించడానికి తలుపులు తెరిచింది.



2016 డిసెంబర్‌లో ఢిల్లీ హైకోర్టు తీర్పుపై బిజెపి, కాంగ్రెస్ పార్టీలు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అప్పీళ్లను ఉపసంహరించుకున్నాయి. విదేశీ కంపెనీ భారతీయ అనుబంధ సంస్థ నుంచి విరాళాలు స్వీకరించవచ్చునని సవరణ సూచిస్తున్నందున ఢిల్లీ హైకోర్టు 2014 మార్చి ఉత్తర్వును సవాలు చేయవలసిన అవసరం లేనేలేదని బిజెపి తరపు న్యాయవాది శ్యాం దివాన్ అప్పట్లో పేర్కొన్నారు. తాజా ఆర్థికబిల్లు సవరణ కీలకమైనది–ఎందుకంటే 2016 నాటి సవరణ 2010 నుంచి ఉభయపార్టీలకు విదేశీ విరాళాల మసి అంటకుండా చేస్తోంది కాబట్టి. ఎఫ్‌సిఆర్‌ఎ పై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంస్థ 2016నవంబర్‌లోనే తాజా సవరణను ఊహించింది. తమ రక్షణకు మరింత ఖచ్చితమైన క్లాజును పొందుపరుస్తూ ప్రభుత్వం మరో సవరణ ప్రవేశపెట్టవచ్చని నాడే ఆ సంస్థ తెలిపింది. 2018 ఆర్థిక బిల్లు సవరణ ఆమోదం పొందితే ఆ సంస్థ చెప్పిన జోస్యం నిజమవుతుంది. 2010కి ముందుకూడా విదేశీ సంస్థల భారతీయ అనుబంధ శాఖల నుంచి కాంగ్రెస్, బిజెపిలు విరాళాలందుతున్న ఉదంతాలు 25 దాకా ఉన్నాయి. కాంగ్రెస్, బిజెపిలకు విరాళాలు అందించిన సంస్థలలో స్టెరిలైట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, సేసా గోవా లిమిటెడ్, అదానీ విల్మర్ లిమిటెడ్, సోలారీస్ హోల్డింగ్ లిమిటెడ్, విన్ మెడికేర్ ప్రై.లిమిటెడ్, డౌ కెమికల్ ప్రై.లిమిటెడ్, వేదాంత ది మద్రాస్ అల్యూమినియం లిమిటెడ్, కంపెనీలు ఉన్నాయి.

ఇవన్నీ విదేశీ కంపెనీల భారతీయ అనుబంధ సంస్థలు. వీటి నుంచి ఆ రెండు పార్టీలు భారీగా విరాళాలు అందుకున్నాయి. అయితే విదేశీ కంపెనీలనుంచి విరాళాలు అందుకున్నాయంటూ కొన్ని ఎన్‌జిఒల పై ప్రభుత్వం విరుచుకుపడుతూ మరోపక్క తమకు విరాళాల మసి అంటకుండా ఎఫ్‌సిఆర్‌ఎ చట్టాన్ని పదేపదే సవరించడం ఏమి న్యాయమని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పార్టీల విరాళాలకు సంబంధించిన నియమాలను బడ్జెట్‌లో భాగంగా పొందుపరిచే ఆనవాయితీని మోడీ ప్రభుత్వం అనుసరిస్తోంది.

ఎన్నికల సంస్కరణలలో భాగంగా పార్టీలకు విరాళాలని క్రమబద్ధం చేయాలన్న డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. అయితే ఆడిమాండ్‌ను ప్రక్కన బెట్టి విదేశీ వికాళాలకు దొడ్డిదోవలో ఆమోదముద్ర వేయించుకొనే పనిలో ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వం మునిగింది. రూ. 20 వేల మొత్తంలో విరాళాలను చూపి పన్ను బాధ్యతనుంచి అవి తప్పించు కొంటున్నాయి. ఎందుకంటే రూ. 20వేల విరాళానికి లెక్క చూపనక్కరలేదని నియమం ఉంది. దీనిని అనుసరించి పార్టీలు తమ విరాళాలను ఏకమొత్తంగా చూపకుండా రూ.20 వేలు చొప్పున విడివిడిగా చూపుతూ బాధ్యత నుంచి తప్పించు కొంటున్నాయి. ఇది ప్రజలను. ప్రజా ప్రభుత్వాన్ని వెక్కిరించడమేనని విమర్శకులు ఘోషిస్తున్నారు. విరాళాల మసి పార్టీలకు అంటకుండా బడ్జెట్ బడ్జెట్‌కూ మోడీ సర్కార్ ఓ కొత్త ముసుగు వేస్తోంది.

* అనూజ్ శ్రీవాస్

అసమానతల గుప్పెట్లో భారత్

భారత్ సహా ప్రపంచంలోని పలు దేశాల్లో సంపన్నులకు, పేదలకు మధ్య అంతరాలు, అసమానతలు రానురానూ పెరిగిపోతున్నాయి. ఈ అసమానతలు ఇటీవలే బయటపడిన కొత్త విషయం ఏమీ కాదు. 1980 దశకం తరువాత పలు సమాజాలలో పేదలు, బలహీనవర్గాల వారిని రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అణచివేయటం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా వర్థమాన దేశాలలో ఇలా జరుగుతోంది. సమగ్ర సమాచారం లోపించడంతో అంతకుముందు కాలంలో ఈ అసమానతల తీరు ఎలా ఉండేదో స్పష్టంగా వెల్లడి కాలేదు. ముఖ్యంగా వర్థమాన దేశాలలో ఈ సమాచార లోపం ఆ కాలంలో ఎక్కువ. 2018 ప్రపంచ అసమానతల నివేదిక ద్వారా ఈ సామాజిక అంతరాల సమాచారం స్పష్టం గా అందుబాటులోకి వచ్చింది. ముఖ్యంగా అభివృద్ధిచెందిన, చెందుతున్న దేశాల మధ్య అసమానతల సమాచారం సుస్పష్టంగా 2018 నివేదిక పొందుపరిచింది.

చైనా, ఇండియా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, రష్యా, మధ్యప్రాచ్య దేశాలలో ఈ అసమానతలు ఏ తీరుగా పెరిగిపోతున్నాయో ఈ నివేదిక స్పష్టం చేసింది. దేశాల మధ్య ఈ అసమానతలలో స్థాయీ భేదం కూడా ఉంది. సమాజంలోని వేర్వేరు జనసమూహాలలో వయోవృద్ధుల సగటు ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకొని ఈ అసమానతలు లెక్కకట్టారు. జాతీయ ఆదాయంలో వ్యక్తుల సగటు వాటా ఎంత అన్నది లెక్కకట్టారు. 1980 దశకం తర్వాత ప్రపంచీకరణ అనంతర కాలంలో దేశాల జనాభాలోని అగ్రస్థానం లో గల పదిశాతం మంది ఆదాయాలు విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా అమెరికా, కెనడా, యూరప్, భారత్, చైనా, రష్యా జనాభాలలో అగ్రస్థానంలోని పదిశాతం మంది ఆదాయ వివరాలను నివేదిక పేర్కొంది.

భారతదేశపు జాతీయ ఆదాయంలో ఈ పదిశాతం వాటా 55శాతం దాకా ఉంది. 1980 ప్రాంతంలో ఇది సగటున 32 శాతం ఉండేది. తరువాతి స్థానాలలో అమెరికా, కెనడా,రష్యా, చైనా, యూరప్ ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం, ప్రపంచీకరణ మధ్యకాలంలో అసమానతల ధోరణులను ఈ నివేదిక అంచనా వేసింది. అంటే 1950 నుండి 1980 మధ్యకాలం. అది ప్రధానంగా శ్రేయో రాజ్య పోకడలు కనబడిన కాలం. జాతీయ ఆదాయంలో అగ్రస్థాయి పదిశాతం జనాభా ఆదాయాన్ని ప్రపంచవ్యాప్తంగా లెక్కగట్టారు. 2016లో మధ్య ప్రాచ్య దేశాల జాతీయ ఆదాయాలలో 61 శాతం ఈ పదిశాతం జనాభాకు దక్కింది. భారత్, బ్రెజిల్ దేశాలలో ఇది 55 శాతం దాకా ఉంది. ఉపసహారా ఆఫ్రికాలో 54శాతం, అమెరికా–కెనడాలలో 47శాతం, చైనాలో 41శాతం, రష్యాలో 46 శాతం, యూరప్‌లో 37శాతంగా ఈ ఆదాయం ఉంది.

జనాభాలో అగ్రభాగాన నిలిచే ఒక్కశాతం మందికి జాతీయ ఆదాయంలో దక్కుతున్న వాటా ఇంచుమించు అన్ని దేశాలలో ఒకే విధంగా ఉంది. బ్రెజిల్‌లో 27 శాతం, మధ్యప్రాచ్యంలో 25శాతం జాతీయ ఆదాయం జనాభాలోని ఒక్క శాతం సంపన్నులకు దక్కింది. ఈ జాబితాలో భారత్ మూడవస్థానంలో ఉంది. భారత్‌లోని ఒక్క శాతం జనాభా జాతీయ ఆదాయంలో 74 శాతాన్ని సొంతం చేసుకుంది. అమెరికా – కెనడా, సబ్‌సహరన్ ఆఫ్రికాలలో ఇది 20శాతం ఉంది. చైనా జనాభాలోని ఒక్కశాతం మంది సంపన్నులు జాతీయ ఆదాయంలో 14శాతం సొంతం చేసుకున్నారు. యూరప్‌లో ఇది అతి తక్కువగా 13శాతం ఉంది. వివిధ దేశాల మధ్య ఈ అసమానతలలో స్థాయీబేధాలు ఉండడానికి దేశీయ, విదేశీ విధానాలలో అసమానతలు ముఖ్యకారణం. ఆదాయ కార్యకలాపాలపై కేంద్రప్రభుత్వ కేంద్రీకృత అదుపు మూలంగా ప్రపంచీకరణ కాలంలో శ్రేయోరాజ్య పోకడలు కనపడ్డాయని చెప్పవచ్చు.

1980దశకం తరువాత మాత్రం నయా స్వేచ్ఛావాద, సరళీకృత ఆర్థిక విధానాలను అనుసరించడం వల్ల దేశాభివృద్ధి కుంటుపడింది. అభివృద్ధి, సామాజిక

> జనాభాలో అగ్రభాగాన నిలిచే ఒక్క శాతం మందికి జాతీయ ఆదాయంలో దక్కుతున్న వాటా ఇంచుమించు అన్ని దేశాలలో ఒకే విధంగా ఉంది. బ్రెజిల్‌లో 27 శాతం, మధ్య ప్రాచ్యంలో 25శాతం జాతీయ ఆదాయం జనాభాలోని ఒక్క శాతం సంపన్నులకు దక్కింది. ఈ జాబితాలో భారత్ మూడవస్థానంలో ఉంది. భారత్‌లోని ఒక్క శాతం జనాభా జాతీయ ఆదాయంలో 74 శాతాన్ని సొంతం చేసుకుంది.

సేవ రంగాలపై ప్రభుత్వ వ్యయాలు తగ్గడమే ఇందుకు కారణం. పర్యవసానంగా ఆర్థికవ్యవస్థ ప్రైవేటు మార్కెట్ల గుప్పిట్లో బందీగా మిగిలింది. 1980–2016 మధ్య భారత్, చైనాలో వివిధ గ్రూపు ల ఆదాయ, వృద్ధి రేట్లను ఈ నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. చైనాలో మొత్తంమీద జనాభా ఆదా యం భారత్‌లో కంటే 3.7రెట్లు అధికమైంది. సమాజంలో దిగువన ఉండే 50శాతం మంది ఆదాయం భారత్‌లో కంటే చైనాలో నాలుగురెట్లు పెరిగింది.

భారతదేశంలో అట్టడుగు నుండే 90శాతం జనాభా ఆదాయం చైనాలో కంటే చాలా తక్కువగా ఉంది. ఇది ఈ రెండు దేశాల మధ్య వ్యత్యాసాలలో స్థాయీ భేదాలను కళ్లకు కడుతోంది. సంపదలో అగ్రభాగాన నిలిచే 10శాతం మంది, మధ్య నిలిచే 40 శాతం మంది ఆదాయాలలో వ్యత్యాసాలను లెక్కకడితే తేలిందేమంటే భారతదేశంలో అగ్రస్థాయి పది శాతం మంది ఆదాయం మధ్యలో గల 40శాతం మంది ఆదాయంకంటే 4.8రెట్లు అధికమైంది. ఈ పెరుగుదల చైనాలో 1.6రెట్లు ఉంది. అనేక ఆర్థిక, సామాజిక మార్పులను చవిచూసినందువల్ల పలు సూచీల విషయంలో భారత్ కంటే చైనా ముందుకు దూసుకుపోయింది. ముఖ్యంగా మానవ అభివృద్ధి సూచిక(హెచ్‌డిఐ), లింగభేదాల సూచిక వంటి సంకేతాలలో ఈ తేడా కనపడుతోంది.

2016లో వీటి విషయంలో చైనా, భారత్‌ను బాగా అధిగమించింది. బహుముఖ ప్రభావం చూపే పేదరికం సూచిక విషయంలో భారత్(0.28) కంటే చైనా(0.03)తో ముందుంది. ఇరుదేశాలలోనూ అసమానతలు అత్యధిక స్థాయిలో ఉన్నప్పటికీ జీవించే కాలం, సాధారణ విద్య, అందరకూ సమగ్ర ఆరోగ్య రక్షణ వంటి విషయాలలో భారత్ కంటే చైనా మెరుగ్గా ఉంది. ఈ రెండు దేశాల రాజకీయ లక్ష్యాల లో, సంస్కరణ అభిలాషలో తేడాను అసమానతలలో స్థాయీభేదాలు వెల్లడిస్తున్నాయి. చైనాలో సోషలిస్టు విప్లవం సాగినంతకాలం భూస్వామ్య వర్గం తన ఆర్థిక, సామాజిక హోదాను కోల్పోవడం జరిగింది. అయితే భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం భూస్వామ్య వర్గం తన పట్టును పెంచుకుంది. భారత దేశంలో రాజకీయ వ్యవస్థ భూముల పంపిణీని సాగించడంలో విఫలమైంది. వ్యవసాయ సంస్కరణలు స్వాతంత్ర్యానంతరం పూర్తిగా కుంటుపడ్డాయి.

భూముల పంపిణీ సక్రమంగా చేయకుండా భూకమతాలపై పరిమితి భారత్‌లో అమలైంది. కేరళ లో 1969లో, పశ్చిమ బెంగాల్‌లో 1977లో భూము ల పంపిణీ సంస్కరణలు అమలులోకి వచ్చాయి. నమూనా గ్రామాల నిర్మాణానికి అమెరికా ఫోర్డ్ ఫౌండేషన్, పాయింట్ ఫోర్ పథకం భారత్‌లో స్వాతంత్ర్యానంతరం అమలు చేశారు. మొత్తానికి కొత్త సామాజిక రూపాన్ని సాధించడంలో భారత్ విఫలమైంది.

1952 నాటికి చైనాలో 35శాతం జాతీయ స్థూల పెట్టుబడికి వ్యవసాయ రంగం నుంచి ఆర్థిక సహాయం అందింది. మొత్తానికి ఆర్థిక, సామాజిక రంగాలలో చైనా వేగం అందుకున్నప్పటికీ భారత్ భూసంస్కరణల విషయంలో తప్పటడుగులు వేస్తోంది. అందుకే 1978 లో ప్రారంభమైన చైనా ఆర్థిక సంస్కరణలు ఇతర దేశాలలో కంటే భిన్నమైన ప్రభావాన్ని చూపాయి. భారత్, మధ్య–తూర్పు యూరప్, కామన్‌వెల్త్ స్వతంత్ర్య దేశాలలో పరిస్థితుల కంటే చైనాలో పరిస్థితి 1978నాటికి భిన్నంగా ఉన్నాయి.

భారత్ సహా పలు దేశాలలో భిన్నమైన రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు నెలకొన్నాయి. కొన్ని దేశాలలో కమ్యూనిస్టు లేదా సోషలిస్టు వ్యవస్థలు పరిఢవిల్లాయి. అందుకే అన్నిచోట్లా అసమానతలు ఒకే పద్ధతిలో కాకుండా స్థాయీభేదాలతో కూడుకుని ఉన్నాయి. ఆయా దేశాలలో అమలులో ఉన్న విధానాలను బట్టి అసమానతల స్థాయి ఉంటుందని 2018 సామాజిక అంతరాల నివేదిక చెబుతున్నది ముమ్మాటికి నిజం.

* అబూ అఫ్జల్ తహీద్, అన్‌స్తితా శర్మ

బ్యాంకులంటే ప్రజలకు నమ్మకం పోతున్నదా?



సూరం అనిల్,
9059457045

ప్రభుత్వం గుర్తింపుపొందిన ఆర్థిక సంస్థే బ్యాంక్. బ్యాంక్ ప్రాథమికమైన పని డబ్బును అప్పుగా పొంది అవసరాలు ఉన్న వ్యక్తులకు కొంత వడ్డీతో అప్పులుగా అందించడం. నేడు బ్యాంకులు కాలానికి తగినట్లుగా వివిధ రకాల కార్యకలాపాలను కూడా అందిస్తున్నాయి. ప్రపంచంలోని మొదటి బాంక్ సెయింట్ జార్జ్ బ్యాంక్ 1407లో జెనోవ, ఇటలీలో స్థాపించబడినది. బ్యాంక్ అనేపదం బాన్ కో అనే ఇటాలియన్ పదం నుండి వచ్చింది.

బాన్‌కో అంటే డెస్క్ లేదా బెంచీ అని అర్థం. మామూలుగా రోమన్ సామ్రాజ్యం కాలంలో డబ్బును లేదా ఎలాంటి వస్తువులనైనా ఋణాలుగా పొందే ముందు వ్యక్తి చేతినుంచి నేరుగా మరో వ్యక్తి చేతికి అందించడం జరిగేది కాదు. ఈ ప్రక్రియకు రుణదాతకు, రుణ గ్రహీతకు మధ్య ఒక బెంచీని ఉంచి, దానిపై రుణానికి చెందిన డబ్బును గాని, వస్తువులను గాని రుణదాత ఉంచితే, వాటిని రుణ గ్రహీత తీసుకునేవారు. ఆ మధ్యవర్తిత్వం జరిపే బల్లపేరే బాన్‌కో. ఇదొక సాంప్రదాయం! ఇద్దరి వ్యక్తుల మధ్య మరేదో వ్యవస్థగాని అగుపించని శక్తి రుణాన్ని అందించగలిగేలా చేసి, దానిని మళ్లీ తిరిగి అప్పు రుణ దాతకు వచ్చేలా సహకరిస్తుందని రోమన్స్ నమ్మకం. క్రమేణా, ఈ నమ్మకంలోని బాన్ కో (డెస్క్) స్థానాన్ని నేటి మన ఆధునిక సమాజంలో బ్యాంకులుగా రూపొందబడ్డాయి.

బ్యాంకులకు పునాది ఖాతాదారులు. వారు బ్యాంకులకు రుణంగా అందించే ఫిక్సిడ్ డిపాజిట్లు బ్యాంకులకు అందించిన డబ్బు, ఖాతాదారుల అవసరాల్లో సమయానికి అందించవలసిన కనీస బాధ్యత బ్యాంకులు కలిగి యుండాలి. కష్టమర్లే దేవుళ్లు అనే సూక్తి బ్యాంకులకు మొదటిగా వర్తిస్తుంది. ఖాతాదారులకు బ్యాంకులు డబ్బును అందించడంలో సాంప్రదాయకంగా బ్యాంక్‌లోని డబ్బు చెల్లింపుల విభాగంలో అందిస్తుంటారు. కాలానుగుణ అవసరాల నిమిత్తం ఎటిఎమ్‌లను అందుబాటులోకి తేవడం జరిగింది. ఎటిఎమ్ అనగా ఆటోమేటిక్ టెల్లర్ మిషన్, కానీ దాని అర్థం 'ఎనీ టైం మని'గా మార్పు చెందింది.

మన రెండు తెలుగు రాష్ట్రాలలో సంక్రాంతి పండగ ముందు బాంకు ఖాతాదారులకు ఎటిఎంలు, బ్యాంకులు చుక్కలు చూపించాయి. ఒక్కొక్కరిది ఒక్కొక్కరకం బాధ. ఒకరింటికి పదులసంఖ్యలో చుట్టాలు వచ్చి ఉన్నారు. వారందరికి మర్యాదలు, పిండివంటకాలు చేసి అందిద్దామంటే, బీరువా లాకర్‌లో చిల్లిగవ్వలేదు.

కిరాణా షాపుకువెళితే డబ్బు చెల్లించనిదే సరుకులు ఇవ్వరు. ఎంత దగ్గరి వారైనా పండగపూట అరువు ఇవ్వరు. ఇక పండుగ దండగ అయ్యేటట్లుగా ఉన్నది. ఇక దవాఖానాల్లో అత్యవసర చికిత్సలు చేయించుకుంటున్న వారి కుటుంబ సభ్యుల కష్టాలు ఎవరు తీర్చలేనివి. వీరి విషయంలో బాధను వ్యక్తపరిచినా, టివిల ముందు తీవ్రస్థాయిలో ఖండించినా, పెద్దగా ఒరిగేది ఏమి లేదు. పబ్లిసిటి తప్ప. అవసరాన్ని తీర్చలేని బ్యాంకులో ఉన్న డబ్బు ఉండి ఎందుకు దండగ. ఈ పరిస్థితి చూస్తుంటే పిల్లల కిడ్డీబ్యాంకులే మిన్న!! అనిపిస్తున్నది.

నేడువస్తున్న వార్తలు చూస్తుంటే, ఆర్‌బిఐ బ్యాంకులకు నగదు ఇవ్వడం మానేసింది లేదా నియంత్రణ చేసిందని అంటున్నారు, అదే విధంగా కేంద్రప్రభుత్వం వారు ఎఫ్‌డిలపై తీసుకురాబోయే చట్టం వల్ల ఖాతాదారుల సొమ్ముకు భద్రత ఉండదేమో! అనే భావనతో బ్యాంకుల్లో ఎఫ్‌డిలు చేయడం తగ్గినట్లు వినికిడి. ప్రజలు ఒక్కొక్కసారి నిజాలకన్నా పుకార్లను ఎక్కువగా నమ్ముతుంటారు.

ఈ విషయానికి పది రూపాయల నాణెం చెల్లడం లేదని తిరస్కరించడం, అది చెల్లుబాటవుతుంది అని స్వయంగా ఆర్‌బిఐయే మీడియా సమావేశం ఏర్పాటుచేసి ప్రజలకు తెలపడం, అయినా అక్కడక్కడా పరిస్థితి చక్కబడకపోవడం ఆందోళనకరం. ఇలాగే నేటి బాంక్ ఎఫ్‌డిల పరిస్థితి తయారు అవుతున్నది! బ్యాంకులు, ఎటిఎంలు, ఎఫ్‌డిల విషయాలలో సామాన్యుడికి కొన్ని సందేహాలు, కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. మరి ఆర్‌బిఐ వీటికి సమాధానాలు చెప్పగలదా?

– బ్యాంకులో నెలవారి కనీస నిల్వను ఖాతాదారుడు నిర్వహించని పక్షంలో ఫైన్ విధిస్తున్నారు. మరి ఖాతాదారుని అవసరానికి బ్యాంక్‌లు గాని, ఎటిఎంలు గాని డబ్బును అందించకపోతే, ఖాతాదారునికి అపరాధ రుసుం చెల్లిస్తుందా? లేదా?
– ఎటిఎంలలో నుండి ఐదు కంటేఎక్కువ సార్లు నెలలో ఖాతాదారుడు డబ్బు పొందితే, ఆరవ ట్రాన్సాక్షన్ నుండి ప్రతిసారి 'సారి' అంటూనే 20 రూపాయలు సర్వీస్ ఛార్జీగా వసూలు చేసే ఈ ఎటిఎంలు నో క్యాష్ బోర్డులు పెట్టకుండా, షెటర్స్ డబ్బులేని సమయంలో మూయకుండా, ఖాతాదారుని ట్రాన్సాక్షన్ ఫెయిల్ అయిన ప్రతిసారీ 20 రూపాయలు తనకు చెల్లించగలవా?
– ఎటిఎం కార్డు కోసం సంవత్సరానికి 122 రూపాయలు నేడు 177 రూపాయలు బ్యాంక్ అకౌంట్ నుండి లాక్కునే బ్యాంక్ ఎటిఎంలు ఖాతాదారులకు సర్వీస్ ఇవ్వాలని గుర్తించడం లేదు ఎందుకు?

ఇలా అనేక ప్రశ్నలు, సందేహాలతో బ్యాంకులో డబ్బుంచుకొని బయట రుణాలకోసం వెతికే డబ్బున్న పేదలు అవుతున్నారు నేడు ప్రజలు.

ఈ పరిస్థితిని ఆర్‌బిఐ నుంచి బ్యాంకుల వరకు ఎటిఎం సర్వీస్ ప్రొవైడర్స్ తక్షణ చర్యలు చేపట్టి డబ్బును వినియోగదారులకు అందుబాటులోకి తేవాలి.

అలా కాని పక్షంలో ఖాతాదారులు డబ్బులు బ్యాంకులలో వేయడం స్వచ్ఛందంగా మానేసే పరిస్థితి వచ్చి పిల్లల కిడ్డీ బ్యాంకులు కాస్తా ఎల్డర్స్ బ్యాంకులుగా ప్రతి ఇంట్లో వెలిసే సందర్భం వస్తుంది. బ్యాంకుల యొక్క, బ్యాంకు ఉద్యోగుల భవిష్యత్తు ప్రమాదంలో పడే ప్రమాదం ఉంది.

మన తెలంగాణ
5
హైదరాబాద్
బుధవారం
7 ఫిబ్రవరి, 2018
www.manatelangana.news





ఈ రోజుల్లో చాలా మందిని వేధిస్తున్న సమస్య సయాటికా. వయసుతో నిమిత్తం లేకుండా ఇటీవల యుక్తవయసులో ఉన్నవారు సైతం ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. దీనికి గల కారణం మారుతున్న జీవన శైలి విధానమే. దీనికి ఆధునిక వైద్య విధానంలో శస్త్రచికిత్స ఒకటే మార్గమని చెబుతారు. అయితే అది కూడా తాత్కాలిక ఉపశమనానికి మాత్రమే. కొంత కాలం తర్వాత ఈ నొప్పి మళ్లీ తిరగబెట్టే అవకాశం ఉంటుంది. కానీ హోమియోలో సయాటికాకు మంచి చికిత్స ఉంది. సమస్యను నిర్లక్ష్యం చేయకుండ తొలి దశలోనే చికిత్స తీసుకుంటే త్వరగా నయమవుతుంది.

సయాటికా సమస్యకు చికిత్స

శరీరానికి ఊతమిచ్చే కీలకమైన భాగం 33 వెన్నుపూసలతో తయారైన వెన్నుముక. మనం వంగినా, లేచినా వెన్నుపూసల మధ్యలో ఉండే డిస్కులే తోడ్పడతాయి. నడుము ప్రాంతంలో ఉండే డిస్కులు అరిగి పోవుటం వల్ల లేదా డిస్కులు పక్కకు తొలగటం వల్ల పూసల మధ్య ఉండే సయాటికా నరం ఒత్తిడికి లోనవుతుంది. దీనివల్ల ఆ నరం శరీరంలో ఎంత దూరం వెళితే అంత దూరం నొప్పి వస్తూనే ఉంటుంది. సయాటిక్ నరం ఒత్తిడికి గురికావడం వల్ల వచ్చే సమస్య కావడం చేత దీనికి సయాటికా అన్న పేరు స్థిరపడింది. శరీరంలో అతి పొడవైన నరం సయాటిక్. ఇది తొడల నుంచి మోకాళ్లు, పిక్కల ద్వారా అరికాళ్లు, కాలివేళ్ల దాకా వ్యాపించి ఉంటుంది.

కారణాలు: స్పాంజి లేదా దూది ఎక్కువగా ఉపయోగించిన కుర్చీల్లో అసంబద్ధ భంగిమల్లో కూర్చోవడం. ప్రమాదాలలో వెన్నుపూసలు దెబ్బ తినడం లేదా పక్కకు తొలగటం. కంప్యూటర్స్ ముందు ఎక్కువసేపు కదలకుండ కూర్చుని విధులను నిర్వర్తించడం. అనుకోకుండా ఎప్పుడైనా కాస్త ఎక్కువ బరువులు ఎత్తడం. ఒకే చోట గంటల తరబడి కదలకుండా పని చేయడం. కాళ్లకు మరీ ఎత్తయిన హీల్స్ ధరించడం. నిత్యం తీసుకునే ఆహారంలో కాల్షియం, విటమిన్ల లోపించటం వల్ల సయాటికా నొప్పి రావచ్చును.



లక్షణాలు : సయాటికా నొప్పి తీవ్రంగా ఉండి కాలు ఎటువైపు కదల్చిన వంగినా, కూర్చున్నా, నడిచినా నొప్పి తీవ్రత పెరుగును. నాడులు ఒత్తిడికి గురి కావడం వల్ల నొప్పి ఎడమ కాలు లేదా కుడి కాలుకు వ్యాపించి బాధించును. నడుము కింది భాగం ఎడమ కాలు లేదా కుడి కాలుకు తిమ్మిర్లు ఎక్కువగా ఉండును. హఠాత్తుగా వంగినా, బరువులు ఎత్తినా, నడుము వంచినా తీవ్రమైన నొప్పి తుంటి నుంచి కాలి వేళ్ల దాకా ఎక్కడైనా కనిపించవచ్చును.

జాగ్రత్తలు: సయాటికా నొప్పితో బాధపడేవారు సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు విశ్రాంతి తీసుకోవాలి. ఇలా చేస్తే సమస్య తీవ్రత తగ్గుతుంది. వాహనం నడిపేటప్పుడు, కుర్చీలో కూర్చున్నప్పుడు నడుము నిటారుగా ఉండే విధంగా సరియైన స్థితిలో కూర్చోవాలి. బరువులు ఎక్కువగా లేపరాదు. నొప్పి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు బెడ్ రెస్టు తీసుకోవడం తప్పనిసరి ముఖ్యంగా స్పాంజి లేదా దూది ఎక్కువగా ఉపయోగించిన కుర్చీల్లో సరియైన స్థితిలో కుర్చోవాలి. అసంబద్ధ భంగిమలలో కూర్చోవడం మానుకోవాలి. సయాటికా నొప్పి ఉన్నప్పుడు స్వల్ప వ్యాయామాలు డాక్టర్ సలహా మేరకు మాత్రమే చేయాలి. సయాటికా నొప్పి రాకుండా ఉండటానికి పౌష్టిక ఆహారాన్ని తీసుకుంటూ నిత్యం వ్యాయామం, ప్రాణాయామం, యోగా చేయాలి. స్థూలకాయం ఉన్నవారు వెంటనే బరువు తగ్గించుకోవటానికి ఆహారనియమాలు పాటించాలి. వేపుళ్లు, ఫాస్ట్‌ఫుడ్స్, జంక్‌ఫుడ్స్ తీసుకోవడం మానుకోవాలి.

చికిత్స: సయాటికా నొప్పికి ఎక్కువ శాతం వరకు శస్త్రచికిత్స అవసరం లేకుండానే సయాటికా సమస్యను నివారించే మంచి చికిత్స హోమియో వైద్యంలో ఉంది. వ్యాధి లక్షణాలను, వ్యక్తి మానసిక, శారీరక లక్షణాలను, పరిగణలోకి తీసుకొని మందులను ఎన్నుకొని వైద్యం చేసినా 'సయాటికా' సమస్య నుండి విముక్తి పొందవచ్చును.

మందులు..గ్నఫాలియం : సయాటికాకు ఇది మంచి ఔషధం. కాలి వెంబడి నొప్పి, తిమ్మిరి ఉంటుంది. నడిచినా నొప్పి తీవ్రత పెరుగుతుంది. కూర్చున్నప్పుడు నొప్పి తీవ్రత తగ్గును. నొప్పి కాలి వేళ్ళ వరకు వ్యాపించి ఉండును. రాత్రి వేళలో అధికంగా ఉండును. ఇటువంటి లక్షణాలున్న వారికి వాడుకోదగినది.

కోలోసింథ్: సయాటికాకు ఇది కూడా ముఖ్యమైన ఔషధం. సయాటికా నాడి వెంబడి నొప్పి ఉండుట గమనించదగిన లక్షణం. నొప్పి తుంటి నుండి మోకాలు వరకు లేదా మడిమ వరకు వ్యాపించి వేధించును. వీరు కదలికలు భరించలేరు. ఇటువంటి లక్షణాలు ఉన్నవారికి ఈ మందు ముఖ్యమైనది.

హైపరికం: వెన్నుపాముకు దెబ్బ తగిలిన అనంతరం సయాటికా సమస్యను ఎదుర్కొనే వారికి ఈ మందు, 'ఆర్నిక' దివ్య ఔషదాలు. నరాలు నలగడం లేదా ఒత్తిడికి గురికావడం వల్ల నొప్పి సయాటికా నాడి వెంట వచ్చును. దీంతో తుంటి నుండి మడిమ వరకు నొప్పి వస్తున్నప్పుడు ఈ మందు తప్పక ఆలోచించదగినది.

ఆర్నికా : పడటం వలన నడుము ప్రాంతములో కముకు దెబ్బలు తగలటం, బెణకటం వల్ల సయాటికా సమస్యను ఎదుర్కొనే వారికి ఈ మందు వాడుకోదగినది. అలాగే శారీరక శ్రమ అనంతరం సయాటికా నొప్పి వేధిస్తుంటే ఈ మందు వాడుకొని ప్రయోజనం పొందవచ్చును.ఈ మందులే కాకుండా రూటా, కాల్కేరియాకార్బ్, సల్ఫర్, కాలికార్బ్ రస్‌టాక్స్, బ్రయోనియా, మాగ్‌ఫాస్, సింఫైటినం వంటి మందులను లక్షణ సముదాయమును పరిగణలోకి తీసుకొని వైద్యం చేస్తే సయాటికా నొప్పి నుండి విముక్తి పొందవచ్చును.



డాక్టర్ పావుశెట్టి శ్రీధర్
హోమియోఫిజీషియన్, హన్మకొండ



చలిని తగ్గించే ఆహారం

చలికాలంలో వేడి పదార్థాలు స్వీకరించడం వల్ల ఆరోగ్యానికి మంచిది కాదు. అలాంటివి ఏం ఇబ్బంది పెట్టకుండా ఉండాలంటే ఈ కింద ఇచ్చిన వాటిని తినడం ద్వారా అనారోగ్యానికి దూరంగా ఉండవచ్చు. అవేంటో చూద్దాం.. **చిలకడ దుంపలు:** ఇది చక్కటి పోషకాహారం. ఇవి శరీరానికి వెచ్చదనాన్ని అందిస్తాయి. ఇందులో పీచు, కార్బోహైడ్రేట్లు, విటమిన్ 'ఎ','సి', ఖనిజ లవణాలు, మాంగనీసు, రాగి అధికంగా లభిస్తాయి. వీటిని ఉడికించి ఉప్పు, మిరియాల పొడి చల్లుకొని తరచూ తీసుకుంటే ఈ కాలంలో ఎదురయ్యే అనారోగ్యాలను దూరంగా ఉంచవచ్చు. **పాలకూర:** ఆకుపచ్చని కాయగూరలు చలికాలంలో మేలు చేస్తాయి. వీటిలో యాంటీఆక్సిడెంట్లు లభిస్తాయి. ఇనుము, క్యాల్షియం, సమృద్ధిగా దొరుకుతాయి. పాలకూరను ఉడికించి గానీ, సూపు, రసం రూపంలో తీసుకొనే అలవాటు చేసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. **నువ్వులు:** తగిన మోతాదులో తీసుకుంటే ఈ కాలంలో శరీరానికి అవసరమయ్యే వేడిని అందిస్తాయి. వీటిలో క్యాల్షియం, ఖనిజ లవణాలు, మాంగనీసు, ఇనుము, మెగ్నీషియం, రాగి సమృద్ధిగా లభిస్తాయి. నువ్వులతో తయారు చేసిన పదార్థాలను భోజనం తరవాత తీసుకుంటే అరుగుదల బాగుంటుంది. చర్మానికి తేమను అందించడానికి తోడ్పడతాయి. **వేరుసెనగలు:** ఈ గింజల్లో విటమిన్ 'ఇ','బి3' లభిస్తుంది. అలానే గుండెకు మేలు చేసే మోనోశాచ్యురేటెడ్ ఫ్యాట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి గుండెకు మంచిది. వేరుసెనగ గింజల్లో నూనె శాతం ఎక్కువగా ఉంటుంది. అవి చర్మంలో తేమ శాతాన్ని పెంచుతాయి. **జొన్నలు:** కనీసం వారంలో ఒక్కరోజైనా తీసుకుంటే మేలు జరుగుతుంది. ఇందులో క్యాల్షియం ఎక్కువగా ఉంటుంది. వీటివల్ల కండరాల కదలిక చక్కగా ఉంటుంది. నొప్పులు కూడా దూరంగా ఉంటాయి. జొన్నతో చేసే పదార్థాలను అల్లం చట్నీతో కలిపి తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది

కొత్తిమీరతో లాభాలు



మనం తినే ఆహారం రుచిగా ఉండాలంటే ముఖ్యంగా కావలసింది కొత్తిమీర. అంతే కాకుండా మన ఆరోగ్యానికి ఇది చాలా రకాలుగా ఉపయోగపడుతుంటుంది. ఆహార పదార్థాల మీద అలంకరించుకోవడానికని భావిస్తే పొరపాటే. మనం తీసుకునే అన్ని రకాల ఆకుకూరలు ,కాయగూరల వంటకాలలో విరివిగా వేసి తీసుకోవచ్చు. కొత్తిమీర నిండా విటమిన్లు , ఖనిజ లవణాలు ఉంటాయి . అంతే కాదు దీనిలో ఐరన్ కూడా ఎక్కువ శాతం లభిస్తుంది.

దీని వల్ల శరీరంలో రక్తహీనతను తగ్గిస్తుంది, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. రక్తనాళాల్లో ఆటంకాలను తొలగిస్తుంది. ధనియాల మొక్కను మనం కొత్తిమీరగా పిలుస్తాం. దీనికి ధనియాల గుణాలన్నీ ఉంటాయి. సాధారణంగా కొత్తిమీరను సువాసన కోసం వంటల్లో వాడుతుంటారు. లేత మొక్కని మొత్తంగా రోటి చట్నీల కోసం వాడుతుంటారు. కొత్తిమీర ఆకులను సూప్స్, కూరల వంటి వాటికి చేర్చుతుంటారు. అయితే కేవలం వంటింటి పదార్థంగా మాత్రమే కాకుండా కొత్తిమీరను ఔషధంగా కూడా వాడుకోవచ్చు. కొత్తిమీర మొక్క కాండంలోనూ, ఆకుల్లోనూ, గింజల్లోనూ సుగంధ తత్వాలూ, ఔషధ తత్వాలూ అనేకం ఉంటాయి. ఈ మధ్య జరిగిన అధ్యయనాల్లో కొత్తిమీర ఫుడ్ పాయిజనింగ్‌లో అత్యంత ప్రయోజనకారిగా పనిచేస్తుందని తేలింది. తాజాగా సేకరించిన కొత్తిమీరలో డుడిసినాల్ అనే పదార్థం ఉంటుంది. విష పురుగులు కుడితే కొత్తిమీర ఆకులను ముద్దగా నూరి బాదం పలుకులనూ, పెసర పిండినీ కలిపి ప్రయోగిస్తే విష పురుగులు కరిచిన చోట నొప్పి, వాపులు తగ్గుతాయి. కొత్తిమీర ఆకుల రసానికి కొద్దిగా పంచదార కలిపి తీసుకుంటే మంటలు తగ్గుతాయి. దీనిని ఒక చెంచాడు మోతాదులో అరటి పండుతో కలిపి ఏడు రోజులపాటు తీసుకోవాలి. ముఖంపై మొటిమలు అధికంగా వుండి ఎక్కువ బాధ పెడుతుంటే వాటికి కొత్తిమీర ఆకుల రసంలో కొద్దిగా పసుపును కలిపి ప్రతి రోజూ రాత్రి పడుకునేముందు ఆ పేస్ట్‌ను ముఖానికి పట్టిస్తే ముఖం పైనున్న మొటిమలు తగ్గిపోతాయంటున్నారు ఆయుర్వేద వైద్యులు. ముఖచర్మం ఎండిపోయినట్లుంటే ఈ పేస్టు ముఖానికి పూస్తే చర్మం మృదువుగా మారుతుంది. తరచూ తలనొప్పితో బాధపడుతుంటే అలాంటి వారు కొత్తిమీర ఆకుల రసాన్ని నుదుటిపై పూస్తే తలనొప్పి మటుమాయమౌతుందంటున్నారు వైద్యులు. అరికాలి మంటలు, పొట్టలో నులిపురుగులు ,కొన్ని రకాల కాలేయ వ్యాధులు, వాంతులు ఉంటే ప్రతిరోజూ ఒక గ్లాసు మజ్జిగలో కొత్తిమిర ఆకులరసం రెండు చెంచాలు కలిపి తీసుకుంటే ఉపశమనం కలుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

మన తెలంగాణ
6 హైదరాబాద్ బుధవారం 7, ఫిబ్రవరి 2018
www.manatelangana.news

బాల్య వివాహాల నివారణకు తీసుకున్న చర్యలేంటి?

మన తెలంగాణ/హైదరాబాద్ : బాల్య వివాహాలను నివారించేందుకు తెలంగాణ సర్కార్ తీసుకునే చర్యలు తెలియజేయాలని హైకోర్టు ఆదేశించింది. బాల్య వివాహాలు తెలంగాణలోనే కాదని, ఏపీలోనూ బాగా ఉన్నాయని బెంచ్ అభిప్రాయపడింది. తెలంగాణ రాష్ట్రం తీసుకునే చర్యల తర్వాత ఏపీలోని బాల్య వివాహాలను అరికట్టేందుకు తీసుకునే చర్యలపై విచారణ చేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. బాల్య వివాహాల వల్ల బాధితులైన వారికి ప్రభుత్వం ఏవిధంగా అండగా ఉంటోందో తెలియజేయాలని తెలంగాణ సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. బాల్య వివాహాల వల్ల నష్టపోయిన వైనాన్ని వివరిస్తూ బి.మహిళత, 10 మంది రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. దీనిని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళ వారం విచారించింది. బాల్య వివాహ బాధితులకు విద్యలో 5 శాతం రిజర్వేషన్లు, ఉచిత వైద్యం, స్వయం సహాయక సంఘాలు, ఆర్థిక భరోసా ఉండే చర్యలు తీసుకోవాలని బాధితులు హైకోర్టును లేఖ ద్వారా కోరారు. వీరి సంక్షేమం కోసం తీసుకునే చర్యల్ని వివరించాలని బెంచ్ తెలంగాణను ఆదేశిస్తూ విచారణ నెల రోజులకు వాయిదా వేసింది.



సిపిఎస్ రద్దుకు 11న ఎస్‌టియు ధర్నా

మనతెలంగాణ/హైదరాబాద్ : సిపిఎస్ రద్దుకు ఈ నెల11న హన్మకొండలో తలపెట్టిన మహాధర్నాకు ఉపాధ్యాయ, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్‌టియుటిఎస్ అధ్యక్షు లు టి.భుజంగరావు పిలుపునిచ్చారు.మహాధర్నాను విజయవంతం చేసేందుకు జనవరి 6 నుంచి పోరుయాత్ర చేపడుతున్నామని ప్రకటనలో తెలిపారు.

రజక వృత్తిదారుల క్యాలెండర్ ఆవిష్కరణ



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రభుత్వం రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చి వారు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ చేతివృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. రజక వృత్తిదారుల సమాఖ్య రూపొందించిన 2018 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం నగరంలోని సమాఖ్య కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకట్రాములుతో పాటు రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ బొడ్డుపల్లి క్రిష్ణ, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.పాండురంగాచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాలలో వెనుకబడి అత్యంత దుర్భరంగా జీవిస్తున్న రజకులు చైతన్యవంతులై సంఘటితంగా హక్కుల సాధన కోసం పోరాడాలన్నారు. బొడ్డుపల్లి క్రిష్ణ మాట్లాడుతూ వచ్చే బడ్జెట్‌లో రజకుల సమగ్రాభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నేటికీ గ్రామీణ ప్రాంతాలలో రజకులపై కుల వివక్షత కొనసాగుతున్నదని, దానిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎయిమ్స్‌పై నిర్ణయమే మిగిలింది



మన తెలంగాణ / హైదరాబాద్:ఎయిమ్స్‌పై రాజకీయ నిర్ణయం జరగాల్సి ఉందని కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి ప్రీతి సూడాన్ అన్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న సిద్ధిపేట, నల్గొండ, సూర్యాపేట వైద్య కళాశాలలకు మరిన్ని నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తామన్నారు. ఆయా కాలేజీల్లో నేషనల్ పూల్ కింద యూజీ, పీజీ సీట్ల పెంపు, వైద్య , విద్య అభివృద్ధి, పరిశోధనలకు కూడా తగిన ప్రోత్సాహం కూడా అందిస్తామని చెప్పారు. సచివాలయంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డిని మంగళ వారం ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి చేసిన పలు విజ్ఞప్తులపై ఆమె సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో ఆశా వర్కర్లకు నెలకు కనీసం రూ.6వేలువచ్చే విధంగా ప్రోత్సాహకాలు అందిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. కేసీఆర్ కిట్ల పథకానికి పిఎంఎంవైపి పథకం కింద నిధులు అందించాలని కోరారు. క్లినికల్ ట్రయల్స్‌కు జాతీయ స్థాయిలో ఒకే విధమైన నిబంధనలుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య, ఆరోగ్యశాఖలో అమలవుతున్న పథకాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రానికి మాతా శిశు ఆసుపత్రులను కేటాయిస్తామన్నారు. అలాగే నవజాత, ఐసీయు, డయాలసిస్, క్యాన్సర్, వ్యాధి నిర్ధారణ కేంద్రాలకు మరిన్ని నిధులపై కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. నగరంలో చేపట్టిన బస్తీ దవాఖాలకు కేంద్రం వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. నిజామాబాద్, కరీంనగర్‌లకయు పీఎం స్వాస్థ్య సమృద్ధి యోజన పథకం కింద మరింత సాయం చేస్తామని ఆమె ఈ సందర్భంగా మంత్రికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ పాల్గొన్నారు.

ఈ నెల 18న ఒబిసి మోర్చా వర్క్‌షాప్

మన తెలంగాణ/హైదరాబాద్ : బిజెపి మండల అధ్యక్షులతో ఈ నెల 18వ తేదీన హైదరాబాద్‌లో ఒబిసి మోర్చా వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నారు. నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం టిఆర్‌ఎస్ ప్రభుత్వ బిసి వ్యతిరేక విధానాలకు నిరసనగా మార్చి 11వ తేదీన మహా సంగ్రామం పేరుతో నిర్వహించనున్న సదస్సుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఒబిసి మోర్చా అధ్యక్షులు కాటం నరసింహ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఒబిసి మోర్చా రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, ఇన్‌ఛార్జీల పాల్గొన్నారు. లక్ష మందితో మహా సంగ్రామం నిర్వహించనున్న నేపథ్యంలో వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో బిజెపి కార్యాలయ కార్యదర్శి పేర్కొన్నారు.

కట్నం కోసం భార్య కిడ్నీ విక్రయం



న్యూఢిల్లీ : అడిగినంత వరకట్నాన్ని ఇవ్వలేదన్న కారణంతో అపెండిసైటిస్ ఆపరేషన్‌ను అలుసుగా తీసుకుని భార్య మూత్రపిండాన్ని విక్రయించిన ప్రబుద్ధుడిని, ఆమెను వేధించిన మరిదిని పశ్చిమ బెంగాల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తన కుటుంబం తన భర్తకు రూ.2లక్షలు వరకట్నాన్ని ఇవ్వలేనందుకు భర్త ఈ దారుణానికి ఒడిగట్టాడని రీటా సర్కార్ చేసిన ఫిర్యాదుతో పోలీసులు ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రీటా సర్కార్‌కు ఆమె తల్లిదండ్రులు వివాహ సమయంలో రూ.2 లక్షలు కట్నం ఇస్తామని ఒప్పుకున్నారు. ఈ విషయమై ఆమె భర్త, మరిది వేధింపులకు గురి చేస్తున్నారు. ఇదే సమయంలో ఆమెకు అపెండిసైటిస్ సమస్య వచ్చింది. నొప్పితో విలవిల్లాడుతున్న ఆమెను కోల్‌కతాలోని ఓ నర్సింగ్‌లో చేర్పించారు. అపెండిక్స్‌ను తొలగిస్తే నొప్పి తగ్గిపోతుందని, సర్జరీ చేయాలని, కాని ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని అక్కడి వైద్యులు, ఆమె భర్త ఆమెకు చెప్పారు. అయితే, ఆపరేషన్ అనంతరం ఆమెకు నొప్పి ఎక్కువైంది. ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ఆమె భర్త నిరాకరించడంతో ఆమె పుట్టింటి తరపు బంధువులు ఆమెను ఉత్తర బెంగాల్ మెడికల్ కాలేజీకి తీసుకెళ్లారు. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు ఆమె కుడి మూత్ర పిండం లేకపోవడాన్ని గుర్తించారు. మల్దాలోని నర్సింగ్‌లో కూడా ఆమె వైద్యులను అడిగి నిర్ధారించుకున్నారు. అక్కడి వైద్యులు ఇదే విషయాన్ని చెప్పారు. దీంతో ఆమె భర్త, మరిదిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిద్దరినీ అరెస్టు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ ఉదయ్ శంకర్ రాయ్ తెలిపారు. కాగా, ఆమె మూత్రపిండాన్ని వారిద్దరూ చత్తీస్‌గఢ్‌లోని ఓ వ్యాపారికి విక్రయించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. సర్జరీ నిర్వహించిన కోల్‌కతా ఆసుపత్రిలో ముషీరాబాద్ పోలీసులు తనిఖీలు నిర్వహించారని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

అన్ని వర్శిటీలలో డిటెన్షన్!

రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధానం అమలుకు సన్నాహాలు



మన తెలంగాణ/హైదరాబాద్ : వచ్చే విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ కోర్సుల్లో డిటెన్షన్ విధానం అమలులోకి రానుంది. డిటెన్షన్ విధానం ప్రస్తుత విద్యాసంవత్సరమే అమలులోకి రాగా మూడు వర్సిటీలు మాత్రమే అమలు చేశాయి. మరో మూడు వర్సిటీలు పాత విధానాన్నే కొనసాగిస్తున్నాయి. దాంతో విద్యార్థుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఇటీవల ఉన్నత విద్యామండలి ఛైర్మన్ అధ్యక్షతన జరిగిన వైస్ ఛాన్స్‌లర్ల సమావేశంలో డిగ్రీ కళాశాలల ప్రవేశాలు, సిబిసిఎస్ విధానం, డిటెన్షన్ అమలుపై చర్చించారు. సకాలంలో డిగ్రీ ప్రవేశాలు పూర్తి చేసి, అన్ని వర్సిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో జూలై 2 నుంచి తరగతులు ప్రారంభించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ(దోస్త్) ద్వారానే ప్రవేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని వర్సిటీలలో ఒకే విధానం చేస్తేనే బాగుంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి అన్ని వర్సిటీల పరిధిలో డిగ్రీ కళాశాలల్లో డిటెన్షన్ విధానం అమలు కానుంది. ఈ ఏడాది ఉస్మానియా యూనివర్సిటీ, శాతవాహన, పాలమూరు వర్సిటీలు మాత్రం డిటెన్షన్ విధానాన్ని చేయగా, అందులో ఒయు పరిధిలో 4,650 మంది డిటెయిండ్, శాతవాహన వర్సిటీ పరిధిలో 2,300 మంది డిటెయిండ్, పాలమూరు వర్సిటీ పరిధిలో 3,200 మంది విద్యార్థులు డిటెయిండ్ అయ్యారు. కాకతీయ, మహాత్మగాంధీ, తెలంగాణ యూనివర్సిటీలలో మాత్రం డిటెన్షన్ విధానం అమలు చేయలేదు.

అన్ని డిగ్రీ కోర్సుల్లో అమలవుతున్న డిటెన్షన్

వృత్తి విద్యా కోర్సులైన ఇంజనీరింగ్, బి.ఫార్మసీ వంటి యుజి కోర్సులతో ఎం.టెక్,ఎం.ఫార్మసీ, ఎంబిఎ, ఎంసిఎ వంటి పిజి కోర్సుల్లో గత కొన్నేళ్లుగా డిటెన్షన్ విధానం అమలవుతుండగా, ఈ ఏడాది నుంచి డిగ్రీ కోర్సుల్లో అమలులోకి వచ్చింది. ఇప్పటివరకు వృత్తి విద్యా కోర్సులకే పరిమితమైన డిటెన్షన్ విధానం ఇక నుంచి అన్ని రకాల డిగ్రీ కోర్సుల్లో అమలు కానుంది. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యలో ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం(సిబిసిఎస్) విధానం అమలు చేయాలని యుజిసి ఆదేశాలిచ్చిన నేపథ్యంలో గత ఏడాది నుంచి ఇయర్ విధానానికి బదులుగా సెమిస్టర్ విధానం అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే డిగ్రీలో డిటెన్షన్ విధానం తీసుకువచ్చారు.

ఉద్యోగుల వివరాలు సేకరణ

బడ్జెట్‌లో కీలక నిబంధనలు విధించే అవకాశం



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ఖచ్చితమైన వివరాలను ప్రభుత్వం సేకరిస్తోంది. దీంతో పాటు సంస్థల స్థిర, చరాస్తులు, వాటి నిర్వహణ, జీత భత్యాల మొత్తానికి అవుతున్న ఖర్చుపైనా లెక్క అడుగుతోంది. అధికారులు, సిబ్బంది వినియోగిస్తున్న వాహనాలు, వాటి నిర్వహణ, డ్రైవర్లు, డీజిల్‌కయ్యే ప్రతి పైసా వ్యయాన్ని సవివరంగా సేకరించాలని ఆర్థికశాఖ అధికారులను ఉన్నతస్థాయి ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఇప్పటి వరకు కార్పోరేషన్లు తమ ఆదాయ, వ్యయాలను గుండుగుత్తగా చెప్పేవారు. కానీ జీతభత్యాలు, పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వాహనాలెన్ని వంటి విషయాలన్నీ సవివరంగా తెలుసుకుంటే, నిధుల వినియోగమెలా ఉంది, ఎక్కడెక్కడ దుర్వినియోగం అవుతున్నాయో, ఎక్కడ పక్కదారి పడుతున్నాయో తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో పాటు బ్యాంకు ఖాతాలు ఎన్ని ఉన్నాయి, ఎక్కడెక్కడ ఉన్నాయి, ఆయా ఖాతాల్లో ఎంత మొత్తం నిధులు ప్రస్తుతం ఉన్నాయి, తదితర వివరాల సేకరణకు ఇప్పటికే అధికారులకు అంతర్గత ఆదేశాలు జారీ అయినట్లు తెలిసింది. బ్యాంకు ఖాతాల్లో ఉన్న నిధులను ఎందుకు ఇంకా ఖాతాల్లో ఉన్నాయో తెలుసుకొని, వినియోగించని మొత్తాలకు మళ్లించే అవకాశం ఉంది. దీంతో పాటు ఉద్యోగుల పనితీరుకు, బ్యాంకు ఖాతాల్లో మూలుగుతున్న నిధులకు కూడా లింకు పెడుతున్నట్లు తెలిసింది. సక్రమంగా పనిచేస్తే, ఆయా నిధులు ఇంకా లబ్ధిదారుల వద్దకో, పనుల కోసమో వెచ్చిస్తే ప్రభుత్వ ఖాతాల్లో నిధులు ఎందుకు ఉంటాయన్న ప్రశ్నలను ఇటీవల ముఖ్యమంత్రి కెసిఆర్ లేవనెత్తినట్లు తెలిసింది. వీటన్నింటికి తోడు ఉద్యోగులకు వ్యక్తిగతంగా ఎన్ని బ్యాంకు ఖాతాలు ఉన్నాయో కూడా చెప్పేలా రాబోయే బడ్జెట్‌లో కీలక నిబంధనలు ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఉద్యోగుల జీతభత్యాలకు, ఖాతాల్లో నిల్వ ఉన్న డబ్బుకు లింకు పెట్టి, అవినీతిపై ప్రభుత్వ సీరియస్‌నెస్‌ను స్పష్టం చేయనున్నారు. 2018–19 రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించే సమయంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. కార్పోరేషన్ల పేరుతో విచ్చలవిడిగా సాగుతున్న నిధుల దుర్వినియోగాన్ని ఏదో ఒక దశలో కంట్రోల్ చేయకపోతే అదుపు తప్పుతుందన్న భావనను ముఖ్యమంత్రి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఖాళీ ఉద్యోగాల్లో పది శాతం కూడా భర్తీ చేయలేదు

మన తెలంగాణ/ హైదరాబాద్: అధికారంలోకి వచ్చి నాలుగేళ్లైనా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలలో కనీసం పది శాతం కూడా భర్తీ చేయలేకపోయారని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. తాము అధికారంలో ఉండగా 12 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తే, టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క డిఎస్‌సిని కూడా ఎందుకు నిర్వహించలేకపోయారని అన్నారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే 'నిరుద్యోగ చైతన్య యాత్ర'ను మంగళవారం గాంధీభవన్ నుండి ఉత్తమ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ కుంటియా, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి 1.07 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఈ నాలుగేళ్ళలో మరో 70 వేల మంది రిటైర్ అయ్యారని, మొత్తం కలిపి సుమారు రెండు లక్షల ఉద్యోగాలు ఉన్నాయన్నారు.కాని ఇప్పటి వరకు టిఎస్‌పిఎస్‌సి ద్వారా కేవలం ఏడు వేల ఉద్యోగాలే భర్తీ చేశారని విమర్శించారు. మరోవైపు ఉద్యోగాలపై సిఎం కెసిఆర్ యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆయన అధికారం చేపట్టిన తరువాత ఐదు వేల ఫ్యాక్టరీలు మూతపడి, వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. నిరుద్యోగుల్లో ఈ యాత్ర ద్వారా చైతన్యం తెసుకురావాలన్నారు. మంత్రి కెటిఆర్ సూటుబూటు వేసుకొని విహార యాత్రలకే పరిమితమయ్యేరే తప్ప పెట్టుబడులను తీసుకురావడం లేదన్నారు. కాంగ్రెస్ త్వరలో అధికారంలోకి రాబోతుందని, కెసిఆర్‌లా తాము వట్టి మాటలు చెప్పబోమని, ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. యుజవన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్ నేతృత్వంలో ఈ రథయాత్ర 45 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించనుంది.

స్టడీ సర్కిల్‌పై సిఐడి దర్యాప్తుకు డిమాండ్ : తెలంగాణ ఎస్‌సి, ఎస్‌టి స్టడీ సర్కిల్ నిధుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై సిఐడి చేత దర్యాపు చేయించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని స్టడీ సర్కిల్‌లో అక్రమాలపై విచారణ డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్న వారిని పరామర్శించి, సంఘీభావం తెలిపారు. ఉత్తమ్‌తో పాటు కాంగ్రెస్ మాజీ ఎంపిలు వి.హనుమంతరావు, పొన్నం ప్రభాకర్‌లు కూడా ఉన్నారు.





నలుగురు ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

మనశ్రీ(6 నెలలు) పిల్లలు ఉన్నారు. రమేష్ వ్యవసాయం చేసుకుంటూ పాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రమేష్ సోమవారం తల్లిదండ్రులతో గొడవపడి సాయంత్రం 3.30 గంటల ప్రాంతంలో భార్య పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లాడు. కుటుంబ సభ్యులు వారి కోసం బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకుండా పోయింది. మంగళవారం ఉదయం కీసరలోని పెద్దమ్మ చెరువు వద్ద రమేష్ స్కూటర్ వాహనం గమనించిన అతని బంధువులు కీసర పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సురేందర్ గౌడ్ తన బృందంతో చెరువు వద్దకు చేరుకొని పరిశీలించగా చెరువు ఒడ్డున మూడు జతల చెప్పులు పడి ఉండటం గుర్తించి చెరువులో గాలింపు చేపట్టారు. విషయం తెలుసుకున్న రమేష్ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు భారీగా చెరువు వద్దకు చేరుకున్నారు. వారి రోదనలతో పెద్దమ్మ చెరువు పరిసరాలు శోక సంద్రంగా మారాయి. కొన్ని గంటల వ్యవధిలో మృతదేహాలు ఒక్కొక్కటిగా నీటిపై తేలియాడుతూ కనిపించాయి. రమేష్‌తో పాటు గీతాశ్రీ మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకు రాగా చెరువు మధ్యలో ఉన్న తల్లి కూతుళ్ల మృతదేహాలను సీఐ సురేందర్ గౌడ్ తన సిబ్బందితో కలిసి స్వయంగా బయటకు తెచ్చారు. మృతదేహాలను చూసిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు గుండెలు పగిలేలా రోదించారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. అభం శుభం తెలియని చిన్నారుల మృతదేహాలను చూసిన స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి యజమాని ఇచ్చిన నరబలి?

(మొదటిపేజీ తరువాయి)

రాజశేఖర్‌కు మూఢ నమ్మకాలు ఎక్కువ. తన భార్య శ్రీలత గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతుండడంతో బాగు చేయించాలనే సంకల్పంతో పలువురు మంత్రగాళ్ల వద్దకు వెళ్లి బాగు చేయించినట్లు, ఎంతకీ తన భార్య ఆరోగ్యం కుదుటపడలేదని దీంతో తనమామ నర్సింగ్ రావు సహాయంతో రాజశేఖర్ కరీంనగర్‌లోని ఓ గిరిజన తండాలో గల పూజారి వద్దకు 20 రోజుల క్రితం వెళ్లి విషయాన్ని చెప్పినట్లు తెలిసింది. ఆ మంత్రగాడు రాజశేఖర్‌కు ఆయన మామ పలు సలహాలు ఇచ్చిన ట్లు, దీనికి క్షుద్రపూజలు చేసి, నరబలి ఇస్తే నీ భార్య ఆరోగ్యం భాగుంటుందని చెప్పడంతో గట్టిగా నమ్మిన వారు అందుకు కొంత డబ్బులను ఒప్పందం చేసుకొని సగం అడ్వాన్సుగా ఇచ్చినట్లు తెలిసింది. అందుకు నరబలికి కూడా అదే గిరిజన తండాలో ఓ మూడునెల్ల చిన్నారిని సాకేందుకని కొనుగోలు చేసినట్లు , ఈ క్షుద్రపూజలకు ఫిబ్రవరి 1 బుధవారం పౌర్ణమి చంద్రగ్రహణం కావడంతో తనమామ నర్సింగ్ రావు, కరీంనగర్ నుంచి వచ్చిన మంత్రగాడి సహాయంతో కుటుంబ సభ్యులదరిని కూర్చోబెట్టి ఈ నరబలి చేసినట్లు ఒక్కరోజు తన ఇంటి పైన తలను పెడితే ఇంటికి పట్టిన పీడంతా తొలగిపోతుందని చెప్పడంతో అందుకు రాజశేఖర్ సమ్మతించి ఈ ఘోరానికి పాల్పడినట్లు పోలీసుల ద్వారా తెలిసింది. అనంతరం చిన్నారి మొండాన్ని చెట్ల పొదల్లో వేయడంతో మొండెం కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.ఈ మొండెం దొరుకుతుందా లేక కుక్కలు ఎత్తుకెల్లాయా అన్న విషయం కూడా సంక్లిష్టంగా మారింది. పథకం ప్రకారం రాజశేఖర్ తాను ఈ ఘోరానికి పాల్పడి నేరం వేరే వారి మీద మోపాలన్న ఉద్ధేశంతో పోలీసులకు ఫోన్ చేయడం, తన కుటుంబ సభ్యులకు ఏమీ తెలియనట్లుగా నటించడం లాంటివి చేయడంతో పోలీసులకు మరింత అనుమానం కలగడంతో పోలీసులు కుటుంబ సభ్యులందరిని విచారించడంతో పొంతన లేని సమాదానాలు ఇచ్చినట్లు తెలిసింది.

కాగా పోలీసులు గత వారం రోజులుగా తమదైన శైలిలో విచారణ చెపట్టడంతో నరబలి ఆయిన రోజు జాగిలాలను, క్లూస్‌టీమ్‌లను తెప్పించి పలు రకాలుగా విచారణ చేపట్టడంతో జాగిలాలు రాజశేఖర్ ఇంటివద్దకు వచ్చి రాజశేఖర్‌ను పట్టుకునే సమయంలో ఆయన తప్పించుకున్న ట్లు సమాచారం. ఆయనతో పాటు ఆయన మామ నర్సింగ్ రావును, మంత్రగాడిని, మరో ఇద్దరు మహిళలను, మరో ఇద్దరు మొత్తం ఆరుగురిని ఈ కేసులో నింధితులుగా నిర్ధారించి తమదైన శైలిలో విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది.

పాదయాత్రలు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రజలను తమవైపునకు మళ్ళించుకునేందుకు పాదయాత్రలను అనుమతివ్వాలని అధిష్టానం నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో అంచెల వారీ పాదయాత్రలను నిర్వహించేందుకు ప్రణాళిక నిర్వహించింది. తొలుత నియోజకవర్గాల్లో ఆయా నియోజకవర్గ ముఖ్య నాయకులు, తరువాత జిల్లా సమస్యలపై జిల్లా నాయకులు పాదయాత్రలు చేపడతారు. అనంతరం నలుగురు నాయకులతో రాష్ట్రం నాలుగువైపుల నుండి పాదయాత్ర ప్రారంభించాలనే అభిప్రాయానికి వచ్చారు. అనుమతి కోరిన భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి, రేవంత్‌రెడ్డితో పాటు ఒక బిసి నేతతో కూడా పాదయాత్ర జరిపించాలని ఆలోచించినట్లు తెలిసింది. అందులో భాగంగా టిపిసిసి ఉపాధ్యక్షులు పొన్నం ప్రభాకర్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. వీలైతే ఎవరైనా మహిళా నాయకురాలితో పాదయాత్ర చేయిస్తే ఎలా ఉంటుందనే విషయాన్ని కూడా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఒక్కొక్కరు ఒక్కో ముఖ్య అంశంపై పాదయాత్ర నిర్వహించేలా కార్యాచరణ రూపొందించనున్నారు.

బస్సు యాత్ర కూడా : ఈ నెల మూడవ వారం నుండి బస్సు యాత్ర నిర్వహిస్తామని ఇప్పటికే కాంగ్రెస్ ప్రకటించింది. నియోజకవర్గాల్లో అభ్యర్థులు అవుతారనుకునే నాయకులు స్థానికంగా పాదయాత్రలు చేసేలా, మిగితా ముఖ్య నాయకులను కూడగట్టి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు.

జూన్ 2 వరకు రాహుల్‌గాంధీ మూడు సభలు

కాంగ్రెస్ అఖిల భారత అధ్యక్షులు రాహుల్‌గాంధీ సేవలను రాష్ట్రంలో విస్తృతంగా ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ భావిస్తున్నది. ఇందులో భాగంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వరకు మూడు భారీ బహిరంగ సభలు నిర్వహించాలని అనుకుంటున్నారు. అందులో ఒకటి వరంగల్‌లో, మరొకటి దక్షిణ తెలంగాణలో నిర్వహించనున్నారు. చివరగా జూన్ 2న హైదరాబాద్‌లో పది లక్షల మందితో భారీ బహిరంగసభ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. బస్సు యాత్ర, రాష్ట్ర స్థాయి పాదయాత్రలు ఆ రోజు ముగిసే విధంగా చూసుకోవాలని భావిస్తున్నారు. బస్సు యాత్ర, పాదయాత్రలకు సంబంధించి మూడు, నాలుగు రోజుల్లో స్పష్టత వస్తుందని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ డాక్టర్ ఆర్.సి.కుంటియా తెలిపారు.


డీలర్ దారుణ హత్య

న్యూఢిల్లీ : ఢిల్లీకి చెందిన ఓ ప్రాపర్టీ డీలర్‌ను బల్‌స్వా డెయిరీ ప్రాంతంలోని ఫ్లై ఓవర్ వద్ద కొందరు వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తూర్పు ఢిల్లీలోని గీతకాలనీకి చెందిన వినోద్ మెహ్రా తన 15ఏళ్ల మేనల్లుడు కునాల్‌తో కలిసి ఓ వివాహానికి హాజరైన అనంతరం మంగళవారం రాత్రి కారులో ఇంటికి తిరిగి వస్తున్నారు. ఫ్లై ఓవర్ వద్దకు రాగానే మరో కారు వేగంగా వచ్చి ఢీకొంది. కారు అద్దాలు దించి మెహ్రా జాగ్రత్తగా నడపాలని తన కారును ఢీకొన్న కారులోని డ్రైవర్‌కు సూచించారు. దీంతో ఆగ్రహానికి గురైన కారులోని వ్యక్తులు కిందకు దిగి, మెహ్రాపై కాల్చారు.

అగ్ని–1 క్షిపణి ప్రయోగం

భువనేశ్వర్: స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన అగ్ని1 అణ్వాయుధ బాలిస్టిక్ క్షిపణిని మంగళవారం భారత్ విజయవంతంగా ప్రయోగించింది. ఆర్మీకి చెందిన వ్యూహాత్మక కమాండ్ ఒడిశాలోని అబ్దుల్ కలాం దీపంలోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటిఆర్) లాంచ్ ప్యాడ్–4 నుంచి క్షిపణిని విజయవంతంగా ప్రయోగించింది. ప్రత్యేకమైన నేవిగేషన్ సిస్టం కలిగిన అగ్ని1 బాలిస్టిక్ క్షిపణి 700 కి.మీ. పరిధిలోని లక్ష్యాన్ని ఛేదిస్తుంది. 18వ వెర్షన్‌కు చెందిన ఈ క్షిపణి నిర్దారిత సమయం లోగా లక్ష్యాలను ఛేదిస్తుందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. దీనిని 2004లో సైన్యంలో ప్రవేశ పెట్టినట్లు తెలుస్తోంది. 15 మీటర్ల పొడవు, 12 టన్నుల బరువుగల ఈ క్షిపణి వెయ్యి కిలోల పేలుడు పదార్థాలను మోసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉంది. ఇంతకు ముందు నవంబర్ 22, 2016లో ఇదే బేస్ క్యాంప్ నుంచి అగ్ని క్షిపణిని ప్రయోగించారు.





ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రాజెక్టులు కట్టి తీరుతాం : మంత్రి హరీశ్‌రావు

మన తెలంగాణ / ఇల్లంతకుంట : ప్రాజెక్టులను అడ్డుకోవడమే కాంగ్రెస్ ఎజెండాగా పెట్టుకుందని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ప్రాజెక్టులను కట్టి తీరుతామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్యాకేజి 10లో మధ్యమానేరు అనుసంధానంగా టన్నెల్ పనులు, సర్జిఫూల్, అనంతగిరి రిజార్వాయర్ నిర్మాణ పనులను హరీష్ రావు పరిశీలించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని తిప్పాపూర్‌లో ఆసియాలోనే అతి పెద్ద ఓపెన్ సర్జిఫుల్ సంపు హౌజ్ నిర్మాణ పనులను మంత్రి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. అనంతగిరి రిజర్వాయర్ 10వ ప్యాకేజి టన్నెల్ పనులను, సర్జిఫుల్ పంప్ హౌజ్ నిర్మాణ పనులు, ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కోటి ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా పనులను చేపడుతుంటే వాటిని అడ్డుకునే పనిలో కాంగ్రెస్ మునిగి తేలుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బేవరేజస్ చైర్మన్ దేవిప్రసాద్, సిఇ హరిరామ్, ఎస్ఇ వేణు, ఇఇ ఆనంద్, ఎంపిపి గుడిసే అయిలయ్య, జెడ్పీటిసి సిద్దం వేణు, తహసీల్దార్ శ్రీనివాస్, డిఇ ప్రసాద్,పార్టీ అధ్యక్షుడు గొడుగు తిరుపతి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ద.మ.రైల్వేపై శీతకన్ను

- రైల్వే ఆదాయంలో ఎస్‌సిఆర్ అగ్రస్థానం
- అయినా స్వల్ప కేటాయింపులే
- తెలంగాణకు పెంచింది రూ.84 కోట్లు
- ఎపికి పెంచింది రూ.264 కోట్లు



మన తెలంగాణ/ హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం దక్షిణ మధ్య రైల్వే పట్ల బడ్జెట్‌లో శీతకన్ను ప్రదర్శించింది. దేశ రైల్వే ఆదాయంలో అన్ని జోన్ల కంటే దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) అగ్రస్థానంలో ఉన్నప్పటికీ 2018 –19 బడ్జెట్‌లో జోన్ పరిధిలోని రెండు తెలుగు రాష్ట్రాలకు ఆశించిన రీతిలో నిధుల కేటాయింపులు, కొత్త రైల్వే లైన్ల మంజూరు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులు మంజూరు కాలేదు. 2017– 18 బడ్జెట్‌తో పోల్చితే తెలంగాణ రాష్ట్రం పరిధిలోని రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు పెద్దగా పెరగలేదు. కంటి తుడుపు చర్యగా 3 కొత్త లైన్ల సర్వేకు మాత్రం అనుమతిచ్చారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలో హామీ ఇచ్చిన ఎపికి రైల్వే జోన్, ఇతర హామీలను పట్టించుకోలేదు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి కొత్త రైల్వే లైన్లు, ప్రస్తుతం కొనసాగుతున్న కొత్త లైన్లకు నిధుల కేటాయింపులు ఆశించిన రీతిలో లేవు. గత బడ్జెట్‌తో పోల్చితే ప్రస్తుతం కొనసాగుతున్న కొత్త రైల్వే లైన్ల ప్రాజెక్టులకు గతం కంటే ఎక్కువ నిధులేమీ కేటాయించ లేదు. ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎంఎంటిఎస్ విస్తరణ ప్రాజెక్టుకు రూ.21.25 కోట్లను, చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్ నిర్మాణానికి రూ. 5 కోట్లను కేటాయించడం తెలంగాణకు నిధుల కేటాయింపునకు అద్దం పడుతుంది. వనపర్తి గద్వాల్ అచ్చంపేట్ నాగర్‌కర్నూల్ కొత్త లైన్ డిమాండ్‌లపై ప్రస్తావనే లేదు. మనుగూరు రామగుండం రైల్వే లైన్ ప్రతిపాదన దశలోనే ఉంది. గతంలో సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించిన రైల్ యూనివర్సిటీని వడోదరకు కేటాయించారు.

తెలంగాణ రాష్ట్రం పరిధిలో గత బడ్జెట్‌లో మంజూరు చేసిన కొత్త రైల్వే లైన్లు, రైల్వే స్టేషన్ల అభివృద్ధి, విద్యుదీకరణ, డబ్లింగ్ తదితర ప్రాజెక్టులలో చివరి దశలో ఉన్న వాటిని పూర్తి చేసేందుకు కనీసం దాదాపు రూ.5 వేల కోట్లు అవసరమవుతాయని రైల్వే అధికారులు, ప్రజా ప్రతినిధులు కోరినా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఆ దరిదాపుల్లో కూడా లేదు. రైల్వే విషయంలో తెలంగాణాకు అన్యాయం జరుగుతుందని, ఇక్కడ రైల్వే మార్గాలు తక్కువని, ఈసారి బడ్జెట్‌లోనైనా కొత్త రైల్వే మార్గాల నిర్మాణానికి అధిక నిధులు కేటాయించాలని ఎంపిలు కోరినా ఉపయోగం లేకుండా పోయింది

గతేడాది కంటే తెలుగు రాష్ట్రాలకు కేటాయింపులు పెరిగాయి

రైల్వే బడ్జెట్‌లో తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు గతంలో కంటే కేటాయింపులు పెరిగాయని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ తెలిపారు.2018–19 ఆర్థిక సంవత్సరానికి గాను తెలంగాణకు రూ.1,813 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.3,670 కోట్లు కేటాయించినట్లు వివరించారు. బడ్జెట్‌లో ఎస్‌సిఆర్‌కు కేటాయించిన నిధుల వివరాలను ఆయన రైల్ నిలయంలో మంగళవారం మీడియాకు వివరించారు. దక్షిణ మధ్య రైల్వేకు మొత్తం రూ.5752 కోట్లు కేటాయించగా వాటిలోకొత్త రైల్వే లైన్లకు రూ.1757.70 కోట్లు, రైల్వే లైన్ల డబ్లింగ్‌కు రూ.1653.62 కోట్లు, ట్రాఫిక్ సదుపాయాల కోసం రూ.210.77 కోట్లు, ప్రయాణికుల సదుపాయాల కోసం రూ.120.03 కోట్లను కేటాయించగా 1,261 రూట్ కిమీ లైన్‌ను విద్యుదీకరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆర్‌ఓబి, ఆర్‌యు బిల నిర్మాణం తదితర పనుల కోసం రూ.400 కోట్లను కేటాయించారని, అన్ని రైల్వే స్టేషన్లు, రైళ్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఎస్‌సిఆర్‌కు నిధుల కేటాయింపులు ఇలా ఉన్నాయి.

కొత్త రైల్వే లైన్ల సర్వే:
పటాన్‌చెరు– సంగారెడ్డి– జోగిపేట–మెదక్ 95 కి.మీ.లు
నిజామాబాద్ – నిర్మల్ – ఆదిలాబాద్ 125 కి.మీ.లు
మానుకొండూర్ –హుజురాబాద్–ఎల్కతుర్తి 60 కి.మీ.లు


జిఎం వినోద్ కుమార్ యాదవ్

కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులకు కేటాయింపులు:
అక్కన్నపేట– మెదక్‌కు రూ.130 కోట్లు
మనోహరాబాద్ – కొత్తపల్లికి రూ.125 కోట్లు
మునీరాబాద్ – మహబూబ్‌నగర్‌కు రూ.275 కోట్లు
భద్రాచలం – సత్తుపల్లికి రూ.120 కోట్లు
కాజీపేట– బలార్ష మూడో లైన్‌కు రూ.301కోట్లు
నడికుడి – శ్రీకాళహస్తికి రూ.420కోట్లు
కడప – బెంగళూరుకు రూ.175కోట్లు
విజయవాడ – గుంటూరు వయా అమరావతి లైన్‌కు రూ.10 కోట్లు
ఓబులవారిపల్లె – కృష్ణపట్నం లైన్‌కు రూ.200 కోట్లు
కోటిపల్లి – నరసాపురం లైన్‌కు రూ.200కోట్లు
ఘట్‌కేసర్– యాదాద్రి రెండో దశ ఎంఎంటీఎస్ విస్తరణకు రూ.21.25 కోట్లు
విజయవాడ, కాజీపేట, రేణిగుంట, వాడి, గుత్తిలో బైపాస్ లైన్ల కోసం రూ.30.80కోట్లు
చర్లపల్లిలో శాటిలైట్ టెర్మినల్ అభివృద్ధికి రూ.5కోట్లు

డబ్లింగ్ పనులకు కేటాయింపులు:
గుంటూరు– తెనాలికి రూ.40కోట్లు
సికింద్రాబాద్ – మహబూబ్‌నగర్‌కు రూ.250కోట్లు
గుత్తి – ధర్మవరంకు రూ.76కోట్లు
గుంతకల్లు – కల్లూరుకు రూ.76.52 కోట్లు
గుంటూరు – గుంతకల్లుకు రూ.200కోట్లు
విజయవాడ – భీమవరం– నిడదవోలు రైల్వేలైన్ డబ్లింగ్, విద్యుదీకరణకు రూ.200కోట్లు

విద్యుదీకరణ మార్గాలు :
లింగంపేట – నిజామాబాద్ రైలు మార్గంలో 95 కి.మీలకు రూ.80.29 కోట్లు
వికారాబాద్ – పర్లి వైజనాథ్ మార్గంలో 269 కి.మీలకు రూ.262.12 కోట్లు
గద్వాల– రాయచూర్ మార్గంలో 57 కి.మీ.లకు రూ.46.10 కోట్లు
తెనాలి – రేపల్లె 34కిమీలకు రూ.25.98 కోట్లు
నంద్యాల–ఎర్రగుంట్ల 123 కి.మీ.లకు 111.48 కోట్లు
ధర్మవరం – పాకాల మార్గంలో 228 కి.మీలకు రూ.210.47 కోట్లు
గుంతకల్లు – కల్లూరుకు రూ.15కోట్లు
నల్లపాడు – పగిడిపల్లికి రూ.291.75 కోట్లు
పెద్దపల్లి–లింగపేట (జగిత్యాల) కు రూ.33.31 కోట్లు
మన్మాడ్– ముద్‌ఖేడ్ డోన్‌కు రూ.115కోట్లు
గుంతకల్లు– బళ్లారికి రూ.50కోట్లు

విద్యార్థినుల పట్ల టీచర్ అసభ్య ప్రవర్తన

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన అధికారులు

మన తెలంగాణ/పెనుబల్లి : విఎం బంజానాలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో విద్యార్థినుల తల్లితండ్రులు మంగళవారం ఆందోళన చేశారు. దీంతో ఉపాధ్యాయుడు కన్నెగంటి శ్రీనివాసరావును విద్యాశాఖ జిల్లా ఉన్నతాధికారులు విచారణ అనంతరం సస్పెండ్ చేస్తూ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాస్‌కు ఆదేశాలు జారీ చేశారు.

జర్మనీలో కన్వర్టర్ల పరిశీలన

త్వరలో ఇండియాకు దిగుమతి : నేడు కాళేశ్వరం బృందం రాక



మన తెలంగాణ/ధర్మారం : జర్మనీ దేశంలో పర్యటిస్తున్న కాళేశ్వరం బృందం నేడు స్వదేశానికి రానుంది. జర్మనీలో వారం రోజుల పర్యటనలో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన అత్యాధునిక పరికరాలను పరిశీలించారు. స్టాటిక్ ఫ్రీక్వెన్సీ కన్వర్టర్లను త్వరలోనే ఇండియాకు దిగుమతి చేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ పరికరాలను వాడనున్నారు. బృందం సభ్యులు జర్మనీలో పూర్తి స్థాయిలో చేసిన క్షేత్ర పరిశీలనను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తారు. లీగల్ అడ్వయిజర్ కె. పెంటారెడ్డి, కాళేశ్వరం ఇఇ నూనె శ్రీధర్, టిఎస్ జెన్‌కో డిఇ ఎన్. సైదులు, నవయుగ కంపెని డిజిఎం జి. శ్రీనివాస్ రావులతో కూడిన బృందం నేడు స్వదేశానికి వస్తున్నారు.

నా పదిహేనేళ్ల కల నెరవేరింది

బంగారు వ్యాపారి బాబి చెమ్మనూర్



మన తెలంగాణ/సంగారెడ్డి టౌన్ : తన 15 ఏళ్ల కల నెరవేరిందని, చిరకాల వాంఛ తీరినందుకు ఆనందంగా ఉందని అంతర్జాతీయ బంగారు వ్యాపారి బాబి చెమ్మనూర్ అన్నారు. కేరళా రాష్ట్రానికి చెందిన తాను మీడియాలో వచ్చిన కథనాలను తెలుసుకొని సంగారెడ్డి జైలు మ్యూజియానికి రావడం జరిగిందని తెలిపారు. మంగళవారం జైలు నుండి విడుదలైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.500 కట్టి తన చిరకాల వాంఛను తీర్చుకున్నానన్నారు. తన ముగ్గురు మిత్రులు ఇంజినీర్ అసిన్ అలీ, ట్రైనర్ ప్రశాంత్, దుబాయ్ జర్నలిస్ట్ వినయ్‌తో కలిసి ఇక్కడికి రావడం జరిగిందన్నారు. మొత్తం రూ.2వేలను కట్టి జైల్లో ఉన్నామని, ఉదయం నుండి సాయంత్రం వరకు సాధారణ ఖైదీలాగే వ్యవహరించినట్లు తెలిపారు. తనకు 15 సంవత్సరాలుగా జైలు జీవితం గడపాలని కోరిక ఉండేదని, ఇక్కడి విషయాన్ని మీడియా కథనాల్లో తెలుసుకొని వచ్చినట్లు చెప్పారు. కాగా జైలు మ్యూజియంకు రోజు రోజుకూ క్రేజ్ పెరుగుతుందని, ఇప్పటి వరకు 49 మంది జైలు జీవితం అనుభూతిని పొందినట్లు సూపరింటెండెంట్ సంతోష్‌రాయ్ ఈ సందర్భంగా వెల్లడించారు.

హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది నిరసన

మన తెలంగాణ/కరీంనగర్‌క్రైం : తెలంగాణ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతుండగా ప్లకార్డు ప్రదర్శనతో నిరసన తెలిపిన సంఘటన మంగళవారం కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో చోటు చేసుకుంది. కరీంనగర్ టిఎన్‌జిఓల సంఘం 2018 డైరీ ఆవిష్కరణ సహా కౌన్సిల్ సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి స్వామిగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో స్వామిగౌడ్ మాట్లాడుతున్న సమయంలో హౌజింగ్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు ఉద్యోగులు ప్లేకార్డులను ప్రదర్శించి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వారు నినాదాలు చేస్తున్నప్పటికి స్వామిగౌడ్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. స్వామిగౌడ్ వారితో మాట్లాడుతూ సమస్యలు అందరికి ఉన్నాయని మీ ఉద్యోగ భద్రత సమస్య నాకు తెలుసంటూ ఈ విషయమై ముఖ్యమంత్రితో ఒకసారి చర్చించడం జరిగిందన్నారు. ప్రసంగాన్ని ముగించుకుని తిరిగి వెళుతున్న స్వామిగౌడ్ వద్దకు విచ్చేసిన లలితారెడ్డి అనే అంగన్‌వాడీ ఉద్యోగి ఒక్కసారిగా ఆయన కాళ్ళపై పడింది. తమకు న్యాయం చేయాలని కోరింది. ఈ హఠాత్ పరిణామానికి నిశ్చేష్టుడైన స్వామిగౌడ్ ఆమెను పైకి లేపాలంటూ భద్రతా సిబ్బందిని, టిఎన్‌జిఓ నాయకులకు చెబుతూనే సమావేశం నుంచి వెళ్లిపోయారు.

ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి : జె.గీతారెడ్డి



మన తెలంగాణ/కోహీర్ : ముస్లింలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని, తెలంగాణ ఏర్పాటు అయితే దళితుణ్ణి సిఎంను చేస్తానని ఎన్నికలకు ముందు ఇచ్చినమాటకు సిఎం కెసిఆర్ కట్టుబడి ఉండాలని జహీరాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి డాక్టర్ జె. గీతారెడ్డి అన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్, టిడిపి పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి జిల్లాలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, స్థానిక రైల్వేగేట్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నామని గొప్పలు చెప్పడం ఏమిటని, ఎవరికీ న్యాయం జరుగడం లేదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రజలందరికీ న్యాయం జరిగిందన్నారు. ప్రజలు తెలంగాణ ప్రభుత్వంపై విరక్తి చెందుతున్నారని, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం ఖాయమన్నారు. టిడిపి నియోజకవర్గ ఇంచార్జి వై. నరోత్తం మాట్లాడుతూ ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు వెంటనే కల్పిస్తామని హామీనిచ్చిన సిఎం కెసిఆర్ ఇప్పటి వరకు ఆ ఊసే లేదన్నారు. మాజీ ఎంపిపి శౌకత్ అలీ, ముస్లిం డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అక్బర్‌అలీ, మహ్మద్ అబ్దుల్ కలాం, షహీర్ పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాలకు కేంద్రం మొండి చెయ్యి

- బడ్జెట్‌పై బాబు విమర్శల నాటకం
- కేంద్రంపై నోరుమెదపని కెసిఆర్
- సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు



మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి : బడ్జెట్ కేటాయింపులపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శల నాటకం మొదలు పెట్టారని, తెలంగాణ సిఎం కెసిఆర్ అది కూడా చేయడం లేదని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు విమర్శించారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం రిక్తహస్తం చూపిందని విమర్శించారు. రెండు రాష్ట్రాలకు కేంద్రం నిధులు విడుదల చేస్తున్నామని చెప్పినప్పటికీ కేటాయింపులు చేయలేదన్నారు. తెలంగాణకు నాలుగు డ్రైపోర్ట్స్ అని గతంలో ప్రకటించినా ఒక్కదాని ఊసు కూడా లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలు లేని మాటల గారడీ బడ్జెట్ అని విమర్శించారు. అభివృద్ధి ఏజెండా, అభివృద్ధి రాజకీయాలు అని మోడి ప్రకటిస్తుండగా బడ్జెట్‌లో ఎక్కడా అది కనబడలేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకోడి రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మోడీ ప్రభుత్వం ప్రతియోటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామంటుంటే అవి రివర్స్‌లో 70 లక్షల మంది ఉద్యోగాలు కోల్పో తున్నారని అన్నారు. అమిత్‌షా మాటల్లో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు కనిపిస్తున్నాయని, నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలపై పార్లమెంట్‌లో నోట్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన యూనివర్సిటీల అడ్రస్ కూడా లేదన్నారు. నాలుగేళ్లలో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం ఏమిచ్చిందో ముఖ్యమంత్రి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రజా సంఘాలను అభ్యుదయ పార్టీలను కలుపుకొని కేంద్రంపై పోరాటం చేయాలని లేనిపక్షంలో ప్రభుత్వం వైఫల్యానికి గురికాక తప్పదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జూలకంటి రంగారెడ్డి, సిపిఎం నేతలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి కడియం



మన తెలంగాణ/కామారెడ్డి : నాణ్యమైన విద్యనందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఉన్నత విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం బాన్సువాడ కేంద్రంలోని ఎస్ఆర్‌యన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవానికి ఉప ముఖ్యమంత్రి ఉన్నత విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడ్డాక విద్యారంగంలో పెను మార్పులు తెచ్చామని మామూలుగా చదువు చెప్పడం అనేది కాకుండా నాణ్యమైన చదువు అందించాలనేది ముఖ్యమంత్రి కోరిక అన్నారు. ఇందుకు అనుగుణంగా కళాశాలలు పాఠశాలలో నియమ నిబంధనల్లో మార్పులు తెచ్చి,విద్యాప్రమాణాలు పెంచామన్నారు. మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఆర్‌యన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల 69 శాతం సక్సెస్‌లో ఉందని అన్నారు. బాన్సువాడలో మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, కోటగిరి లో మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల,బీర్కూర్‌లో బిసి రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతకు ముందు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరికి కామారెడ్డి జిల్లా కలెక్టర్ సత్యనారాయణ స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా పరిశత్ ఛేర్మన్ దఫేదర్ రాజు, ఆర్డీవో రాజేశ్వర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మంచాల కస్తూర్బా హాస్టల్‌లో రోజుకో ఘటన

- నిన్న నిద్రమాత్రలు మింగిన ఓ విద్యార్థిని
- నేడు నీటి బావిలో దూకిన మరో విద్యార్థిని
- వార్డెన్, సిబ్బంది సమన్వయ లోపంతోనే ఘటనలు
- తల్లిదండ్రులు నిలదీయడంతో తప్పు ఒప్పుకున్న వార్డెన్



మన తెలంగాణ/మంచాల : మంచాల మండల కేంద్రంలోని కస్తూర్బా గిరిజన పాఠశాలలో రోజుకో సంఘటనతో విద్యార్థినులు బిక్కు బిక్కు మంటు చదువులు కొన సాగిస్తున్నారు.నిన్న ఓవిద్యార్థిని మనస్థాపంతో ప్యారాసిటమల్ మందు గోళీలను మింగి అస్వస్థతకు గురి కావడంతో నగరంలోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆ సంఘటన మరువక ముందే మంగళవారం ఓ పదవ తరగతి విద్యార్థిని మండల పరిధిలోని పటేల్‌చెర్వు తండాలో నిర్వహించిన హనుమాన్ జాతరకు వెళ్లి నీటి బావిలో దూకింది. వెంటనే గమనించిన తండా వాసులు విద్యార్థిని రక్షించి తమ తల్లి దండ్రులకు సమాచారం అందించారు. మంచాల మండల పరిధిలోని పటేల్ చెర్వు తండాకు చెందిన గిరిజన విద్యార్థిని మంచాల మండల కేంద్రంలోని కస్తూరిభా గిరిజన పాఠశాలలో పదవ తరగతి చదువుతుంది.ఆ విద్యార్థిని తల్లి దండ్రులు నగరంలోని ఓ ఆసుపత్రిలో వంట చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి కూతురు హాస్టల్‌లో చదువుకుంటుందని అనుకుంటున్న ఆ తల్లి దండ్రులకు తమ కూతురు బావిలో దూకిందన్న వార్త తెలియగానే హాస్టల్‌కు వచ్చి వార్డెన్‌ను నిలదీశారు. తమకు తెలియ కుండా తమ కూతురును బయటకు ఎందుకు పంపించారని నిలదీశారు. దీంతో ఆ వార్డెన్ తప్పయిందని, మరో సారి ఇలాంటి సంఘటన చోటు చేసుకోకుండా చూస్తానని మండల అధికారుల ముందు వాపోయింది.



కెసిఆర్‌తోనే వికలాంగుల సంక్షేమం

వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి

మన తెలంగాణ/నల్లగొండ టౌన్ : అనేక సంవత్సరాలుగా ఎన్నో సమస్యలతోని ఇబ్బందులను ఎదుర్కొన్న విలలాంగులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌తోనే సమస్యలన్నీ పరిష్కారమై వికలాంగులు అన్ని రకాలుగా సుఖఃసంతోషాలతో ఉంటున్నారని రాష్ట్ర వికలాంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని తెలంగాణ ప్రభుత్వ కళాశాల వికలాంగుల వసతిగృహాన్ని సందర్శించి వికలాంగ విద్యార్థులను హాస్టల్‌కు సంబంధించిన స్థితిగతులను తెలుసుకున్నారు. భోజన సమయంలో ఆహార మెనూను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రాత్రి సమయంలో విద్యార్థులతో పాటే నిద్రించడం జరిగింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రంలోని ప్రతి వికలాంగుల వసతిగృహంలో విద్యార్థికి 850 రూపాయలు ఉన్న మెస్ చార్జీలను 1500 రూపాయలకు పెంచారన్నారు. ప్రతి గురువారం ఆహార మెనూలో మటన్, ఆదివారం చికెన్, సన్నబియ్యంతో ఆహారం అందించి వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. గత పాలకులు వికలాంగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి కంట్రోల్ బియ్యంతో ఆహారాన్ని అందించి వసతిగృహాలు మురికికుప్పలుగా మారి విద్యార్థులు అనేక రోగాల భారిన పడ్డారన్నారు. టిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి కంచర్ల భూపాల్‌రెడ్డి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నల్లగొండ, సూర్యాపేట కో ఆర్డినేటర్ మాలె శరణ్యారెడ్డి పాల్గొన్నారు.

మాదాపూర్ మెట్రోస్టేషన్‌లో అగ్ని ప్రమాదం

మన తెలంగాణ– /మాదాపూర్ : మాదాపూర్ మెట్రో రైల్వే స్టేషన్‌లో స్వల్ప అగ్ని ప్రమాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం సాయంత్రం వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో నిప్పు రవ్వలు ఎగిరి పడ్డాయి. దీంతో మంటలు చెలరేగడంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. వెల్డింగ్ పనులు చేస్తున్న వారికి స్వల్ప గాయాలు కాగా వారిని సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సంఘటనలో ఎలాంటి నష్టం జరగలేదు. భద్రత కోసం ఏర్పాటు చేసిన జాలీ మాత్రమే కాలిపోయింది.

కెసిఆర్ నిరంకుశ పాలనను తరిమి కొడదాం : లక్ష్మణ్

మన తెలంగాణ/సత్తుపల్లి :నిరంకుశ పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్‌ను తరిమి కొడదామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్. కె. లక్ష్మణ్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం సత్తుపల్లిలో బిజెపి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన దళిత అదాలత్‌కు హాజరై ఆయన మాట్లాడుతూ కెసిఆర్ నాలుగేళ్ల పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. నిజాం నవాబును మరిపించేలా కెసిఆర్ పాలన సాగుతుందన్నారు. సామాజిక వర్గాలను పూర్తిగా విస్మరించారన్నారు. సమస్యలపై పోరాటాలు, నిరసన, ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టులు చేసి, కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తున్నారని, అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఎస్సీ నియోజకవర్గాల్లో దళిత అదాలత్ నిర్వహించడం ద్వారా కేసీఆర్‌ను సాగనంపే కార్యక్రమాన్ని సత్తుపల్లి నుంచే నాంది పలికామన్నారు. దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వేముల అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ దళిత అదాలత్‌లో దళిత మోర్చా రాష్ట్ర ఇంఛార్జ్ యస్.కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి చిన్న రాము, రాష్ట్ర కార్యదర్శి కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. టిఆర్ఎస్‌కు చెందిన నంబూరి రామలింగేశ్వరరావు వైరా నుండి తన అనుచరులతో భారీ ర్యాలీగా వచ్చి సభా ప్రాంగణంలో రాష్ట్ర అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ సమక్షంలో బిజెపిలో చేరగా లక్ష్మణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ప్రయోగాత్మక చిత్రంలో మాధురి

బాలీవుడ్‌లో 1980 దశకం నుంచి 2000 సంవత్సరం ప్రారంభం వరకు స్టార్ హీరోయిన్‌గా మాధురీ దీక్షిత్ ఓ వెలుగు వెలిగింది. తన అందం, అభినయం, డ్యాన్సులతో బాలీవుడ్‌ను ఓ ఊపు ఊపింది. పలవురు స్టార్ హీరోలతో హిట్ సినిమాలు చేసి స్టార్ హీరోయిన్‌గా తనకు తిరుగులేదనిపించుకుంది. అయితే పెళ్లయిన తర్వాత సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టిన ఆమె కొంతకాలం క్రితం బాలీవుడ్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టింది. కొన్ని సినిమాల్లో ప్రత్యేక పాత్రల్లో కనిపిస్తూ మాధురి ప్రేక్షకులను అలరిస్తోంది. ఇక చాలా కాలం తర్వాత ఒక ఫుల్‌లెంగ్త్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించబోతోంది. అంతేకాకుండా మొదటిసారి ఓ మరాఠీ సినిమాలో ఆమె నటిస్తుండడం విశేషంగా చెప్పుకోవాలి. ఈ సినిమాలో తల్లిగా, సోదరిగా అన్ని కోణాల్లో తన పాత్రను బ్యాలెన్స్ చేయనుంది. ఈ చిత్రంలో ఆమె ఖరీదైన స్టైలిష్ బైకులను కూడా నడిపిందట. హార్లీ డైవిడ్‌సన్ వంటి బైకులను మాధురి హుందాగా నడిపి ఆశ్చర్యపరిచిందట. స్టైలిష్‌గా ఉండే కాస్ట్యూమ్స్‌ను ధరించి సినిమాలో అద్భుతంగా నటించిందని సమాచారం. తొలిసారి ప్రయోగాత్మక చిత్రంలో నటిస్తున్న మాధురి ప్రేక్షకులను ఏమేరకు అలరిస్తుందో చూడాలి.



ఆయుర్వేద చికిత్స కోసం వైజాగ్‌కు...


చిరంజీవి

మెగాస్టార్ చిరంజీవి 151వ సినిమా 'సైరా... నరసింహారెడ్డి'ని భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. రామ్‌చరణ్ స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం కోసం చిరంజీవి చాలా కష్టపడుతున్నాడు. ఇప్పుడు ఆయన ఆయుర్వేద చికిత్స కూడా తీసుకోబోతున్నాడట. ఎప్పుడో మొదలైన 'సైరా...' షూటింగ్‌లో భాగంగా ఇప్పటివరకు యాక్షన్ పార్ట్‌ను మాత్రమే తెరకెక్కించారు. మరి ఉయ్యాలవాడ జీవితంలో కూడా రొమాంటిక్ యాంగిల్ కూడా ఉంటుంది కదా. ఇప్పుడు ఆ యాంగిల్ చిత్రీకరణ కోసమే చిరంజీవి తెగ కష్టపడుతున్నాడు. యంగ్ ఉయ్యాలవాడగా కనిపించేందుకు చిరంజీవి వైజాగ్ వెళ్తున్నాడు. ఎందుకంటే అక్కడ ఆయుర్వేద చికిత్స తీసుకోబోతున్నాడట. చర్మంలో మెరుపును పెంచి వయసును కాస్త తగ్గించే విధంగా ఆయనకు చికిత్స అందిస్తారట. కొన్ని రోజుల పాటు చిరంజీవి వైజాగ్‌లోనే ఉండి ఆయుర్వేద చికిత్స పూర్తిచేసుకొని తిరిగి షూటింగ్‌లో పాల్గొంటాడట. చిరు వయసు కాస్త తగ్గినట్టు కనిపిస్తే అప్పుడు ఉయ్యాలవాడ యువకుడిగా ఉన్నప్పటి సన్నివేశాల చిత్రీకరణను ప్రారంభిస్తారు. ఇక సైరా సినిమా విషయంలో చిరంజీవి చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడని తెలిసింది. ఆమధ్యన ఈ సినిమాకు డైలాగులు సరిగా కుదరలేదని భావించి రచయిత సాయిమాధవ్ బుర్రాను దగ్గర కూర్చోపెట్టుకొని మాటలు రాయించుకున్నాడని సమాచారం. కథ విషయంలో కూడా పరుచూరి బ్రదర్స్ చేత చిన్న చిన్న మార్పులు చేయించాడని తెలిసింది.

ముంబయ్‌లో భారీ పోరాటాలు



అక్కినేని నాగార్జున, రామ్‌గోపాల్ వర్మ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న నాలుగో చిత్రం రెగ్యులర్ షూటింగ్ కొన్ని షెడ్యూళ్లను కూడా పూర్తిచేసుకుంది. ప్రస్తుతం ఈ చిత్రం కొత్త షెడ్యూల్ ముంబయ్‌లో జరుగుతోంది. నాగార్జున, అజయ్, షాయాజీషిండేల కాంబినేషన్‌లో ఒక యాక్షన్ సీక్వెన్స్‌ను షూట్ చేస్తున్నారు. బాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ ఐజా షేక్ సారథ్యంలో ఈ యాక్షన్ ఎపిసోడ్ షూటింగ్ జరుగుతోంది. ముంబయ్‌లోని ఎస్సెల్ వరల్డ్ అనే అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ఛేజింగ్ సీన్స్‌ను కూడా తెరకెక్కిస్తున్నారు. మార్చి 10 వరకు జరుగనున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలు కూడా చిత్రీకరించనున్నారు. ఇక ఈ క్రేజీ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఇందులో నాగార్జునను వర్మ సరికొత్తగా చూపిస్తున్నాడు. విభిన్నమైన కథాంశంతో వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు.

సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి హీరోహీరోయిన్లుగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఇంటిలిజెంట్'. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. అధినేత సి.కళ్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ లావణ్య త్రిపాఠీతో ఇంటర్వ్యూ విశేషాలు...

అది నిజంగా సాధ్యం కాదు


లావణ్య త్రిపాఠి

కోపం కూడా ఎక్కువే...

'ఇంటిలిజెంట్'లో నా క్యారెక్టర్ పేరు సంధ్య. యుఎస్‌లో చదువుకొని ఇండియాకు వచ్చి తండ్రి బిజినెస్‌లో సహాయం చేసే అమ్మాయి క్యారెక్టర్ నాది. సినిమాలో నాకు కొంచెం కోపం కూడా ఎక్కువే.

అందుకే ఒప్పుకున్నా...

నా పాత్రలో నటనకు స్కోప్ ఎక్కువగా కనిపించింది. అందుకే ఈ క్యారెక్టర్ చేయడానికి ఒప్పుకున్నాను. దర్శకుడు వినాయక్ టేకింగ్ భిన్నంగా అనిపించింది. సినిమాలోని నా పాత్ర అందరినీ ఆకట్టుకుంటుంది.

ఇంటెలిజెన్స్‌తో ఎదుర్కొనే...

హీరోను దృష్టిలో పెట్టుకొని పెట్టిన టైటిల్ 'ఇంటిలిజెంట్'. హీరో తన ఇంటెలిజెన్స్‌తో విలన్‌లను ఎలా ఎదుర్కొన్నాడు అనేది ఈ సినిమా. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే చిత్రమిది.

అతను మంచి డ్యాన్సర్...

నేను కలిసి పనిచేసిన హీరోలు అందరికంటే సాయిధరమ్‌తేజ్ చాలా కంఫర్ట్‌గా అనిపించాడు. మంచి నటుడైన అతను ఎప్పుడూ సరదాగా ఉంటాడు. అన్నింటికంటే తేజు మంచి డ్యాన్సర్.

డ్యాన్స్ ప్రాక్టీస్ చేశా...

నా అన్ని సినిమాలకన్నా ఈ సినిమాలో ఎక్కువగా డ్యాన్సులు చేశాను. వాటి కోసం ప్రాక్టీస్ కూడా బాగానే చేశాను. డ్యాన్సులు అందరికీ నచ్చుతాయి. తేజుతో కలిసి డ్యాన్స్ చేయడం మరచిపోలేని అనుభూతినిచ్చింది.

కొంత టెన్షన్ పడ్డా...

మెగాస్టార్ చిరంజీవి 'చమకు చమకు...' పాట రీమిక్స్‌లో డ్యాన్స్ చేయడం ఎంతో ఆనందంగా అనిపించింది. అది చాలా గొప్ప పాట. చిరంజీవి స్థాయిలో డ్యాన్స్ చేయడం నిజంగా సాధ్యం కాదు. అందుకే ప్రేక్షకులకు నచ్చేలా మా ప్రయత్నం మేం చేశాం. సినిమాలో ఈ పాటను రీమిక్స్ చేస్తున్నామని చెప్పగానే కొంత టెన్షన్ పడ్డాను.

చిన్న పిల్లల్లా చూసుకున్నారు...

దర్శకుడు వి.వి.వినాయక్ చాలా సింపుల్‌గా ఉంటారు. సినిమాకు ఏం కావాలో ఆయనకు బాగా తెలుసు. కాబట్టి మా చేత సులభంగా పని చేయించుకున్నారు. సెట్స్‌లో ఆయన నెమ్మదిగా ఉంటారు. మమ్మల్ని అందరినీ చిన్న పిల్లల్లా చూసుకున్నారు.

షూటింగ్‌ను ఎంజాయ్‌చేసేవారు...

నిర్మాత సి.కళ్యాణ్‌కు సినిమా అంటే చాలా ప్యాషన్. అన్నీ దగ్గరుండి చూసుకునేవారు. ఎప్పుడూ సెట్స్‌లోనే ఉంటూ షూటింగ్‌ను ఎంజాయ్ చేసేవారు.

ఆ అవకాశం రావాలి...

స్క్రిప్ట్‌ల ఎంపికలో హీరోలకు ఉన్నంత వెసులుబాటు హీరోయిన్లకు ఉండదు. మాకు కూడా వారిలాగే భిన్నమైన స్క్రిప్ట్‌లను ఎంపిక చేసుకునే అవకాశం రావాలని కోరుకుంటున్నాను.

పెళ్లి పీటలెక్కనున్న శ్రియ?

సౌత్‌లో మంచి క్రేజ్ ఉన్న బ్యూటీ శ్రియాశరణ్. డెహ్రాడూన్‌కు చెందిన ఈ ముద్దుగుమ్మ 15 ఏళ్లకు పైగా చిత్ర పరిశ్రమలో ఉంటూ స్టార్‌గా కొనసాగుతోంది. ఇప్పటికీ ఆమెకు మంచి అవకాశాలు వస్తూనే ఉన్నాయి. ఈ బ్యూటీ త్వరలో పెళ్లికి సిద్ధమవుతుందనే టాక్ వినిపిస్తోంది. త్వరలోనే శ్రియా పెళ్లి ఖాయమని అంటున్నారు ఆమె సన్నిహితులు. కొన్ని నెలల క్రితం ఈ భామ రష్యాకు చెందిన ఓ వ్యక్తితో ప్రేమలో పడిందట. పరిచయమైన కొన్ని వారాల వ్యవధిలోనే ప్రేమలో మునిగిపోవడం... పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకోవడం కూడా జరిగిపోయాయట. అంతేకాదు రెండు కుటుంబాలకు చెందిన వారు మాట్లాడుకోవడం కూడా జరుగగా... పెళ్లి ముహూర్తాలు కూడా పెట్టుకుంటున్నారని తెలిసింది. ఇప్పటికే పెళ్లి వేదిక కూడా ఖరారు అయిందని సమాచారం. రాజస్థాన్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్‌కు శ్రియా ప్లాన్ చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. అయితే ఇప్పటివరకు తన పెళ్లిపై శ్రియా అధికారికంగా స్పందించలేదు. అయితే కొన్ని రోజుల క్రితం ఆమె... పెళ్లి విషయంలో తనకు ఇంట్లో నుంచి వత్తిడి పెరుగుతోందని చెప్పింది. అప్పటికే ఈ పెళ్లి ఖరారు అయి ఉంటుందని అందుకే అప్పుడు శ్రియా ఆ మాట చెప్పి ఉంటుందని అంటున్నారు.


శ్రియ

రొమాంటిక్ పాటల్లో వణికిపోయారు!


నిరూప్, అవంతిక

ఇటీవల విడుదలైన 'రాజరథం'లోని కాలేజీ డేస్..., నీలి మేఘమా... పాటలకు మంచి స్పందన వచ్చింది. దర్శకుడు అనూప్ సంగీతం, రామజోగయ్య శాస్త్రి సాహిత్యంతో రూపొందిన ఈ పాటలు కనువిందైన దృశ్యాలతో ప్రేక్షకులను అలరించాయి. ఎన్నో జ్ఞాపకాలను గుర్తుచేసేలా, కలల్లో విహరింపచేసేలా ఉన్న ఈ రొమాంటిక్ పాటల్లో నటించిన నిరూప్, అవంతికలు చలికి వణికిపోయారు. ఈ పాటల చిత్రీకరణలో రెయిన్ సీక్వెన్స్ కోసం వాడిన నీరు చాలా చల్లగా ఉండడమే అందుకు కారణం. వణికించేంత చల్లని నీటిలో తడుస్తూ పాటకు తగ్గట్టుగా హావభావాలను పలికించడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చింది. సీన్ కట్ చెప్పగానే చిత్ర బృందం నిరూప్, అవంతిక మీద వేడి నీళ్లు పోసి, బ్లాంకెట్ కప్పాక కానీ మామూలు స్థితికి వచ్చేవారు కాదు. ఇంత కష్టపడి చేయడంతోనే 'రాజరథం' ట్రైలర్, పాటలు అద్భుతంగా రూపుదిద్దుకోగలిగాయి. అజయ్ రెడ్డి, అంజు వల్లభనేని, విష్ణు దకప్ప, సతీష్ శాస్త్రి నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం ఈనెల 16న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది.

తొలి చిత్రంతోనే మంచి క్రేజ్

నాగశౌర్య, రష్మిక మండన్న జంటగా నటించిన 'ఛలో' చిత్రం ఘన విజయం దిశగా దూసుకుపోతోంది. మంచి కామెడీ కంటెంట్‌తో తెరకెక్కిన ఈ లవ్‌స్టోరీతో కన్నడ బ్యూటీ రష్మిక తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఈ చిత్రంలో ఆమె స్క్రీన్ ప్రెజెన్స్‌కు, పర్‌ఫార్మెన్స్‌కు ప్రేక్షకులు మంచి మార్కులే వేశారు. ఈ విజయంతో ఈ బ్యూటీకి తెలుగులో మంచి క్రేజ్ వచ్చింది. దీంతో పలువురు దర్శకులు తమ సినిమాల్లో యంగ్ హీరోలకు జోడీగా ఆమెనే పరిశీలిస్తున్నారు. ఇక తొలి సినిమాతోనే మంచి పాపులారిటీని దక్కించుకోవడం విశేషమనే చెప్పాలి. కన్నడలో కూడా రష్మిక చేసిన మొదటి చిత్రం 'కిరిక్ పార్టీ' ఘన విజయాన్ని అందుకొని ఆమెను ఓవర్‌నైట్ స్టార్‌ను చేసేసింది. ప్రస్తుతం ఆమె పరుశురామ్ దర్శకత్వంలో హీరో విజయ్ దేవరకొండ చేస్తున్న చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రం కూడా మంచి విజయాన్ని అందుకుంటే యంగ్ స్టార్ హీరోయిన్ల జాబితాలో రష్మిక చేరడం ఖాయం.


రష్మిక మందన్న


అజిత్, నయనతార

నాలుగోసారి క్రేజీ కాంబినేషన్


ఒకరు మాస్‌లో తిరుగులేని స్టార్... మరొకరు లేడీ సూపర్‌స్టార్. ఈ ఇద్దరూ మరోసారి జతకట్టారు. అవును.. అజిత్, నయనతార కాంబినేషన్‌లో మరో సినిమా రానుంది. ప్రస్తుతం ఈ క్రేజీ కాంబినేషన్‌లో తమిళంలో ఓ సినిమా రూపుదిద్దుకోనుంది. ఇందులో నయనతార హీరోయిన్. గతంలో అజిత్‌తో వీరమ్, వేదాలమ్, వివేకం వంటి సినిమాలు తీసిన దర్శకుడు శివ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నాడు. అజిత్, నయనతార కాంబినేషన్‌లో ఇది నాలుగో సినిమా. కాకపోతే నయనతారకు విపరీతమైన స్టార్‌డమ్ వచ్చిన తర్వాత అజిత్‌తో కలిసి చేయబోతున్న సినిమా ఇది. తెలుగులో 'జై సింహా'తో హిట్ కొట్టిన నయనతార ఇప్పుడు కోలీవుడ్‌లో మరో హిట్‌ను కొట్టడం ఖాయమని అంటున్నారు. ఇప్పటికే తమిళ్‌లో ఓ హార్రర్ సినిమాలో నటించేందుకు ఓకే చెప్పిన నయన్ ఇప్పుడు అజిత్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

రకుల్ సినిమా వాయిదా

గత ఏడాది 'రారండోయ్ వేడుక చూద్దాం' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న తర్వాత అందాల తార రకుల్‌ప్రీత్ సింగ్‌కు ఇప్పటివరకు మరో సక్సెస్ దక్కలేదు. ఆమె నటించిన 'స్పైడర్' డిజాస్టర్ కాగా 'ఖాకీ' పర్వాలేదనిపించుకుంది. ఇదే సమయంలో ఓ బాలీవుడ్ మూవీని పూర్తి చేసింది రకుల్. సిద్ధార్థ్ మల్హోత్రాకు జోడీగా 'అయ్యారీ' చిత్రంలో ఆమె నటించింది. మనోజ్ బాజ్‌పాయ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం పూర్తయింది. అనుకున్న ప్రకారం అయితే ఈ చిత్రం ఈనెల 9న విడుదలకావాల్సి ఉంది. కానీ ఇప్పుడు ఈ సినిమా విడుదలపై సందేహాలు తలెత్తుతున్నాయి. ఇందుకు కారణం... ఈ చిత్రానికి ఇంకా సెన్సార్ సర్టిఫికెట్ అందకపోవడమే. సెన్సార్ సభ్యులు తిరస్కరించగా రివైజింగ్ కమిటీకి వెళ్లారు ఫిల్మ్‌మేకర్స్. ఈ సినిమాను ఆర్మీ చేపట్టే కోవర్ట్ మిషన్స్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కించడంతో రక్షణ శాఖ జోక్యం చేసుకుందట. దేశ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని ఈ సినిమాలో చూపించారని భావిస్తున్నారట. దీంతో కొన్ని సన్నివేశాల్లో మార్పులు చేయాలంటూ సెన్సార్ సభ్యులు దర్శకుడు నీరజ్‌పాండేకు సూచించినట్లు చెప్పుకుంటున్నారు. ఇప్పటికిప్పుడు మార్పులు చేసేయడం అంటే సాధ్యమయ్యే పనికాదు. అందుకే సినిమా రిలీజ్ డేట్‌ను ఈనెల 9 నుంచి వాయిదా వేసుకుంటున్నట్లు తెలిసింది. కాగా ఈ నెలలోనే 'అయ్యారీ'ని విడుదల చేయాలని ఫిల్మ్‌మేకర్స్ భావిస్తున్నారు.


రకుల్‌ప్రీత్ సింగ్

తాను 'గోల్డ్' అంటున్నాడు




కొన్ని సంవత్సరాల క్రితం అక్షయ్‌కుమార్ అంటే రొటీన్ యాక్షన్, కామెడీ సినిమాలు చేసే ఒక మామూలు హీరోగా కనిపించేవాడు. కానీ గత ఐదు, ఆరు సంవత్సరాలుగా అతని ఇమేజే మారిపోయింది. అమీర్‌ఖాన్ తర్వాత అంత వైవిధ్యమైన కథలతో భిన్నమైన సినిమాలు చేస్తూ క్రమక్రమంగా తన ఇమేజ్‌ను పెంచుకుంటూ గొప్ప పేరు సంపాదించాడు అక్షయ్. గత ఏడాది ఈ స్టార్ హీరో నుంచి వచ్చిన ఎయిర్‌లిఫ్ట్, జాలీ ఎల్‌ఎల్‌బి2, టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ చిత్రాలు అతని ఇమేజ్‌ను మరింత పెంచాయి. ఈ వారాంతంలో రిలీజ్ కాబోయే అక్షయ్ 'ప్యాడ్‌మ్యాన్' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలే ఉన్నాయి. దీని తర్వాత ఈ స్టార్ హీరో నుంచి రాబోయే 'గోల్డ్' కూడా అతని కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా విడుదలైన టీజర్‌తో ఇది టాక్ ఆఫ్ ద ఇండియన్ సినిమా అయింది. దేశ స్వాతంత్ర్యానికి ముందు ఇండియాకు ఒలింపిక్స్ హాకీలో స్వర్ణం సాధించిపెట్టేందుకు ఓ ప్లేయర్ చేసిన పోరాటం నేపథ్యంలో సాగే కథ ఇది. అప్పటి నేపథ్యాన్ని చాలా చక్కగా చూపిస్తున్నారట ఈ సినిమాలో. ఈ చిత్రం టీజర్ చూస్తుంటే అక్షయ్ మరోసారి తానేంటో చూపించబోతున్నట్లు అనిపించింది. ఫర్హాన్ అక్తర్ చెల్లెలు రీమా కగ్తి దర్శకత్వంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఫర్హాన్ అక్తర్, రితేష్ సిధ్వాని కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతంలో రీమా కగ్తి... హనీమూన్ ట్రావెల్స్ ప్రై.లి., తలాష్ వంటి వైవిధ్యమైన సినిమాలను తెరకెక్కించింది. ప్రస్తుతం ఆమె రూపొందిస్తున్న 'గోల్డ్' దేశ స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 15న విడుదలకానుంది. ఈమధ్యన బాలీవుడ్‌లో స్పోర్ట్స్ బేస్డ్ సినిమాలన్నీ దాదాపుగా విజయం సాధించాయి. మరి 'గోల్డ్' కూడా ఆ తరహాలోనే విజయం సాధిస్తుందేమో చూడాలి.



11 శాతం పెరిగిన పిఎన్‌బి లాభం

న్యూఢిల్లీ: డిసెంబర్ 31 ముగింపునాటి మూడో త్రైమాసిక ఫలితాల్లో ప్రభుత్వరంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) నికర లాభం 11.10 శాతం వృద్ధిని సాధించి రూ. 230.1 కోట్లను ఆర్జించింది. గతేడాది ఇదే సమయంలో లాభం రూ.207 కోట్లుగా ఉంది. క్యూ2(జులై–సెప్టెంబర్)లో బ్యాంక్ లాభం రూ.560 కోట్లతో పోలిస్తే ఈసారి క్షీణత నమోదైంది. అంచనాలను అందుకోలేకపోయింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 13.31 శాతం నుంచి 12.11 శాతానికి తగ్గాయి. ఇక నికర ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) 8.44 నుంచి 7.55 శాతానికి పెరిగాయి. మూడో త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.15,257.50 కోట్లను సాధించింది. గతేడాదిలో ఇదే సమయంలో సాధించిన రూ.14,123.98 కోట్లతో పోలిస్తే ఇది 7శాతం అధికంగా ఉంది. నిర్వహణ వ్యయం 52.7 శాతం పెరిగి రూ.4,245ను ఆర్జించింది. ఇదే క్యూ3లో నికర వడ్డీ ఆదాయం రూ. 3989 కోట్లకు చేరుకుంది. క్యూ3 ఫలితాల నేపథ్యంలో పిఎన్‌బి షేరు నష్టాల్లో ట్రేడ్ అయింది. బ్యాంక్ షేరు విలువ 1.19 శాతానికి పైగా నష్టపోయి రూ.161.75కు చేరింది.

మార్కెట్లు గజగజ





- **అంతర్జాతీయ పరిణామాలు, ఇతర అంశాల ఎఫెక్ట్**
- **561 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**

ముంబై : అంతర్జాతీయ పరిణామాలు ప్రత్యేకించి.. అమెరికాలో సూచీల పతనంతో దేశీయ స్టాక్‌మార్కెట్లు భయాందోళనకు గురయ్యాయి. మార్కెట్ సూచీలు ఆర్థిక మాంద్యం పరిస్థితులను గుర్తు చేశాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ 1,200 పాయింట్లు కుప్పకూలింది. అయితే తర్వాత కోలుకొని 561 పాయింట్ల నష్టంతో 34,195 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ కూడా 168 పాయింట్లు నష్టపోయి 10,498 వద్ద స్థిరపడింది. ప్రపంచ ప్రధాన మార్కెట్లు అన్నీ భారీ నష్టాల్లోనే ట్రేడ్ అయ్యాయి. భారత మార్కెట్లలో ఎస్‌బిఐ, మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, రిలయన్స్, టిసిఎస్ దిగ్గజ కౌంటర్లలో షేర్లు భారీగా అమ్మకానికి రావడం కూడా మార్కెట్‌ను బాగా కుంగదీసింది. ఈ నేపథ్యంలో కేవలం క్షణాల వ్యవధిలోనే లక్షల కోట్ల రూపాయల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది.

వాల్‌స్ట్రీట్ పతనమే కారణం : దేశీయంగా నష్టాలకు ప్రధానంగా అమెరికా వాల్‌స్ట్రీట్ సూచీల పతనమే కారణమని నిపుణులు చెబుతున్నారు. శుక్రవారం విడుదలైన అమెరికా ఉపాధి గణాంకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బాగా దెబ్బతీశాయి. 2009 తర్వాత అమెరికాలో వేతనాలు వేగంగా పెరిగిపోతున్నాయని నివేదిక తెలిపింది. దీంతో ద్రవ్యోల్బణం పెరిగిపోయే ప్రమాదం ఉండటంతో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు పాల్పడ్డారు. ఫలితంగా డోజోన్స్, నాస్‌డాక్‌లు భారీ నష్టాలను నమోదు చేశాయి. మరోవైపు అంచనాలకు మించిన వేగంతో ఫెడ్ వడ్డీ రేట్లను పెంచడంతో అమెరికాలో బాండ్ల లాభదాయకత పెరిగింది. ఫలితంగా షేర్ల కంటే ఇవే ఆకర్షణీయంగా ఉన్నాయి. ఇవి అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్లపై, కమోడిటీ సూచీలపై కూడా ప్రభావం చూపాయి. వాల్‌స్ట్రీట్ పతనంతో ఆసియా మార్కెట్లూ పతనం బాటపట్టాయి. జపాన్ సూచీ నికాయ్ ఇంట్రాడేలో ఏకంగా 1,522 పాయింట్లు (6.71 శాతం) పడిపోయింది. ఆటోమేకర్స్, ఫైనాన్స్, టెక్నాలజీ రంగ షేర్లు భారీగా పతనమయ్యాయి.

ఎల్‌టిసిజి పన్ను ఎఫెక్ట్ : బడ్జెట్ సందర్భంగా ప్రకటించిన దీర్ఘకాలిక పెట్టుబడి లాభాల పన్ను(ఎల్‌టిసిజి టాక్స్)తో అమ్మకాలకు తెరలేచింది. బడ్జెట్ మరుసటి రోజు నుంచి ప్రారంభమైన నష్టాల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే ఎల్‌టిసిజితో మార్కెట్లో దీర్ఘకాలిక పెట్టుబడులుగా మారే వాటాలను ఇన్వెస్టర్లు భారీగా సేల్ చేస్తున్నారు. మార్కెట్ విలువ రోజురోజుకూ పతనం అవుతుండటంతో పెద్ద ఇన్వెస్టర్లు వీలైనంత త్వరగా షేర్లను అమ్మేసి లాభాలను పొందడమే మేలని భావిస్తున్నారు. ఈ క్రమంలో మార్కెట్లు మరింత కుంగుతున్నాయి. దీనికి ప్రపంచ మార్కెట్ల భయాలు కూడా తోడవ్వడంతో సూచీలు నేలచూపులు చూస్తున్నాయి.

ఆర్‌బిఐ సమీక్షపై ఇన్వెస్టర్ల దృష్టి : నేడు(బుధవారం) నిర్వహించే ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) పరపతి సమీక్షపై ఇన్వెస్టర్ల దృష్టి నెలకొంది. ఈ సమీక్షలో ఆర్‌బిఐ కఠిన నిర్ణయాలు ఉంటాయనే ప్రచారం మార్కెట్లను భయపెడుతోంది. ఒకవేళ ఆర్‌బిఐ వడ్డీ రేట్లు పెంచడమో, కఠిన నిర్ణయాలు తీసుకోవడమే జరిగితే మార్కెట్లపై ప్రతికూల ప్రభావం ఉండనుంది. వడ్డీ రేట్లు పెరిగితే నగదు లభ్యత మరింత ప్రియమవుతుంది. ద్రవ్యోల్బణం 17నెలల్లో అత్యధిక స్థాయిలో నమోదు కావడం కూడా ఆర్‌బిఐ కఠిన నిర్ణయాలకు కారణమవుతుందని భావిస్తున్నారు.

దిద్దుబాటు షురూ.. :సూచీలు ఇప్పటికే అధిక విలువ వద్ద ట్రేడ్ అవుతున్నాయనే విషయం అందరికీ తెలిసిందే. ఇప్పటికే చాలా మంది ఆర్థిక నిపుణులు ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు కూడా చేశారు. ఇటీవల ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ కూడా ఆర్థిక సర్వే సందర్భంగా మార్కెట్లో దిద్దుబాటు తప్పదని పేర్కొన్నారు. దీనికి తగినట్లే బడ్జెట్ మరుసటి రోజునే సూచీలు నేల చూపులు చూస్తున్నాయి. మరో వారం లేదా పది రోజుల్లో మార్కెట్లు నిలకడ స్థితికి చేరుకుంటాయన్నారు.

టెక్నికల్ అంశాలు : సూచీల సాంకేతిక అంశాలు కూడా ఇన్వెస్టర్లను నిరుత్సాహానికి గురిచేయడంతో పతనం మరింత పెరిగింది. నిఫ్టీ 10,500 పాయింట్ల కీలక మద్దతు స్థాయిని కోల్పోవడం సూచీలకు ప్రతికూలంగా మారింది. మార్కెట్ పతనం కొనసాగుతున్న కారణంగా అధిక మార్జిన్ మనీ కట్టలేని ట్రేడర్ల పొజిషన్లను స్క్వేర్ ఆఫ్ చేయడం కూడా భారీ పతనానికి దారితీసింది.

మూడు రోజుల్లో రూ.10 లక్షల కోట్లు మాయం



బడ్జెట్ ప్రకటించిన తర్వాత వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్లలో రూ.10లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. ఒక్క మంగళవారం రోజే రూ.4.8లక్షల కోట్ల సంపద కరిగిపోయింది. బిఎస్‌ఇలో నమోదైన కంపెనీల విలువ మొత్తంగా రూ.143 లక్షలకు పడిపోయింది. ఇంతకుముందు ఫిబ్రవరి 1న రూ.153 లక్షలతో పోలిస్తే దాదాపు రూ.10 లక్షల కోట్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది. దిగ్గజ కంపెనీల మార్కెట్ విలువ కూడా భారీగా పతనమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.4.18 లక్షల కోట్లకు పడిపోగా.. ఆ తర్వాత హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రూ.3.80 లక్షల కోట్లు, హెచ్‌డిఎఫ్‌సి రూ. 3.22 లక్షల కోట్లకు చేరాయి. అంటే ఈ మూడు కంపెనీలే రూ.1.12 లక్షల కోట్ల(10 శాతం) సంపదను కోల్పోయాయి. ఇక టిసిఎస్, కోటక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, ఐసిఐసిఐ బ్యాంక్, లార్సన్ అండ్ టుబ్రో, ఎస్‌బిఐలు మరో రూ.2 లక్షల కోట్ల విలువను కోల్పోయాయి. వక్రంగి లిమిటెడ్ కంపెనీ తన మార్కెట్ విలువలో సగానికి పైగా కోల్పోయింది. రిలయన్స్ నేవల్ అండ్ ఇంజినీరింగ్ 26శాతం మార్కెట్ విలువను కోల్పోయింది.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34195.94	561.22	(1.61%)
నిఫ్టీ	10498.25	168.30	(1.58%)

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	29110	31133.69	0.52%
ముంబై	29790	31860.96	–0.5%
ఢిల్లీ	29200	31229.95	–0.51%
కోల్‌కతా	29770.99	31840.63	–0.43%
కేరళ	28400	30374.33	1.07%
బెంగళూరు	28350	30320.86	–0.53%
హైదరాబాద్	29250	31283.42	1.21%
గల్ఫ్	1459.3	1560.75	3.34%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42600.00	42400.00	0.47
ముంబై	42600.00	42400.00	0.47
ఢిల్లీ	42600.00	42400.00	0.47
కోల్‌కతా	42600.00	42400.00	0.47
హైదరాబాద్	42600.00	42400.00	0.47



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	360	విశాఖపట్నం	355
వరంగల్	362	చిత్తూరు	378
విజయవాడ	354	చెన్నై	385
గోదావరి	354	బెంగళూరు	370

ఒక్క రోజులో బఫెట్ సంపద
రూ.33వేల కోట్లు ఆవిరి



- **అమెరికా మార్కెట్ల పతనం ప్రభావం**
- **500 మంది సంపన్నుల సంపద 114 బిలియన్ డాలర్లు హుష్‌కాకి**

న్యూయార్క్:అమెరికా మార్కెట్ల పతనంతో ప్రపంచంలోనే మూడో అత్యధిక సంపన్నుడైన వారెన్ బఫెట్ సంపద ఒక్కరోజులోనే 5.1 బిలియన్ డాలర్లు (రూ.32,744 కోట్లు) ఆవిరైంది. అలాగే 500 మంది ప్రపంచ కుబేరుల సంపద దాదాపు 114 బిలియన్ డాలర్లు తుడిచిపెట్టుకుపోయింది. డోజోన్స్, నాస్‌డాక్ సూచీల భారీ పతనంతో వీరి సంపద ఒక్క రోజులోనే భారీగా ఆవిరైపోయింది. అమెరికాలో అధికంగా బాండ్ల రాబడి, అంతర్జాతీయంగా బలహీన ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణంపై ఆందోళన వంటి పరిణామాలు ఈ నష్టాలకు కారణమయ్యాయి. ప్రపంచంలోనే మూడో అత్యధిక సంపన్నుడైన వారెన్ బఫెట్ సంపద ఒక్కరోజులోనే రూ.9.25 లక్షల కోట్లు (5.1 బిలియన్ డాలర్లు) ఆవిరైంది. బఫెట్‌కు చెందిన బర్క్‌షైర్ హాథ్‌వే సంస్థ మార్కెట్లో భారీగా నష్టాన్ని మూటగట్టుకుంది. వెల్స్‌ఫర్గో సంస్థలో బర్క్‌షైర్ అతిపెద్ద వాటాదారుగా ఉంది. ఎస్ అండ్ పి 500 సూచీలో వెల్స్‌ఫర్గో షేరు 9.2 శాతం పడిపోవడంతో బఫెట్ సంస్థలు భారీగా నష్టపోయాయి. ఒక్కరోజులోనే 1 బిలియన్ డాలర్లకు పైగా నష్టపోయిన 18 సంపన్నుల్లో బఫెట్ ఉన్నారని బ్లూమ్‌బర్గ్ నివేదిక తెలిపింది. మరోవైపు సోషల్ మీడియా దిగ్గజ ఫేస్‌బుక్ సిఇఒ మార్క్ జుకర్ బర్గ్ సంపద కూడా పెద్ద మొత్తంలో తుడిచిపెట్టుకుపోయింది. ఆయనకు చెందిన ఫేస్‌బుక్ విలువ 3.5 బిలియన్ డాలర్లు, అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ సంపద 3.3 బిలియన్ డాలర్లు, ఆల్ఫాబెట్ (గూగుల్) వ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్గీ బ్రిన్‌ల సంపద 2.3 బిలియన్ డాలర్లు చొప్పున కోల్పోయారు. 500 మంది సంపన్నులకు చెందిన 68.5 బిలియన్ డాలర్ల సంపద కరిగిపోయింది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో భారత్‌లోనూ స్టాక్ మార్కెట్లు అతలాకుతలమవ్వగా, రెండు రోజుల్లోనే రూ.5 లక్షల కోట్ల సంపదను మదుపర్లు నష్టపోయారు.

ఆరేళ్లలో ఇదే అతిపెద్ద పతనం



వడ్డీరేట్లను అమెరికా ఫెడరల్ రిజర్వ్ పెంచనుందనే వార్తలతో అమ్మకాల ఒత్తిడికి లోనైన అమెరికా మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజ్ డోజోన్స్ 1175 పాయింట్ల(4.60శాతం) నష్టపోయి 24345.75 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక యుఎస్‌కు చెందిన రెండో అతిపెద్ద ఎక్స్ఛేంజ్ నాస్‌డాక్ 273 పాయింట్ల (3.78శాతం) నష్టంతో 6967.53 వద్ద స్థిరపడింది. ఎస్ అండ్ పి 113 పాయింట్ల (4.10శాతం) నష్టంతో 2648.94 వద్ద ముగిసింది. ఆగస్ట్ 2011 తర్వాత ఇదే అతిపెద్ద పతనంగా విశ్లేషకులు చెబుతున్నారు. 2018లో తొలిసారిగా 25వేల దిగువకు డోజోన్స్ పడిపోగా, ఆ తర్వాత ఇంతలా పతనం కావడం ఇదే. డోజోన్స్ ఇంట్రాడేలో 1500 పాయింట్లకు పైగా నష్టపోయింది. గత నెల రోజుల్లో 7 శాతం పైగా నష్టపోయిన ఎస్ అండ్ పి.. గత ఆరేళ్ళలో అమెరికా మార్కెట్లు ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే తొలిసారి.

లక్ష మంది క్రిప్టోకరెన్సీ ఇన్వెస్టర్లకు
ఐటి నోటీసులు



న్యూఢిల్లీ:క్రిప్టోకరెన్సీ ఇన్వెస్టర్లపై ఆదాయం పన్ను శాఖ కొరఢా ఝులిపిస్తోంది. బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీలలో పెట్టుబడులు పెట్టిన లక్ష మంది ఇన్వెస్టర్లకు ఐటి నోటీసులు జారీ చేసింది. బిట్‌కాయిన్ ఇన్వెస్టర్లు ఆదాయ పన్ను రిటర్న్‌లను దాఖలు చేయలేదని, వీరికి నోటీసులు పంపామని సిబిడిటి చైర్మన్ సుశీల్ చంద్ర తెలిపారు.

బిట్‌కాయిన్ 20 శాతం పతనం: కొద్ది రోజుల క్రితం ఆకాశాన్నంటిన క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ విలువ రోజు రోజుకీ మరింతగా పతనమవుతోంది. సోమవారం ఏకంగా 20 శాతం మేర పడిపోయింది. మూడు నెలల కాలంలో తొలిసారి 6,200 డాలర్ల మార్కు కిందకి వచ్చి చేరింది. ప్రపంచంలో ప్రధాన మార్కెట్లలో క్రిప్టోకరెన్సీకి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. దీంతో బిట్‌కాయిన్ విలువ భారీగా కుదేలవుతోంది. నవంబర్ మధ్య నుంచి తొలిసారి ఈ వర్చ్యువల్ కరెన్సీ 6,190 డాలర్లకు పడిపోయిందని బ్లూమ్‌బర్గ్ నివేదిక పేర్కొంది. క్రిప్టోకరెన్సీ మార్కెట్‌కు పలు దేశాల నుంచి కఠినతరమైన పరిస్థితులు ఎదురవుతుండడం.. చైనా, రష్యా, దక్షిణ కొరియా లాంటి అతిపెద్ద మార్కెట్ల ప్రభుత్వాలు దీనిపై నిషేధం విధిస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో క్రిప్టోకరెన్సీపై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు. పేమెంట్ సిస్టమ్‌లో క్రిప్టోకరెన్సీలను వాడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. హ్యాకర్లు 530 మిలియన్ డాలర్లు వర్చ్యువల్ కరెన్సీని దొంగలించడంతో, ఆ కరెన్సీ ఎక్స్ఛేంజ్‌పై జపాన్ అథారిటీలు రైడ్ కూడా చేశారు. పలు కమర్షియల్ లెండర్లు క్రెటిట్ కార్డుల ద్వారా బిట్‌కాయిన్లను కొనుగోలు చేయడాన్ని కస్టమర్లకు నిరాకరించాయి. యూరప్, జపాన్, అమెరికా సెంట్రల్ బ్యాంకులు కూడా బిట్‌కాయిన్లపై ఆందోళన వ్యక్తంచేయడంతో బిట్‌కాయిన్ విలువ భారీగా క్షీణించింది.

మార్చి 15న బ్యాంకుల సమ్మె



న్యూఢిల్లీ : వేతన సవరణను డిమాండ్ చేస్తూ మరోసారి బ్యాంకులు సమ్మెకు సిద్ధమయ్యాయి. యూనైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ల (యుఎఫ్‌బియు) ఆధ్వర్యంలో బ్యాంకర్లు మార్చి 15న సమ్మె చేపట్టాలని నిర్ణయించాయి. ఈమేరకు ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సి.హెచ్.వెంకటాచలం తెలిపారు. భారత బ్యాంకింగ్ రంగంలోని తొమ్మిది యూనియన్లు వచ్చే నెల 15న సమ్మె చేసేందుకు నిర్ణయించాయని చెప్పారు. నవంబర్ 2017 నాటి వేతన సవరణ పెండింగ్‌లో ఉందని, దీనిపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపట్టనున్నామని చెప్పారు. యూనియన్ ఆధ్వర్యంలో ఇతర నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్టు వెల్లడించారు. మంగళవారం ముంబైలో జరిగిన యుఎఫ్‌బియు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
బజాజ్‌ఫైనాన్స్	1,681.80	1,514.40	1,660.60	1,604.25	56.35	3.51
శ్రీ సిమెంట్	17,000.00	15,600.00	16,904.95	16,629.55	275.40	1.66
ఎం&ఎం ఫైనాన్షియల్	458.10	400.00	444.45	438.60	5.85	1.33
శ్రీరాంట్రాన్స్‌ఫోర్టు	1,378.85	1,280.00	1,365.65	1,348.90	16.75	1.24
మెరి	300.00	284.05	298.55	295.00	3.55	1.20
హావెల్స్ ఇండియా	509.90	454.00	505.35	501.10	4.25	0.85
అపోలో ఆస్పిటల్	1,158.00	1,085.05	1,140.10	1,131.80	8.30	0.73
కమ్మిన్స్	820.00	767.05	812.65	807.90	4.75	0.59
కెనరా బ్యాంక్	322.00	296.40	318.10	317.35	0.75	0.24
ఇండియాబుల్స్‌హెచ్‌ఎస్‌జి	1,314.50	1,210.00	1,296.25	1,294.60	1.65	0.13

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
టాటామోటర్స్	379.60	357.00	374.45	396.05	21.60	5.45
టాటామోటర్స్(డి)	211.60	196.95	208.50	218.80	10.30	4.71
టిసిఎస్	3,077.85	2,985.80	2,995.35	3,106.50	111.15	3.58
కొటాక్ మహీంద్రా	1,049.10	1,019.35	1,033.55	1,062.25	28.70	2.70
బిహెచ్‌ఇఎల్	93.30	88.80	92.15	94.70	2.55	2.69
ఇన్ఫోసిస్	1,127.90	1,098.70	1,108.45	1,138.30	29.85	2.62
హీరో మోటోకార్ప్	3,598.00	3,475.00	3,542.65	3,634.05	91.40	2.52
ఇందూస్ హింద్ బ్యాంక్	1,697.00	1,641.20	1,674.60	1,714.25	39.65	2.31
హెచ్‌యుఎల్	1,347.00	1,305.00	1,328.25	1,358.35	30.10	2.22
ఎస్‌బిఐ	297.05	283.10	291.50	297.70	6.20	2.08

షరతులకు అంగీకరిస్తే అన్నాడిఎంకెలో విలీనం: దినకరన్

చెన్నై: అధికార అన్నాడిఎంకెలో విలీన మయ్యేందుకు సిద్ధమని బహిష్కృత నేత టిటివి దినకరన్ ప్రకటించారు. తన డి మాండ్లను నెరవేరిస్తే అన్నాడిఎంకె ప్ర భుత్వంలో చేరతానని తెలిపారు. తనకు ముఖ్యమంత్రి కావాలన్న ఆశలేదని స్పష్టం చేశారు. పళనిస్వామి మంత్రి వర్గం లో తాను సూచించిన ఆరుగురిని తొలగించాలన్నారు. అనర్హత వేటు వేసిన 18మంది ఎంఎల్‌ఎల్లో ఒకరిని ముఖ్యమంత్రి చేస్తే అన్నాడిఎంకెలో విలీనం అయ్యేందుకు సిద్ధమని ప్రకటించారు. దినకరన్ డిమాండ్లపై పళని స్వామి సర్కారు స్పందించాల్సివుంది. ఆర్కే నగర్ ఉప ఎన్నికలో ఘన విజయం సాధించిన తర్వాత దినకరన్ దూకుడు పెంచారు. పళని స్వామి ప్రభుత్వాన్ని పడగొడతానని శపథం చేశారు. పళనిస్వామిని ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగిస్తే అన్నాడిఎంకెలో విలీనమవుతామని ముందునుంచి ఆయన చెబుతున్నారు. తన వెంటవున్న 18 మంది ఎంఎల్‌ఎలపై పళని సర్కారు అనర్హత వేటు వేయడంతో ఆయన న్యాయ పోరాటం చేస్తున్నారు. అన్నాడిఎంకె నుంచి బహిష్కరించడంతో ఆర్‌కె నగర్ ఉప ఎన్నికలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి దినకరన్ విజయం సాధించిన సంగతి తెలిసిందే.



సివిసి పోస్టుకు 300 పదాల వ్యాసంతో దరఖాస్తు

న్యూఢిల్లీ: సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇక నుంచి తమ అభ్యర్థిత్వానికి మద్దతుగా 300 పదాలతో వ్యాసాన్ని రాయాల్సి ఉంటుంది. ఈ మేరకు డిపార్టుమెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఓపిటి) అసాధారణ ప్రతిభ, మంచి సమగ్రత కలిగిన వారి నుంచి ఈ పోస్టు భర్తీ కోసం దరఖాస్తులను కోరుతోంది. 'మీ సామీప్యతను తెలియజేయండి: ఈ పోస్టు గురించి అంచనా (300 పదాలకు మించకుండా)' అని దరఖాస్తులో పేర్కొంది. దరఖాస్తు దారులు 2018 జనవరి 1 నాటికి 62 ఏళ్లు మించకుండా, విజిలెన్స్ కమిషనర్‌గా కనీసం మూడేళ్లకు తక్కువ కాని సర్వీసు ఉండాలని అందులో పేర్కొంది. ఈ కమిషన్‌లో ఒక సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్, ఇద్దరు విజిలెన్స్ కమిషనర్లకు ఎక్కువ కాకుండా పోస్టులు ఉంటాయి. ఈ నెల చివరి నాటికి రాజీవ్ పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆయన స్థానంలో కొత్త కమిషనర్‌ను భర్తీ చేయనున్నట్టు డిఓపిటి తెలిపింది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ చీఫ్‌గా పని చేసిన రాజీవ్ 2014 ఫిబ్రవరి 27న విజిలెన్స్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

10న యుఎఇకి ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: వచ్చే వారం యుఎఇలో పర్యటించనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆ దేశంతో కనీసం 12 ఒప్పందాలను ఖరారు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ విషయాన్ని ఓ ఉన్నతాధికారి మీడియాకు తెలిపారు. చమురు నిల్వలు అధికంగా కలిగిన యుఎఇతో ఆర్థిక సహకారాన్ని మరింత వృద్ధి చేసుకునేందుకు మోడీ ఈ పర్యటనకు శ్రీకారం చుట్టనున్నట్టు తెలుస్తోంది. ఈ పర్యటనలో మోడీ మూడు పశ్చిమ ఆసి యా దేశాలైన పాలస్తీనా, యుఎఇ, ఒమన్‌లను సందర్శించనున్నారు. రక్షణ, భద్రత, ఖండాంతర ఉగ్రవాదం తదితర అంశాలపై మోడీ ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించే అవకాశముంది. 'ప్రధాని మోడీ ఈనెల 10న యుఎఇలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఈ రెండు దేశాల మధ్య 12 ఒప్పందాలు ఖరారయ్యే అవకాశముంది' అని భారత్‌లో యుఎ ఇ రాయబారి అహ్మద్ అల్ బన్నా తెలిపారు. 'ఈనెల 10–11 తేదీల్లో దుబాయ్‌లో జరిగే '6వ ప్రభుత్వ సదస్సు'లో మోడీ పాల్గొంటారు. ఇందులో భారత్ భాగస్వామ్య దేశంగా ఉంది. ప్రపంచం నలుమూలల నుంచి 2వేల మందికి పైగా ప్రతినిధులు, ప్రధాన మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యే ఈ సదస్సులో మోడీ ప్రసంగిస్తారు' అని బన్నా తెలిపారు.

ఒకే సిరంజీ వాడిన వైద్యుడు: 21మందికి హెచ్‌ఐవి




లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావోలో 21 మందికి హెచ్‌ఐవి పాజిటివ్ ఉన్నట్లు తేలింది, నాటు వైద్యుడు వారందరికీ ఒకే సిరంజీని వినియోగించారని సోమవారం అధికారులు ఆరోపించారు. ఈ ప్రాంతంలో ఎక్కువ కేసులు నమోదు కావడంతో ఆరోగ్యశాఖ జరిపిన దర్యాప్తులో హెచ్‌ఐవి వైరస్‌ను కనుగొన్నట్లు ఉన్నావో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. ఎస్‌పి చౌదరి తెలిపారు. బంగారుమావో పరిధిలో ఎక్కువ కేసులు నమోదు కావడంతో ఆరోగ్యశాఖ ఇరు వురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. 566 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వ హించగా 21 మందిలో హెచ్‌ఐవి ఉన్నట్లు వెల్లడైందని సిఎంఒ తెలిపింది. రాజేంద్ర కుమార్ అనే నాటు వైద్యుడు చౌక వైద్యం పేరుతో అందరికీ ఒకే సిరంజీని వాడినట్లు తేలిందన్నారు. హెచ్‌ఐవిని నిర్మూలించేందుకు యాంటి వైరల్ థెరఫీ(ఎఆర్‌టి), యాంటీ రెట్రో వైరల్‌కు సిఫారసు చేసినట్లు చౌదరి తెలిపారు. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసుపై దర్యాపు జరుగుతోందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సిద్ధార్థ్‌నాథ్ సింగ్ తెలిపారు.

ఆసుపత్రిలో ఉగ్రవాదుల కాల్పులు

- ఇద్దరు మృతి, పారిపోయిన ఉగ్రవాది

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. శ్రీనగర్‌లో కట్టుదిట్టమైన భద్రత గల ప్రాంతంలో ఉన్న శ్రీ మహారాజా హరిసింగ్ (ఎస్‌ఎంహెచ్‌ఎస్) ఆసుపత్రి ఆవరణలోని పోలీసు బృందంపై మంగళవారం ఉదయం లష్కరే తొయిబా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఇద్దరి పోలీసులను పొట్టనపెట్టుకున్నారు. కరుడుగట్టి పాకిస్థాన్ టెర్రరిస్టులను విడుదల చేసుకొని వెళ్లారు. జమ్మూకశ్మీర్ వేసవికాల రాజధాని అయిన శ్రీనగర్‌లో ప్రధాన ఆసుపత్రిలోకి ప్రవేశించిన ఉగ్రవాదులు పోలీసులపై కాల్పులు జరిపి అనంతరం పారిపోయినట్లు ఓ పోలీసు అధికారి చెప్పారు. వారితో పాటు 2014లో దక్షిణ కశ్మీర్‌లోని కుల్గామ్‌లో పట్టుబడిన 22 ఏళ్ల లష్కరే తొయిబా పాక్ ఉగ్రవాది మహ్మద్ నవీద్ జుట్ట కూడా పారిపోయినట్లు ఆయన చెప్పారు. ఉగ్రవాది నవీద్ అలియాస్ అబు హంజాలాతో పోలీస్ బృందం కలిసి ఉండగా, అదే సమయంలోనే ఎస్‌ఎంహెచ్‌ఎస్ ఆసుపత్రి ఆవరణలోకి టెర్రరిస్టులు చొరబడి దాడికి పాల్పడ్డారన్నారు. కాల్పుల్లో హెడ్‌కానిస్టేబుల్ ముస్తాక్ అహ్మద్ మృతి చెందగా, అతడి సహచరుడైన మరో కానిస్టేబుల్ బాబర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని ఆసుపత్రిలో చేర్చగా, చికిత్స పొందుతూ కొన్ని గంటల అనంతరం మృతి చెందాడు. ఉగ్రవాదులు కాల్పులు జరిపి కరుడుగట్టి టెర్రరిస్టును విడుదల చేసుకొని పారిపోయిన ఘటన జరగడం చాలా దురదృష్టకరమని డిజిపి ఎస్‌పి వాయిడ్ అన్నారు. ఉగ్రవాదులను పట్టుకునేందుకు రెడ్ అలెర్ట్‌ను ప్రకటించామన్నారు. ఘటనా స్థలిని పరిశీలించిన డిప్యూటీ ఐజి గులామ్ హసన్ భట్ మాట్లాడుతూ చికిత్స నిమిత్తం ఉగ్రవాది నవీద్‌తో సహా ఆరుగురు ఖైదీలను ఆసుపత్రికి తీసుకువచ్చారన్నారు. ఖైదీలను ఆసుపత్రికి తీసుకువస్తున్న పోలీసు బృందం వాహనంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపిన వెంటనే వాహనాన్ని బయటి రోగుల విభాగం బయటే ఆపినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు పేర్కొన్నారు. అప్పటికే పార్కింగ్‌లాడ్‌లో కాచుకు కూర్చుకున్న మరికొంత మంది టెర్రరిస్టులు పోలీసు బృందంపై బుల్లెట్ల వర్షం కురిపించి అనంతరం అక్కడి నుండి పోరిపోయారన్నారు.



మా ముఖంపై చెత్త పోయెద్దు



- 845 పేజీలతో అఫిడవిటా?
- ఘన వ్యర్థాల నిర్వహణపై ఆగ్రహం

న్యూఢిల్లీ: ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన అసంపూర్తి సమాచారాన్ని ఇచ్చి నందుకు కేంద్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు అంటే చెత్త ఏరుకునే వ్యవస్థ కాదని వ్యాఖ్యానించింది. 845 పేజీల అఫిడవిట్‌ను స్వీకరించేందుకు తిరస్కరిస్తూ, తమ ముఖంపై చెత్త పోయెద్దని స్పష్టంగా తెలియజేసింది. 'మీరు ఏం చేయాలని ప్రయత్నిస్తున్నారు? మమ్మల్ని ఇంప్రెస్ చేయాలని ప్రయత్నిస్తున్నారా? మేం ఇంప్రెస్ కాబోం, ఏదిపడితే అది మాపై గుమ్మరించాలని యత్నిస్తున్నారు. మేం వాటిని స్వీకరించేది లేదు' అని పేర్కొంది. 'మీరు చేయాల్సింది ఇది కాదు, మీ దగ్గర ఉన్న చెత్తనంతా మాపై పోయాలనుకుంటున్నా రు. మేం చెత్తను స్వీకరించే వాళ్లం కాదు. ఈ విషయంలో మీరు స్పష్టంగా వ్యవహరించండి' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు, 2016 ప్రకారం రాష్ట్ర స్థాయి సలహా మండళ్లను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఏర్పాటు చేశాయో, లేదో స్పష్టంగా వివరిస్తూ ఛార్ట్‌ను సమర్పించాలని జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. దీనికోసం 3 వారాల గడువు ఇచ్చింది. ఈ ఛార్ట్‌లో పేర్కొనాల్సిన అంశాలను వివరించింది. రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం ఏర్పాటు చేసిన సలహా మండలిలో సభ్యుల పేర్లు, ఏర్పాటైన తేదీ, సమావేశాల వివరాలను తెలియజేయాలని కోరింది. కేంద్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన న్యాయవాది వాసిం ఎ ఖాద్రి ధర్మాసనం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయారు. రాష్ట్ర స్థాయి సలహా మండళ్ళ ఏర్పాటు గురించి 22 రాష్ట్రాల నుంచి తమకు సమాచారం వచ్చిందని మాత్రమే చెప్పగలిగారు. దీనిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. వివరాలు లేకుండా అఫిడవిట్లను దాఖలు చేయడం వల్ల ఉపయోగం లేదని పేర్కొంది. దీనిని తాము స్వీకరించడం లేదని, దీనిని మీరే చూడకుండా, మమ్మల్ని పరిశీలించమంటున్నారని నిలదీసింది. డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి వ్యాధుల వల్ల చాలామంది మరణిస్తుండటంపై సుప్రీం అంతకుముందు ఆందోళన వ్యక్తం చేసింది. 2015లో ఏడేళ్ల బాలుడు డెంగ్యూతో మరణించినట్లు వచ్చిన వార్తలపై స్వీయ విచారణ జరుపుతోంది. ఈ బాలుడికి ఐదు ప్రైవేటు ఆసుపత్రుల వారు చికిత్సను నిరాకరించినట్లు, అనంతరం అతని తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుసుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది.

ఆధార్ అప్‌డేట్స్‌పై జిఎస్‌టి

- సన్నాహాలు చేస్తున్న యుఐడిఎఐ



న్యూఢిల్లీ: ఆధార్ సంఖ్యలను జారీ చేసే భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ) ఆధార్ వివరాలను నవీకరణ (అప్‌డేషన్) చేసుకోవాలంటే 18 శాతం వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) విధించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మీడియా కథనాలు చెప్తున్నాయి. ఆధార్ కార్డుదారు తన పేరు, చిరునామా, పుట్టిన తేదీ, మొబైల్ నంబరు, స్త్రీ/పురుషుడు, ఈ మెయిల్ వంటి వాటిలో ఏమైనా మార్పులు చేసుకోవాలంటే యుఐడిఎఐ ప్రస్తుతం రూ.25 వసూలు చేస్తోంది. బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం కూడా రూ.25 వసూలు చేస్తోంది. ఇప్పుడు అప్‌డేషన్ చేయించుకోవాలనుకునే వారి నుంచి దీనిపై జిఎస్‌టి 18శాతం వసూలు చేసే అవకాశం కనిపిస్తోంది. అంటే రూ.25తో పాటు అదనంగా రూ.4.50 చెల్లించవలసి ఉంటుందన్న మాట. అయితే కొత్తగా ఆధార్ నమోదు చేయించుకోవాలన్నా, పిల్లల పేర్లను చేర్చుకోవాలన్నా ఉచితంగానే ఈ సేవలను అందిస్తోంది. ఏదైనా ఆధార్ నమోదు కేంద్రంలో నిర్ణీత మొత్తాన్ని మించి సొమ్మును వసూలు చేస్తున్నట్లయితే టోల్ ఫ్రీ నెంబరు 1947కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. లేదా హెల్ప్@యుఐడిఎఐ.జిఓవి.ఇన్‌కు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అప్‌డేట్ చేయించుకోవాలంటే సమీపంలోని బ్యాంకు శాఖ లేదా తపాలా కార్యాలయంలో ఉన్న ఆధార్ కేంద్రానికి వెళ్లాలని యుఐడిఎఐ సూచించింది. ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలనుకుంటే ఈ కింద పేర్కొనబడిన పత్రాలను సమర్పించాల్సివుంటుందని యుఐడిఎఐ ట్విటర్‌లో పేర్కొంది. మొబైల్ నెంబర్, ఈ మెయిల్ లేదా బయోమెట్రిక్ అప్‌డేట్స్‌కి ఇవి సమర్పించాల్సిన అవసరం లేదంది.

అవసరమైన గుర్తింపు కార్డులు ఇవే: పాస్‌పోర్టు, పాన్‌కార్డు, రేషన్/పిడిఎస్ ఫోటో కార్డు, ఓటరు ఐడి, డ్రైవింగ్ లైసెన్స్, ప్రభుత్వం గుర్తింపు కార్డు/సర్వీసు ఫోటో గుర్తింపు కార్డు/పిఎస్‌యు జారీ చేసిన కార్డు, ఎన్‌ఆర్‌ఇజిఎస్ జాబ్ కార్డు, గుర్తింపు పొం దిన విద్యా సంస్థ నుంచి ఫోటో గుర్తింపు కార్డు, ఆయుధాల లైసెన్స్, ఫోటో బ్యాంకు ఎటిఎం కార్డు, ఫోటో క్రెడిట్ కార్డు, పెన్షనర్ ఫోటో కార్డు, స్వాతంత్ర్య సమరయోధుల గుర్తింపు కార్డు, కిసాన్ ఫోటో పాస్‌బుక్, సిజిహెచ్‌ఎస్/ఇసిహెచ్‌ఎస్ ఫోటో కార్డు, పోస్ట్స్ శాఖ జారీ చేసిన చిరునామా, ఫోటో, గెజిటెట్ అధికారి లేదా తహసీల్దార్‌లు లెటర్ హెడ్ ద్వారా జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డు, వికలాంగుల పత్రం.

ఐఇడి పేలుడులో ముగ్గురు జవాన్లకు గాయాలు

- ఎదురు కాల్పుల్లో క్షతగాత్రుడైన బిఎస్‌ఎఫ్ కానిస్టేబుల్



రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ దుశ్చర్యకు పాల్పడ్డారు. రెండు వేర్వేరుగా జరిగిన నక్సల్స్ సంబంధిత ఘటనల్లో నలుగురు భద్రతా సిబ్బంది గాయ పడినట్లు పోలీసు అధికారులు చెప్పారు. కాంకర్ జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ బిఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ గాయపడగా, బిజాపూర్ జిల్లాలో మావో యిస్టులు అమర్చిన అత్యంత శక్తివంతమైన బాంబు పేలి (ఐఇడి) ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్ (సిఎఎఫ్) జవాన్లు ముగ్గురు క్షతగాత్రులైనట్లు వారు చెప్పారు. కాంకర్ జిల్లాలో మంగళవారం ఉదయం బిఎస్‌ఎఫ్‌కు చెందిన 35వ బెటాలి యన్, జిల్లా పోలీస్ దళం నక్సల్స్ ఏరివేతే లక్ష్యంగా అడవుల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయని ఎస్‌పి కెఎల్ ధ్రువ మీడియాకు వెల్లడించారు. భద్రతా సిబ్బంది గోమె, ఘట్టకల్ గ్రామాల మధ్య ఉన్న అడవుల గుండా వెళ్తుండగా నక్సల్స్ బృందం వారిపై కాల్పులు జరిపారని, అప్రమత్తమైన జవాన్లు వారిపై ఎదురు కాల్పులు జరిపినట్లు ఆయన చెప్పారు. అనంతరం మావోయిస్టులు అక్కడి నుంచి పారిపోయారన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో కానిస్టేబుల్ వీరప్పకు గాయాలయ్యాయని తెలిపారు. వెంటనే అతన్ని హెలికాప్టర్ ద్వారా ఆసుపత్రికి తరలించారన్నారు. అదే విధంగా బిజాపూర్ జిల్లాలో సిఎఎఫ్ సిబ్బంది కూంబింగ్ నిర్వహించి తిరిగి వస్తుండగా రాణిబొడ్లి గ్రామ సమీప అడవుల్లో నక్సల్స్ అమర్చిన ఐఇడి పెలగా ముగ్గరికి గాయాలయ్యాయి. వారిని బిజాపూర్‌లోని ఆసుపత్రికి తరలించారు.

టీ, స్నాక్స్‌కు రూ.68లక్షలు!

- ఉత్తరాఖండ్ సిఎం ఖర్చు



డెహ్రాడూన్: పదవిలోకి వచ్చి ఏడాది కూడా దాటకుండానే ఉత్తరాఖండ్ సిఎం టిఎస్ రావత్‌కు ఛాయ్, స్నాక్స్ ఖర్చు అరకోటి దాటిపోయిందట. చిరుతిళ్ల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టారని తేలింది. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రిగా త్రివేంద్ర సింగ్ రావత్ పదవిలోకి వచ్చిన తర్వాత రూ.68,59,865 ఖర్చు చేశారని ఆర్‌టిఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఆయన దగ్గరకు వచ్చిన అతిథులకు ఫలహారాలు, స్నాక్స్ కోసమే సిఎం ఇంత ఖర్చుచేయడం గమనార్హం. ముఖ్యమంత్రిగా పదవిలోకి వచ్చిన తర్వాత సిఎం రావత్ ఎంత ఖర్చుపెట్టారో చెప్పాలంటూ హేమంత్ సింగ్ అనే ఆర్‌టిఐ కార్యకర్త ఒకరు దరఖాస్తు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బిజెపి సీనియర్ నేత త్రివేంద్ర సింగ్ రావత్ గతేడాది మార్చి 18న సిఎంగా పదవి చేపట్టిన సంగతి తెలిసిందే.

రాజ్యసభ సమావేశాలను బహిష్కరించిన ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ: ప్రజా సమస్యలపై మాట్లాడనీయకుండా తమ గొంతు నొక్కేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలన్నీ రాజ్యసభ సమావేశాలను బహిష్కరించాయి. మంగళవారం మధ్యాహ్న భోజనం తర్వాత ప్రారంభమైన సమావేశాలను కాంగ్రెస్, టిఎంసి, ఎన్‌సిపి, డిఎంకె, సమాజ్‌వాది పార్టీ, సిపిఐ (ఎం), సిపిఐ, ఆప్ బహిష్కరించాయి. 3 గంటల తర్వాత ప్రారంభమైన సభ రెండుసార్లు వాయిదా పడగా, అనంతరం ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోయాయి. 'బయట ప్రతిపక్షాల గొంతును నొక్కేస్తున్నారు. సభలో కూడా ఇలా జరగడం మాకు ఇష్టం లేదు. మేం ఒక అంశంపై మాట్లాడాలని ఉదయం నుంచి ప్రయత్నిస్తున్నాం. కాని కుదరలేదు. దీంతో రోజు మొత్తం సభను మేం బహిష్కరించాం' అని రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ తెలిపారు. 'మేం ప్రశ్నోత్తరాల సమయాన్ని కాని, ప్రభుత్వ కార్యకలాపాలను కాని అడ్డుకోవడం లేదు, గత వారం రోజులుగా నిబంధనలు వినియోగించుకోవడానికి కూడా తమకు అవకాశం ఇవ్వడం లేదు' అని అన్నారు. సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడగా, అనంతరం సమావేశం ప్రారంభం కాగానే రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై మాట్లాడాలని టిఎంసి సభ్యులు ఆకాంక్షించారు. అయితే, ఆప్ సభ్యులు ఢిల్లీ సీలింగ్ సమస్యపై ఆందోళన చేయడంతో సభ తిరిగి వాయిదా పడింది.

రాఫెల్ వ్యవహారం కుంభకోణమే

- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్



న్యూఢిల్లీ: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారం ఓ కుంభకోణమని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ విమానాల ధరలను బహిరంగ పర్చకపోవడం పట్ల కూడా ప్రభుత్వాన్ని తప్పుపట్టారు. 'ఈ విమానాల కొనుగోలుకు సంబంధించిన వివరాలను వెల్లడించలేమని ఇలా రక్షణ మంత్రి చెప్పడం ఇదే మొదటిసాటి. గుజరాత్ ఎన్నికల సమయంలో ఇది కుంభకోణ (రాఫెల్ విమానాల కొనుగోలు)మని అప్పుడే చెప్పాను. ఈ వ్యవహారాన్ని మోడీ స్వయంగా చేశారు' అని ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. 'మోడీ వ్యక్తిగతంగా పారిస్ వెళ్లారు. వ్యక్తిగతంగా ఈ డీల్‌లో మార్పులు చేశారు. యావత్తు భారతదేశానికి ఇది తెలుసు. కాని, రక్షణ మంత్రి మాత్రం ఇది బయటకు చెప్పేది లేదని అంటున్నారు. దీని అర్థమేమిటి? ఇందులో కుంభకోణం జరిగింది' అని పేర్కొన్నారు. భారత్, ఫ్రాన్స్ మధ్య జరిగిన ఒప్పందాన్ని భద్రతా కారణాల వల్ల వెల్లడించలేమని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్న మర్నాడు మంగళవారం రాహుల్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

ప్యాకేజీ కోసం ఫార్ములా

- ఆంధ్రప్రదేశ్ ఎంపిల ఆందోళనతో కేంద్రం ప్రకటన
- రైల్వే జోన్‌పై రాష్ట్రాలతో సంప్రదింపులు



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ రాజ్యసభలో ఆ రాష్ట్రానికి చెందిన తెలుగుదేశం, వైఎస్‌ఆర్‌సిపి, కాంగ్రెస్ పార్టీ ఎంపిల ఆందోళనతో కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ స్పందించారు. ఏపీ విభజన హామీల అమలుకు తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటికే ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించామన్నారు. ప్రత్యేక హోదాతో రావాల్సిన నిధులను ప్రత్యేక ప్యాకేజీ రూపంలో ఎలా ఇవ్వాలన్న దానిపై చర్చిస్తున్నామని, అందుకు ఒక ఫార్ములా రూపొందిస్తామని తెలిపారు. విదేశీ ఆర్థిక సాయంతో చేపట్టే ప్రాజెక్ట్ నిధుల రూపం(ఇఎపి)లో ఆ లోటును భర్తీ చేస్తామని చెప్పారు. ఈ నిధులకు సంబంధించి జనవరి 3న సిఎం చంద్రబాబు తమకు లేఖ రాశారని చెప్పారు. నాబార్డు ద్వారా ఆ నిధులు కేటాయించాలని సిఎం ఆ లేఖలో కోరారని జైట్లీ చెప్పారు. ఇఎపిలకు నాబార్డు ద్వారా నిధులు ఇవ్వాలంటే సమస్య ఎదురవుతోందని జైట్లీ అన్నారు. అలా ఇస్తే రాష్ట్ర రుణ సామర్థ్యం తగ్గుతుందని చెప్పారు. ఇఎపి నిధులు ఎలా ఇవ్వాలనే విషయమై చర్చిస్తున్నామని, ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆ నిధుల మంజూరు చేసే అంశంపై చర్చిస్తున్నామని వివరించారు. ఈ విషయమై చర్చించేందుకు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ కార్యదర్శిని ఢిల్లీకి రావాలని పిలిచామని చెప్పారు. ఇప్పటికే ఎపి రెవెన్యూ లోటు భర్తీకి రూ.3,900 కోట్లు చెల్లించామన్నారు. మరోవైపు రైల్వే జోన్ అంశంపై వివిధ రాష్ట్రాలతో రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నామని రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. జోన్ విషయంలో సానుకూల పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని వివరించారు. రైల్వే జోన్ సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేయాలని మాత్రమే చట్టంలో ఉందని, కాంగ్రెస్ సరిగా చేసి ఉంటే ఈ సమస్యలు వచ్చేవి కావని గోయల్ వ్యాఖ్యానించారు.

మాకు కాదు.. మోడీకి చూపించండి : ఖర్గే

లోక్‌సభలో మంగళవారంనాడు ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. సభ జరుగుతున్న సమయంలో టిడిపి ఎంపిలు ప్లకార్డులు చేత పట్టుకుని కాంగ్రెస్ వల్లే రాష్ట్రానికి అన్యాయం జరిగిందని నినాదాలు చేశారు. ఇది కాంగ్రెస్ సభ్యుల ఆగ్రహానికి కారణమైంది. దీంతో ఇరు పార్టీల ఎంపిల మధ్య వాగ్వాదం జరిగింది. మల్లికార్జున ఖర్గే ప్రసంగం సమయంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో సభలో కాసేపు గందరగోళం నెలకొంది. టిడిపి సభ్యుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఖర్గే మాట్లాడుతూ కాంగ్రెస్‌ను అప్రతిష్ఠ పాలు చేసేందుకు బిజెపియే టిడిపి ఎంపిలతో ఆందోళన చేయిస్తోందని ఆరోపించారు. ఆ ప్లకార్డులు తమవైపు చూపించడం కాదని, ప్రధాని మోడీ ఎదుట ప్రదర్శించాలని హితవు చెప్పారు. ఈ వ్యాఖ్యలపై బిజెపి ఎంపిలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో కాంగ్రెస్, బిజెపి ఎంపిల మధ్య కూడా వాగ్వాదం చోటు చేసుకుంది.



తూచ్.. ఎక్సైజ్ సుంకం తగ్గించట్లేదు!

- పెట్రో, డీజిల్‌పై కేంద్రం వెనక్కి

న్యూఢిల్లీ: ఇటీవల బడ్జెట్‌లో పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. చమురు ధరలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం లేదని, ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల కారణంగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆర్థికశాఖ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ద్రవ్యలోటు అంచనా కంటే ఎక్కువగా ఉండే అవకాశాలున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఇలాంటి పరిస్థితుల్లో పెట్రోల్, డీజిల్ వంటి వాటిపై దిగుమతి సుంకాన్ని తగ్గిస్తే ఆ భారం మరింత పెరిగే అవకాశముందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఇప్పట్లో తగ్గింపు ఆలోచన ప్రభుత్వానికి లేనట్లు సంబంధిత వర్గాల సమాచారం.



మాల్దీవుల్లో అత్యయిక పరిస్థితిపై భారత్ ఆందోళన

న్యూఢిల్లీ: మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభంపై భారత్ తీవ్రంగా స్పందించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తులు, రాజకీయ వేత్తలను అరెస్ట్ చేయడంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. మాల్దీవులను సంద ర్శిస్తున్న భారత పౌరులకు అడ్వైజరీని జారీ చేసింది. అత్యవసరం కాని వాహనాల్లో భారతీయులెవ్వరూ ప్రయాణించొద్దని సోమవారం సూచించింది. సుప్రీంకోర్టు ఫుల్‌బెంచ్ తీర్పునకు ప్రభుత్వం కట్టుబడి ఉండక పోవడంతోపాటు మాల్దీవుల రాజ్యాంగ హక్కులను ప్రభుత్వం రద్దు చేయడం పట్ల కలవరపా టుకు గురవుతున్నట్లు భారత్ పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాజకీయ నాయకుల అరెస్ట్ కూడా తమ ఆందోళనకు కారణమని భారత విదేశాంగ శాఖ తెలిపింది. రాజకీయ సంక్షోభం పరిష్కారా నికి భారత్ సైనిక జోక్యం చేసుకోవాలని ప్రవాస మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ కోరారు. న్యాయ వ్యవస్థ, అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్‌ల మధ్య అగాధం పెరిగిపోయిందన్నారు. సోమవారం అధ్యక్షుడు అత్యవసర పరిస్థితి ప్రకటించిన కొన్ని గంటల్లోనే ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్లా సయీద్, మరో జడ్జి హమీద్‌ను అరెస్ట్ చేశారు. ప్రతిపక్షాలతో కలిసిన మాజీ అధ్యక్షుడు మామూన్ అబ్దుల్ గయూమ్‌ను ప్రభుత్వం గృహ నిర్బంధం చేసింది.

మాల్దీవుల్లో మహా సంక్షోభం

- ప్రధాన న్యాయమూర్తితో పాటు మరో జడ్జి అరెస్ట్
- నిర్బంధంలోకి మాజీ అధ్యక్షుడు గయూమ్
- వెంటనే జోక్యం చేసుకోండి : భారత్‌కు నషీద్ వినతి



మాలె: హిందూ మహాసముద్రంలోని ద్వీపసమూహమైన మాల్దీవుల రాజకీయ సంక్షోభం తీవ్రస్థాయికి చేరుకుంది. అత్యవసర పరిస్థితిని విధించిన తర్వాత ఏకంగా ఆ దేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మరో జడ్జీని, మాజీ అధ్యక్షుడిని సోమవారం ఉదయం అరెస్టు చేశారు. భద్ర తాబలగాలు పెద్ద ఎత్తున సుప్రీంకోర్టుకు చేరుకుని ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్లా సయీద్‌తోపాటు మరో న్యాయమూర్తిని అరెస్ట్ చేశాయి. అవినీతికి పాల్పడిన కేసులో ఇద్దరు న్యాయమూర్తులపై విచారణ జరుపుతు న్నామని, కోర్టుకు సంబంధించి ప్రధాన పరిపాలనాధికా రిని కూడా అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలి పారు. దీంతో మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం మరింత దిగజారింది. ఎన్నడూ వార్తల్లో అంతగా కనిపించని మాల్దీవులు ఇప్పుడు వార్తల్లో ప్రధానాంశంగా మారాయి. ఇప్పుడు అక్కడ ఏర్పడిన రాజకీయ చీలిక, సంక్షోభం చివరికి ఎలాంటి మలుపు తిరుగుతుందోనని అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

అసలేం జరుగుతోంది?

మాల్దీవులలో ప్రస్తుత అధ్యక్షుడుగా ఉన్న అబ్దుల్లా యామీన్ 2013లో అధికారంలోకి వచ్చారు. మాల్దీవు లకు అప్రతిష్ట తీసుకొస్తున్న అసమ్మతివాదులపై విరుచు కుపడమని భద్రతా బలగాలకు ఇటీవల ఉత్తర్వులిచ్చారు. ప్రతిపక్ష రాజకీయవేత్తలందరినీ కారాగారంలోకి తోశారు. మాల్దీవుల్లోని సుప్రీంకోర్టు తొమ్మిది మంది అస మ్మతివాదులను జైలు నుంచి విడుదల చేయాలని, యామీన్ పార్టీ నుంచి పార్టీ ఫిరాయించినందుకు వేటుప డిన 12 మంది ఎంపిల సభ్యత్వాలను పునరుద్ధరించాలని గురువారం సుప్రీంకోర్టు ఆదేశించినా అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్ లెక్కచేయలేదు. ఈ విషయంలో అంతర్జాతీయ ఒత్తిడులకు కూడా తలొగ్గలేదు. అంతేకాక తనను పదవీ చ్యుతుని చేయడానికి అవకాశమున్నందున పార్లమెం టును సైతం నిరవధికంగా వాయిదా వేశారు. దీనిపై విప క్షాలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నాయి.

యామీన్ ప్రభుత్వానికి పెను ఘాతంలా ప్రవాస జీవితం గడుపుతున్న మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ తిరిగి దేశంలోకి రావడానికి మార్గం సుగమం చేయాలని కూడా సుప్రీంకోర్టు గురువారం తన ఆదేశంలో పేర్కొంది. ప్రజా స్వామ్య పద్ధతిలో తొలిసారి అధ్యక్షుడిగా ఎన్నికైన నషీ ద్‌పై 2015లో వివాదాస్పద ఉగ్రవాద అభియోగాలు మోపారు. దాంతో ఆయన దేశం వదిలి ప్రవాస జీవితం గడుపుతున్నారు. నషీద్ దేశానికి తిరిగి వచ్చి ఈ ఏడాది జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పాల్గొనేందుకు వీలుకల్పించాలని కూడా కోర్టు పేర్కొంది. అయితే ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులను నిర్బంధించమని యామీన్ సోమ వారం ఏకంగా సైనికులనే సుప్రీంకోర్టుకు పంపించారు. న్యాయమూర్తుల అరెస్టు సందర్భంగా వేలాదిగా ప్రజలు కోర్టు భవనసముదాయం ముందు గుమికూడారు. అయితే వారిని చెదరగొట్టడానికి పోలీసులు పెప్పర్ స్ప్రేను ప్రయోగించారు. ఇదిలా ఉండగా యామీన్‌కు సవతి సోదరుడు, మాజీ అధ్యక్షుడు అయిన మౌమూన్ అబ్దుల్ గయూమ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసు కున్నారు. ఆయన ప్రధాన ప్రతిపక్షంవైపు మొగ్గు చూపి నందుకే ఆయనపై కూడా చర్య చేపట్టారని తెలుస్తోంది.

ఇక జరగనున్నదేమిటి?

అందరి దృష్టి ఇప్పుడు మాల్దీవుల భద్రతా బలగాలపైనే ఉన్నాయి. నిర్బంధంలోకి తీసుకున్న గయూమ్‌కు ఏమి కానుంది? అని అంతా ఆతృతతో చూస్తున్నారు. అత్య యిక స్థితి ఉన్నప్పటికీ వీధి నిరసనలు తథ్యమనిపిస్తు న్నాయి. బలమైన పొరుగుదేశమైన భారత్ వెంటనే జోక్యం చేసుకోవాలని మాజీ అధ్యక్షుడు నషీద్(50) కోరుతున్నారు. రాజకీయ సంక్షోభ నివారణకు భారత్ వేగంగా చర్యలు చేపట్టాలని వేడుకున్నారు. ఆయనకు చెందిన మాల్దీవుల డెమోక్రటిక్ పార్టీ ప్రస్తుతం కొలంబో నుంచి కార్యకలాపాలు కొనసాగిస్తోంది.రానున్న అధ్య క్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి తాను ఐక్యరాజ్యసమితి సాయాన్ని కోరతానని కూడా ఆయన అంటున్నారు. యామీన్‌పై ఒత్తిడి తీసుకురావాలని ప్రతిపక్ష ఎంపిలు సైతం అంతర్జాతీయ సమాజాన్ని అభ్యర్థిస్తున్నారు.

భద్రతా బలగాల వైఖరేమిటి?

'మాల్దీవులు రాజకీయ సంక్షోభంలో కూరుకుపోతుంటే సైన్యం ప్రేక్షక పాత్ర పోషిస్తూ నిష్క్రియగా ఉండబోదు' అని మిలిటరీ చీఫ్ అహ్మద్ షియామ్ ఆదివారమే అన్నారు. సుప్రీంకోర్టు చట్టవ్యతిరేక ఉత్తర్వులను కూడా మన్నించబోమని స్పష్టం చేశారు. అరెస్టుకు ముందు గయూమ్ తన ట్విట్టర్‌లో 'నా ఇంటి చుట్టూ పోలీసులు న్నారు. నన్ను రక్షించడానకో లేక అరెస్టు చేయడానికో? తెలియడంలేదు' అని పోస్ట్ చేశారు.

మాల్దీవుల్లో ప్రకటించిన అత్యయిక స్థితి భద్రతా బలగా లకు ఎవరినైనా నిర్బంధించే అంతులేని అధికారాలు కల్పించింది. యామీన్‌పై అవిశ్వాసం ప్రకటించి పదవీ చ్యుతిని చేయడానికి అవకాశంలేకుండా పార్లమెంటు, న్యాయవ్యవస్థ అధికారాలకు కళ్లెం వేసింది. ఇదంతా యామీన్ 'నిరాశ'ను వెల్లడిస్తోందని ప్రతిపక్షం అభిప్రా యపడింది. మాల్దీవుల్లో నెలకొన్న రాజకీయ అనిశ్చితి చివరికి సైనిక పాలనకు దారితీయగలదని మాజీ అధ్య క్షుడు నషీద్ ఇదివరకే భయాందోళనలు వ్యక్తం చేశారు.

సంక్షోభ స్థితికి ఎలా చేరుకుంది?

మహ్మద్ నషీద్ 2008లో ప్రజాస్వామ్యబద్ధంగా మాల్దీ వుల తొలి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన వాతా వరణ మార్పు సవాళ్లను వెంటనే పరిష్కరించి అంతర్జా తీయంగా గుర్తింపు తెచ్చుకున్నారు. మాల్దీవుల్లోని పల్లపు ప్రాంతాల్లోని సమస్యలను ఎత్తిచూపడానికి ఆయన క్యాబినెట్ సమావేశం కూడా నిర్వహించారు. అయితే 2013లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో నషీద్‌పై అబ్దుల్లా యామీన్ గెలిచారు. నాటి నుంచి అక్కడ చాప కింద నీరులా రాజకీయ సంక్షోభం తిష్ట వేసింది. 'తన అధికారంలో యామీన్ ఓ పద్ధతి ప్రకారం తన కూట మిలోని అసమ్మతివాదులను దూరం చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేతలను జైలుపాలు చేశారు. మానవ హక్కు లను కాలరాచారు' అని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది.

ప్రయోగ శాలలో చెవి పెంపకం

- చెన్నై శాస్త్రజ్ఞుల అద్భుతం



చెన్నై: చెన్నై డాక్టర్లు చెవిని ప్రయోగశాలలో కృత్రిమంగా పెంచ డంలో విజయం సాధించారు.ఐదుగురు కొత్తగా జన్మించిన శిశువు లకు లాబ్‌లో చెవులు సృష్టించామని చైనా ప్రకటించిన ఇంచు మించు వారం తర్వాత అటువంటిదే అద్భుతాన్ని చెన్నై డాక్టర్లు విజయవంతం చేశారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సైంటి స్టులు కల్చర్ ఫ్లాస్క్‌లో చెవి కార్టిలేజ్ కణాలను కృత్రిమంగా పెంచి కుందేళ్లకు అమర్చారు.తర్వాత త్రీడి ప్రింటింగ్ ప్ర క్రియలో వృద్ధి చేశారు. గతంలో ఇటువంటి అనేక ప్ర యోగాలు విఫలంకాగా ప్రస్తుతం విజయవంతం కావ డంతో ట్రాన్స్‌ప్లాంట్‌కు అనువుగా కృత్రిమ చెవి రూ పొందింది. దానిని చెన్నై వైద్యులు ప్రదర్శించారు. అయితే ఒక శిశువుకు అమర్చడానికి అప్పుడే వీలు లేదని,ఈ దిశగా అనేక ప్రయోగాలు సాగాల్సి ఉందని శాస్త్రజ్ఞులు తెలిపారు.ఇంకా ఈసృష్టి బ్లూప్రింట్ ప్రచురణ జరగలేదు.ఆ టెక్నాలజీ కి పేటెంట్ పొందలేదు.శాస్త్రజ్ఞులురెండేళ్లు శ్ర మించి ఈ టెక్నాలజీని రూపొందించారు.

యోగా టీచర్‌గా పసిబాలుడు



బీజింగ్: చైనాలో ఏడేళ్ల చిన్న బాలుడు సర్టిఫైడ్ యోగా అధ్యాప కునిగా అవతా రం దాల్చాడు. అతడి ఆదాయం దాదాపు 15,000 డాలర్లు. ప్రభు త్వ మీడియా ఆ కుర్ర వాడి వార్త ప్రచా రం చేసింది. పురా తన భారతీయ తరహా యోగాసనాలను ఆ ఏడేళ్ల కుర్రాడు బోధిస్తున్నాడు. సోషల్ మీడియాలో అతనికి విశేష ప్రచారం లభి స్తోంది. తూర్పు చైనాలోని ఝ జియాంగ్ రాష్ట్రానికి చెందిన ఆ కుర్రవాడు రె ండేళ్ల వయస్సప్పుడే యోగా అభ్యసించాడు. సన్ చియాంగ్ అనే ఆ కుర్రవాడు ఆంగ్ల నామం మైక్. అతడికి రెండేళ్ల వయస్సప్పుడు స్వల్పంగా ఆటిజం కనపడడంతో తల్లి ఆ వ్యాధి నయానికి అతడికి యోగా నేర్పించింది. ఇప్పుడు చైనాలో అత్యంత పిన్నవయస్సు యోగా టీచర్‌గా సన్ పేరుపొందాడు.

గాంధీలో కొనసాగుతున్న జూడాల ఆందోళన

మన తెలంగాణ / హైదరాబాద్: గాంధీ ఆసుపత్రిలో జూని యర్ డాక్టర్ల ఆందోళన రెండవ రోజు కూడా కొనసాగింది. తాము లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తా మని జూడాలు హెచ్చరించారు. ఎమర్జన్సీ సేవలను కూడా రద్దు చేస్తామని జూనియర్ డాక్టర్ల సంఘం స్పష్టం చేసింది. ఇప్పటి వరకు తాము లేవనెత్తిన పలు రకాల సమస్యలపై సూపరింటెండెంట్ స్పందించడంలేదన్నారు. కనీసం తమ తో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదన్నారు. మాట్లాడాతామని ఇచ్చినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో తమ ఆందోళనను మరింత విస్తరించేం దుకు చర్యలు తీసుకుంటున్నామని జూనియర్ డాక్టర్ల సంఘం తెలిపింది. సూపరింటెండెంట్ వ్యవహారశైలిని నిర సించడంతో పాటు ఆసుప్రతిలో కనీస వసతులు కల్పించా లని ఏడాది కాలం చెప్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. పైగా తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిప డ్డారు. దీనికి నిరసనగా రెండు రోజులుగా జూడాలు తమ విధులను బహిష్కరించి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తు న్నారు. ఆందోళన కారణంగా ఆసుప్రతికి వచ్చే రోగులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎమర్జన్సీ మినహా మిగిలిన ఓపీ, ఇతర సేవలను నిలిపివేశారు. దీంతో ఓపీ కోసం వచ్చే రోగులు డాక్టర్‌ను కలవకుండానే వెనుదిర గాల్సి వస్తోంది.

మాపై కక్ష్య సాధింపు : సంజయ్

వైద్యులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, పనిభారం పెరి గిందని, తమకున్న సమస్యలను పరిష్కరించాలని కోరినం దుకు ఆసుప్రతి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ తమపై కక్ష్య పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అన్ని విభాగాల అధిపతులు బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తు న్నారని తెలిపారు. ఈ విషయాన్ని వదిలేసి తప్పంతా తమ దే అన్నట్లుగా సూపరింటెండెంట్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

త్వరలోనే పరిష్కారం : శ్రావణ్‌కుమార్

ఇది తమ ఇంటి సమస్య అని.. త్వరలోనే పరిష్కరించుకుం టామని తెలిపారు. తాను కొంత కఠినంగా వ్యవహరించ డంతో పిల్లలు మనస్సు నొచ్చుకున్నారని ఇది పెద్ద సమస్య కాదని.. త్వరలో పరిష్కారమవుతుందనే ఆశాభావాని ఆయ న వ్యక్తం చేశారు. ఈ విషయంలో వైద్య, విద్యా సంచాలకు లతో మాట్లాడుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పలు రకాల సమస్యలను కూడా వారు లెవనెత్తారని తెలిపారు. ప్రభుత్వంతో చర్చించి వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

తగ్గిన భూగర్భ జలమట్టం

మన తెలంగాణ/హైదరాబాద్: గత నెల రోజుల్లో రాష్ట్రంలో సగటున 86 సెంటీమీటర్ల మేర భూగర్భ జలమట్టం తగ్గింది. ప్రస్తుతం సగటున 10.04 మీటర్ల మేర జలమట్టం ఉండగా, గత డిసెంబరులో 9.18 మీటర్ల లోతుల్లో నీరు ఉంది. పెరిగిన సాగు, 24 గంటల ఉచిత విద్యుత్ కార ణంగా నీటి వినియోగం పెరిగింది. ఫలితంగా 86 సెంటీమీటర్ల మేర నీటిమట్టం పడిపోయింది. వనపర్తి జిల్లాలో 6.25 మీటర్ల లోతుల్లో నీరు ఉండగా, మెదక్ జిల్లాలో మాత్రం 16.07 మీటర్ల లోతుకు నీటిమట్టం పడిపోయింది. గత ఏడాది కాలంలో రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా జల మట్టం (4.16 మీటర్లు) పెరగగా, హైదరాబాద్ జిల్లాలో కనిష్టంగా 22 సెంటీమీటర్ల పెరుగుదల కనిపించిందని భూగర్భ జలవనరుల శాఖ విడు దల చేసింది.

రోడ్ల అభివృద్ధి.. ప్రాజెక్టులకు సహకరించండి

కేంద్ర మంత్రులకు తుమ్మల విజ్ఞప్తి

మన తెలంగాణ/ న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర రహదారుల అభివృద్ధి, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి అన్ని విధాలుగా సహకరించాలని పలువురు కేంద్ర మంత్రులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కోరారు. మంగళవారం ఢిల్లీలోని పరివాహన్ భవన్‌లోని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఆయన కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, తెలంగాణ పార్లమెంట్ సభ్యులు ఎపి జితేందర్ రెడ్డి, బి.వినోద్ కుమార్, బూర నర్సయ్య గౌడ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి, రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించా లని మంత్రి తుమ్మల కోరారు. కొత్త జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో రహదా రుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. అనం తరం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి హర్షవర్ధన్‌తో తుమ్మల, తెలం గాణ ఎంపిలు సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టు, పాలమూరు ఎత్తిపోతల పథ కానికి కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ త్వరతగతిన అనుమతులు కేటాయి స్తున్న నేపథ్యంలో కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో మరింత వేగం పెరిగేలా మిగిలిన అనుమతివ్వలని తుమ్మల, కేంద్ర మంత్రిని కోరారు. అనం తరం మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కేవలం 2 వేల కిలోమీటర్ల రోడ్లను మాత్రమే సాధించిందని, కానీ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత దాదాపు 3 వేల కిలోమీటర్ల రోడ్లను నిర్మించుకున్నామని మంత్రి తెలిపారు. ఆ 3 వేల కిలోమీటర్లకు సంబంధించిన గెజిట్ నోటిఫికేష న్‌ను విడుదల చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీనీ కోరామని మంత్రి వివ రించారు. 10 లక్షల ఎకరాలకు నీరందించే సీతారామ ప్రాజెక్టుకు సంబం ధించి ఇప్పటికే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మొదటి దశ అటవీ, పర్యావ రణ అనుమతులు ఇచ్చిందని మంత్రి తెలిపారు. అయితే వన్య ప్రాణుల సంర క్షణకు సంబంధించిన అనుమతులు రావాల్సి ఉందని మంత్రి తెలిపారు. ఈ అనుమతికి సంబంధించి కేంద్ర పర్యావరణ అటవీ శాఖ మంత్రి అధ్యక్షతన సమావేశం జరగాల్సి ఉందని, త్వరితగతిన ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసి అనుమతులు మంజూరు చేయాలని కోరినట్లు మంత్రి తెలిపారు. తమ విజ్ఞప్తు లపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, రెండు, మూడు రోజుల్లో అనుమతులు మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు.



చైనా క్షిపణి ప్రయోగం సక్సెస్

బీజింగ్: క్షిపణిని అడ్డగించే పరీక్ష ప్రయోగాన్ని చైనా విజయవంతంగా జరిపింది. 'మిడ్‌కోర్స్ గ్రౌండ్ బేస్డ్ మిస్సైల్ ఇంటర్ సెప్షన్' ఈ పరీక్ష పేరు. చైని భూభాగం లోపల సోమవారం ఈ ప్రయోగం జరిగింది. ముందే నిర్ణయించిన లక్ష్యాన్ని ఛేదించినట్లు జాతీయ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇది కేవలం ప్రయోగమని, ఏ దేశాన్ని గురిపెట్టి చేసింది కాదని ప్రభుత్వ ఆధ్వర్యంలోని జిన్ హువా వార్త సంస్థ ప్రక టించింది. ఒక ఖండాంతర క్షిపణిని భూమిపై అమర్చిన క్షిపణి ద్వారా ఛేదించారు. ఇతర వివరాలు తెలుపలేదు.

ముంబయి విద్యార్థికి గౌరవం

లండన్: బర్మింగ్ హామ్ సిటి యూనివర్శిటీ అంతర్జాతీయ కాలేజ్ (బిసి యుఐసి) 1000వ విద్యార్థిగా ఎన్‌రోల్ అయిన 19 ఏళ్ల విద్యార్థి వెయ్యి పౌండ్ల గ్రాంట్ పొందాడు. రచిత్ పటేల్ అనే ముంబయి విద్యార్థి తోటి విద్యార్థులు, టీచర్లతో కలిసి ఈ విజయాన్ని పండుగ చేసుకున్నాడు. కాలేజి ఆర్ అండ్ డిజైన్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ లో అధ్యయనాన్ని అతడు ప్రారంభించాడు. మీడియా అండ్ కమ్యూనికేషన్స్‌లో బిఎ ఆనర్స్ చదువు తన లక్ష్యమని రచిత్ పటేల్ చెప్పాడు. ఇది ప్రపంచ ప్రఖ్యాత క్యాడ్‌బరి చాకొలెట్ ఫ్యాక్టరీ పరిసరాల్లో ఉన్న కాలేజ్.

జిహెచ్‌ఎంసి ఆఫీస్‌లో అగ్నిప్రమాదం





మన తెలంగాణ/సోమాజిగూడ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొ రేషన్ సెంట్రల్ జోన్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఖైరతాబాద్‌లో సెంట్రల్ జోన్ కార్యాలయంతో పాటు సర్కిల్ 10ఏ, 10బి, 7ఏ, 7బి కార్యాలయం, ఇంజనీరింగ్, హెల్త్, యూసిడి, ఆడిట్ సెక్షన్ కార్యాలయాలు ఉన్నాయి. మొదటి అంతస్తులోని ఆడిట్ కార్యా లయంలో ఉదయం 6 గంటల సమయంలో పొగలు రావడాన్ని గమ నించిన సెక్యూరిటీ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. క్షణా ల్లో మంటలు చెలరేగి కార్యాలయంమొత్తం వ్యాపించాయి. సెక్షన్‌లోని ఫైల్స్ , కంప్యూటర్, ఫర్నిచర్ సుమారు రూ. 5లక్షలు విలువ చేసే ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను అదుపులోనికి తీసుకువచ్చాయి. విషయం తెలుసుకున్న సర్కిల్ అధికారులు అగ్నిప్రమాదంపై విచారణ చేపట్టి నివేదికను ఉన్నతా ధికారులకు అందజేస్తామని డిసిలు తెలిపారు. అగ్ని ప్రమాదం సంఘ టనపై పలువురు అను మానాలు వ్యక్తం చేస్తున్నారు.అగ్నిప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి ఖైరతాబాద్‌లోని సర్కిల్ కార్యాలయానికి విచ్చేసి అగ్నిప్రమాదం జరిగిన ఆడిట్ కార్యాలయాన్ని పరిశీలించారు.

పాక్‌కు అమెరికా సాయం కట్

వాషింగ్టన్: పాకిస్థాన్‌కు రక్షణయేతర సహాయాన్ని నిలిపివేసే బిల్లును మంగళవారం అమెరికా ప్రజా ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టారు. అటు వంటి సహాయం టెర్రరిస్టులకు పరోక్షంగా అందుతున్నందున ఆ మొత్తాన్ని దేశంలోని మౌలిక సౌకర్యాల కల్పన ప్రాజెక్టులకు కల్పించా లని కోరుతూ బిల్లును కాంగ్రెస్ సభ్యుడు మార్క్ స్టాన్‌ఫోర్డ్, థామస్ మాసి ప్రతిపాదించారు. పాకిస్థాన్‌కు అమెరికన్ పన్ను చెల్లింపుదార్ల డబ్బు పోకుండా ఈ శాసనం అమెరికా విదేశాంగ శాఖను, అంతర్జా తీయ అభివృద్ధి ఏజెన్సీని నిరోధిస్తోంది. అందుకు బదులుగా ఈ నిధు లను అమెరికాలో హైవే ట్రస్ట్ ఫండ్‌కు మళ్లిస్తారు. ఉగ్రవాదులకు ఊతం ఇచ్చే దేశానికి సహాయపడ్డం మానుకోవాలని మెస్సి ఈ బిల్లును ప్రతిపా దిస్తూ డిమాండ్ చేశారు. అమెరికా దొడ్డ హృదయం ఉగ్రవాదులకు పరోక్ష సహాయంగా మారకూడదని స్టాన్‌ఫోర్డ్ అన్నారు.

గల్లంతైన నౌక ఆచూకీ లభ్యం

న్యూఢిల్లీ/ముంబయి: 22 మంది భారతీయులు ప్రయాణిస్తున్న చము రు ట్యాంకర్ ఆచూకీ కనుగొన్నట్లు విదేశ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ మంగళవారం తెలిపారు. పశ్చిమ ఆఫ్రికాలోని బెనిన్ తీరం నుండి అది ఈ నెల 1న అదృశ్యమైంది. సముద్రపు దొంగల అదుపులో అది ఉన్నట్లు తెలిసింది. సిబ్బంది సభ్యులందర్నీ సముద్రపు దొంగలు నాలుగు రోజుల తర్వాత సురక్షితంగా విడిచిపెట్టినట్లు అధి కార్లు తెలి పారు. అది మెరిన్ ఎక్స్‌ప్రెస్ పేరుగల వాణిజ్య నౌక. విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ఈ శుభవార్తను ట్వీట్ చేశారు.

రైలుకిందపడి కానిస్టేబుల్ ఆత్మహత్య



మన తెలంగాణ/సిటీబ్యూరో : ఫేస్‌బుక్‌లో పరిచయమైన వివాహితను పెళ్లిచేసుకోవడం, ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఓ కానిస్టేబుల్ రైలుకిందపడి ఆత్మహత్య చేసు కున్న సంఘటన మౌలాలీ పరిధిలో జరి గింది. వివరాల ప్రకారం లాలాపేటకు చెంది న కట్టెకోల సత్తయ్య కుమారుడు సందీప్ మొఘల్‌పురా పోలీసు స్టేషన్‌లో పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అయితే, ఇతనికి ఫేస్‌బుక్‌లో ఓ ఇల్లాలు పరిచయమైంది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇదిలా ఉండగా కొద్దిరోజుల క్రితం ఆమె ఇంటినుండి అదృశ్యమైంది. దీంతో ఆమె భర్త శంషాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఆమెను వివాహం చేసుకున్నట్టు ప్రచారం కావడం, భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడం, విభాగంలో ప్రముఖంగా వినిపించడంతో మనస్థాపానికి లోనైన సందీప్ మంగళవారం మౌలా లీలో రైలుక్రిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు వెల్లడిస్తున్నారు.

9న బిసి హక్కుల సాధన సదస్సు



మన తెలంగాణ / హైదరాబాద్ : ఈ నెల 9న హైదరాబాద్‌లోని బిసి సాధికారత భవన్‌లో బిసి హక్కుల సాధన కోసం రాష్ట్ర సదస్సు నిర్వహి స్తున్నట్లు వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. వెంకట్ రాములు, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. పాండురంగా చారి తెలిపారు. హైదరాబాద్‌లోని నాగోల్‌లో సోమవారం ఈ సదస్సు వాల్ పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా పాండు రంగాచారి మాట్లాడుతూ 9న జరిగే రాష్ట్ర సదస్సులో భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకుని ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో సంఘం రాష్ట్ర సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు టి. నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ వన్డే జట్టు ఇక ఎక్కడైనా గెలుస్తుంది: శిఖర్ ధవన్

కేప్‌టౌన్: భారత అంతర్జాతీయ వన్డే జట్టు ఇక ఎక్కడైనా గెలుస్తుందని ఓపెనర్ శిఖర్ ధవన్ అన్నాడు. అందుకు సరైన సమతుల్యత(రైట్ బ్యాలెన్స్), గెలిచే ప్రతిభ (ఎక్స్–ఫ్యాక్టర్) ఉన్నాయని చెప్పాడు. ఇంగ్లాండ్‌లో 2019 ప్రపంచ కప్ జరగడానికి ముందు అతడు చెప్పిన ఈ విషయం ఆలోచించదగ్గదిగా ఉంది. 'మాకు చాలా అనుభవం ఉంది. దక్షిణాఫ్రికాకు ఇది నా రెండో పర్యటన. ఈ పర్యటనకు నేను మానసికంగానేకాక, నైపుణ్యపరంగా కూడా బాగా సన్నద్ధమై వచ్చాను' అని తెలిపాడు. 'జట్టులో యువ క్రీడాకారులున్నారు. వారు యువ క్రీడాకారులే అయినప్పటికీ చాలా అనుభవం ఉన్నవారిలా ఆడుతున్నారు. అది మాకు మరో గొప్ప బలం' అన్నాడు. జట్టుకు హార్దిక్ పాండ్య మరో ప్లస్ పాయింట్ అన్నాడు. ఆల్ రౌండర్ జట్టులో ఉండడం మంచి విషయమేనని, హార్దిక్ అవసరమైనప్పుడు బౌలింగ్ కూడా చేయగలడన్నాడు. టెస్ట్ సిరీస్‌లో దక్షిణాఫ్రికా జట్టు బాగా ఆడిందని మెచ్చుకున్నాడు. రానున్న రోజుల్లో జరిగే గేమ్స్‌లో తాము మరింత బాగా ఆడే ప్రయత్నం చేస్తామన్నాడు.



కోహ్లికి ఓటమి ఇష్టముండదు



చెన్నై: భారత కెప్టెన్ కోహ్లిని ఓటమ నేదే ఇష్టముండదని, ఆ మాట నోటి వెంట రాదని స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ స్పష్టం చేశాడు. కేవలం విజయాల గురించి మాట్లాడే కోహ్లి, దాన్ని తన నరనరాల్లో ఇముడ్చుకున్నాడన్నాడు. 'ఎప్పుడూ కోహ్లి మాట్లడేది విజయం గురించే. ఎంత క్లిష్ట పరిస్థితి ఎదురైనా వెనుకడుగు వేయడు. కేవలం విజయం గురించి మాత్రమే ఆలోచిస్తాడు. అతడికి నెగిటివ్ బోన్ అనేది లేదేమో. అదే జట్టులోని సభ్యుల్ని మరింతగా రాటుదేలేలా చేస్తోంది. కోహ్లి ఏదైతే కోరుకుంటున్నాడో అది ఆటగాళ్లకు బాగా తెలుసు. అందుకే అంతా సమష్టిగా రాణిస్తూ జట్టును ముందుకు తీసుకెళుతున్నాడు. ఒక పూర్తి స్థాయి కెప్టెన్‌గా కోహ్లికి ఇదే తొలి విదేశీ సిరీస్. ఇప్పటికే అత్యుత్తమ కెప్టెన్ల సరసన ఆడిన అనుభవ ఉన్న కోహ్లి కూడా అదే తరహాలో పయనిస్తున్నాడు' అని అశ్విన్ పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికాతో తొలి రెండు టెస్టుల్లో తాము ఓడినా మంచి ప్రదర్శనే ఇచ్చామని ఈ స్పిన్నర్ చెప్పుకొచ్చాడు.

బౌలర్‌ను మాత్రమే అభినందించా

పాక్ డ్రెస్సింగ్ రూమ్ విమర్శలపై ద్రవిడ్ క్లారిటీ

ముంబై: అండర్19లో వరల్డ్‌కప్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పాక్ ఆటగాళ్లలో స్ఫూర్తి నింపేందుకు ఆ జట్టు మేనేజర్ నదీమ్ ఖాన్ పిలుపుమేరకు భారత చీఫ్ కోచ్‌గా వ్యవహరించిన రాహుల్ ద్రవిడ్ పాక్ డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లినట్లు వార్తలు వినిపించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను ద్రవిడ్ ఖండించాడు. వరల్డ్ కప్ గెలిచి సోమవారం స్వదేశానికి వచ్చిన తర్వాత రాహుల్ మీడియాతో మాట్లాడాడు. అందులో భాగంగా ఓ విలేకరి నుంచి ఎదురైన ప్రశ్నకు కూల్‌గా బదులిచ్చాడు. 'నేను పాకిస్తాన్ డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లలేదు. కేవలం పాక్ జట్టులోని ఒక లెఫ్టార్మ్ పేసర్‌ని మాత్రమే అభినందించా. అది కూడా డ్రెస్సింగ్ రూమ్‌కి బయటే. అంతేకానీ వారి డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లి వారితో ఎలాంటి చర్చలు జరపలేదు. ఆ క్రమంలోనే పాకిస్తాన్ కోచ్ మన కుర్రాళ్లు బాగా ఆడారని అభినందించారు. అంతవరకు మాత్రమే జరిగింది' అని ద్రవిడ్ పేర్కొన్నాడు. గత 14,16 నెలల కృషికి లభించిన ఫలితమే ఈ వరల్డ్ కప్ అని ద్రవిడ్ స్పష్టం చేశాడు. అయితే ఫైనల్లో ఆస్ట్రేలియాపై గెలిచి వరల్డ్ కప్ గెలిచినప్పటికీ, తుది పోరులో తమ స్థాయికి తగ్గ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వలేకపోయామన్నాడు.

బిసిసిఐ నజరానాపై అసంతృప్తి

గత వారంలో న్యూజిలాండ్‌లో జరిగిన అండర్19 ప్రపంచ కప్ గెలిచిన భారత యువ జట్టుకి, కోచింగ్ సిబ్బందికి బిసిసిఐ నజరానా ప్రకటించిన తీరుపై ద్రవిడ్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. టోర్నీలో ఓటమి ఎరుగకుండా జైత్రయాత్ర సాగించి ప్రపంచ క్రికెట్‌లో నాలుగుసార్లు అండర్19 ప్రపంచకప్‌ని గెలిచిన ఏకైక జట్టుగా భారత్ అవతరించింది. ఫైనల్లో గెలవగానే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) భారీగా నజరానాలు ప్రకటించింది. జట్టు ప్రధాన కోచ్‌గా ఉన్న రాహుల్ ద్రవిడ్‌కి రూ. 50 లక్షలు, జట్టులోని ఒక్కో ఆటగాడికి రూ. 30 లక్షలు, సహాయ కోచ్‌లకు రూ. 20 లక్షలు చొప్పున నజరానా ప్రకటించింది. అయితే సహాయ కోచ్‌లు కుర్రాళ్లతో పాటు సమానంగా కష్టపడ్డారని, వారికి కూడా క్రికెటర్లతో సమానంగా ఇచ్చి ఉంటే బాగుండేదని ద్రవిడ్ అభిప్రాయపడ్డాడట. అంతేకాకుండా ఈ మేరకు బిసిసిఐకి ప్రత్యేక వినతిని కూడా పంపినట్లు సమాచారం.



చరిత్ర తిరగరాసేనా?!

- నేడు దక్షిణాఫ్రికాతో మూడే వన్డే
- వరుస విజయాలతో ఊపుమీదున్న టీమిండియా
- గాయాలతో సతమతమవుతున్న ప్రోటీస్



కేప్‌టౌన్: తొలి రెండు వన్డేల్లో విజయం సాధించి మంచి ఊపుమీదున్న టీమిండియా హ్యాట్రిక్ విజయంతో చరిత్ర తిరగరాయాలని ఉవ్విళ్లూరుతోంది. ఇప్పటికే దక్షిణాఫ్రికాపై పైచేయి సాధించింది. నేడు (బుధవారం) ఇరు జట్ల మధ్య జరిగే మూడో వన్డే గెలుపుపై కన్నేసింది. జట్టులో పెద్దగా మార్పులేమీ లేకుండానే బరిలోకి దిగాలని భావిస్తుండగా, దక్షిణాఫ్రికాను మాత్రం గాయల బెడద వెంటాడుతోంది. ఇప్పటికే ఎబి డివిలియర్స్, డుప్లెసిస్ దూరం కాగా, మరో కీలక ఆటగాడు, ఓపెనర్ డీకాక్ సైతం మణికట్టు గాయంతో సిరీస్‌కు దూరం కావడం సఫారీ జట్టును ఆందోళనకు గురిచేస్తోంది.

భారత ముంగిట రికార్డు..

దక్షిణాఫ్రికాలో ఇప్పటివరకూ ఏ ద్వైపాక్షిక సిరీస్‌లోనూ భారత జట్టు మూడు విజయాలు సాధించలేదు. ఒకవేళ రేపటి మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధిస్తే మాత్రం సరికొత్త అధ్యాయాన్ని లిఖించనుంది. గతంలో దక్షిణాఫ్రికాలో ఒక ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో భారత జట్టు సాధించిన విజయాలు రెండు. దక్షిణాఫ్రికాలో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ల్లో కేవలం రెండు సందర్భాల్లో మాత్రమే భారత్ రెండేసి విజయాలు సాధించింది. 199293 దక్షిణాఫ్రికా పర్యటనలో ఐదు వన్డేల సిరీస్‌లో రెండు వన్డే విజయాల్ని సాధించిన టీమిండియా 201011 సీజన్ వన్డే సిరీస్‌లో రెండు విజయాలు సాధించింది. ఈ నేపథ్యంలో రేపు జరగబోయే మ్యాచ్ ప్రాధాన్యత సంతరించుకుంది. మూడో వన్డేలో భారత్ జట్టు గెలిస్తే వరుస మూడు విజయాలతో సరికొత్త చరిత్ర లిఖించనుంది. 1992 నుంచి చూస్తే న్యూలాండ్స్ గ్రౌండ్‌లో భారత్ మొత్తం నాలుగు వన్డేలు ఆడగా, రెండు గెలిచి, మరో రెండిట్లో ఓటమి పాలైంది.

జట్లు (అంచనా)

భారత్: విరాట్ కోహ్లి (సారథి), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, అజింక్య రహానె, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ, హార్దిక్ పాండ్య, యజువేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్; జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమి, శార్థూల్ ఠాకూర్

దక్షిణాఫ్రికా: అయిడెన్ మార్క్రమ్ (సారథి), హాషీమ్ ఆమ్లా, జేపీ డుమిని, ఇమ్రాన్ తాహిర్, డేవిడ్ మిల్లర్, మోర్నీ మోర్కెల్, క్రిస్ మోరిస్, లుంగి ఎంగిడి, ఫెహ్లుక్‌వాయో, రబాడ, షంషి, జొండొ, బెహార్డిన్, హెన్రిచ్ (వికెట్ కీపర్)

ఎలాంటి మార్పుల్లేకుండానే..

ఈ మ్యాచ్‌లో భారత జట్టు ఎలాంటి మార్పుల్లేకుండానే బరిలోకి దిగనుంది. తొలి రెండు వన్డేల్లో ఆడిన తుది జట్టుతోనే మూడో వన్డే కూడా కొనసాగించడం ఖాయమనే అనిపిస్తోంది. ఇప్పటికే కోహ్లి, శిఖర్ ధావన్, రహానేలు ఫామ్‌ను చాటుకోగా, రోహిత్ శర్మ నుంచి కీలక ఇన్నింగ్స్ రావాల్సి ఉంది. ఇక బౌలింగ్‌లో భువనేశ్వర్ కుమార్, బూమ్రా, కుల్దీప్ యాదవ్, చాహల్‌లు తమదైన ముద్రతో చెలరేగిపోతున్నారు. తమకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటూ సత్తాచాటుకుంటున్నారు. మరోవైపు రెండు వన్డేల్లో భారత జట్టు పూర్తిస్థాయిలో బ్యాటింగ్ చేయకుండానే విజయం సాధించి ఆత్మవిశ్వాసంతో ఉండగా, దక్షిణాఫ్రికా జట్టులో మాత్రం గాయాలతో ప్రధాన ఆటగాళ్లు దూరమయ్యారు.


బిసిసిఐ ప్రధాన కార్యాలయం తరలింపు



ముంబయి: భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) ప్రధాన కేంద్ర కార్యాలయం ముంబయి నుంచి బెంగళూరుకు తరలిపోయే అవకాశాలున్నాయి. బిసిసిఐకి బెంగళూరులో 40 ఎకరాల భూమి ఉంది. అక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో జాతీయ క్రికెట్ అకాడమీ నిర్మించేందుకు సన్నాహాలు కూడా చేస్తున్నారు. దానిలో భాగంగానే బిసిసిఐ హెడ్‌క్వార్టర్స్‌ను కూడా బెంగళూరుకు మార్చాలనే యోచన చేస్తున్నారు. ప్రస్తుతం ముంబైలోని వాంఖేడ్ స్టేడియంలో బిసిసిఐ ప్రధాన కేంద్ర కార్యాలయం ఉంది. అయితే ఫైవ్ స్టార్ సౌకర్యాల కోసం బిసిసిఐ కొన్ని కోట్ల రూపాయల్ని ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో బెంగళూరులో క్రికెట్ అడ్మినిస్టేటర్స్, గెస్ట్‌లు ఉండేందుకు వీలుగా ప్రధాన కార్యాలయం నిర్మించాలని బిసిసిఐ భావిస్తోంది. బిసిసిఐ సమావేశాలు ముంబై, ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో జరిగిన సమయాల్లో ఖర్చు భారీగా అవుతోంది. దాంతో బెంగళూరులో ఉన్న స్వంత స్థలంలో నేషనల్ క్రికెట్ అకాడమీతో పాటు, అత్యాధునిక సౌకర్యాలతో బిసిసిఐ కార్యాలయాన్ని నిర్మించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు బిసిసిఐ తాత్కాలిక అధ్యక్షుడు సి.కె. ఖన్నా బోర్డు సభ్యుల అనుమతి కోరుతూ లేఖలు రాశారు.ఒకవేళ దీనికి ఆమోద ముద్ర పడితే బిసిసిఐ కార్యకలాపాలు మరి రెండు మూడేళ్లలో ముంబై నుంచి బెంగళూరుకు మారే అవకాశం ఉంది.

వన్డే సిరీస్ గెలుపుపై మహిళా జట్టు కన్ను

కేప్‌టౌన్: భారత మహిళా క్రికెట్ జట్టు మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో సిరీస్ గెలుపై సాధించాలని దృష్టి పెట్టింది. సోమవారం తొలి వన్డేలో 88 పరుగుల తేడాతో గెలుపొంది బాగా రాణించిన భారత జట్టు బుధవారం జరిగే రెండో వన్డేను గెలిచి సిరీస్‌ను ఖాయం చేసుకోవాలనుకుంటోంది. సిరీస్ విజయం సాధిస్తే గనుక 2021 ఐసిసి విమెన్స్ వరల్డ్ కప్‌కు నేరుగా క్వాలిఫై బెర్తు సాధించే అవకాశం ఉంటుంది. ఇప్పటికైతే ఇటు భారత్‌కు అటు సఫారీ మహిళా జట్టు రెండింటికీ ఆ అవకాశం ఉంది.



ఆ క్రెడిటంతా యువరాజ్ సింగ్‌దే!

ముంబయి : అండర్–19 వరల్డ్ కప్ టోర్నీలో రాణించడానికి భారత సీనియర్ క్రికెటర్, సిక్సర్ల కింగ్ యువరాజ్ సింగే కారణమని యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ అభిప్రాయపడ్డాడు. అండర్–19 ప్రపంచకప్ గెలుచుకుని స్వదేశానికి చేరుకున్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పాడు. 'ఈ టోర్నీలో అద్భుతంగా రాణించానంటే ఆ ఘనత మొత్తం యువరాజ్ సింగ్‌దే.ఈ పర్యటనకు ముందు బెంగళూరు నేషనల్ అకాడమీలో శిక్షణ తీసుకున్నాం. సిక్సర్ల కింగ్ ఒక రోజు అక్కడికి వచ్చి మాతో ముచ్చటించారు. బ్యాటింగ్‌లోని మెళుకువలు, సలహాలను తెలియజేశాడు. టోర్నీలోని మ్యాచ్ పరిస్థితుల గురించి కొన్ని సూచనలు చేశాడు. యువీ పాజీ ఇచ్చిన ప్రేరణ మాకు ఎంతగానో సహకరించింది. ఈ మెగా టోర్నీలో నేను చాలా బాగా ఆడానంటే ఆ క్రెడిట్ మొత్తం యువరాజ్‌కే దక్కుతుంది' అని గిల్ చెప్పుకొచ్చాడు. పాకిస్తాన్‌తో జరిగిన సెమీ ఫైనల్లో సాధించిన సెంచరీపై స్పందిస్తూ ' నిజానికి ఆ మ్యాచ్‌లో మేం ఒత్తిడికి గురయ్యాం. ఓపెనర్ల నుంచి మాకు మంచి శుభారంభం అందినప్పటికీ తరువాత త్వరగా వికెట్లు కోల్పోయాం. అప్పుడు కోచ్ రాహుల్ ద్రవిడ్ నాలో ధైర్యాన్ని నింపాడు. మ్యాచ్ చివర వరకు క్రీజులోనే ఉండాలని సూచించాడు. ఆ సమయంలో అనుకుల్ రాయ్ నుంచి కూడా మంచి మద్దతు లభించింది. కోచ్ చెప్పినట్లు ఆడి సెంచరీ సాధించను' అని శుభ్‌మన్ చెప్పాడు. ఈ టోర్నీలో శుభ్‌మన్ మూడు అర్థ సెంచరీలు, ఒక సెంచరీతో మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ టోర్నీలో రాణించి అందరి దృష్టి తనవైపు తిప్పుకున్నాడు. ఐపీఎల్11 సీజన్ వేలంలోఈ పంజా బ్ కుర్రాడిని కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 1.8 కోట్లకు సొంతం చేసుంది.



ముంబయికి రెండో విజయం

- డిఫెండింగ్ ఛాంపియన్ తమిళనాడు ఓటమి
- విజయ్ హజారే ట్రోఫీ

చెన్నై: విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్ 'సి'లో మంగళవారం ముంబయి జట్టు గుజరాత్ జట్టుపై 41 పరుగుల విజయం సాధించగా, డిఫెండింగ్ ఛాంపియన్ తమిళనాడు, గోవా జట్టు చేతిలో ఓడిపోయింది. ముంబయి జట్టులోని సిద్ధేశ్ లాడ్ 129 బంతుల్లో 125 పరుగలు చేశాడు. అందులో 11 ఫోర్స్, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. దాంతో ముంబయి జట్టు 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 317 పరుగుల చేసింది. గుజరాత్ జట్టులో కెప్టెన్ ప్రియాంక్ పంచల్ 89 పరుగులు చేసిన ఫలితం లేకపోయింది. 47.4 ఓవర్లలో 276 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ముంబయి జట్టుకిది వరుసగా రెండో విజయం. డిఫెండింగ్ ఛాంపియన్ తమిళనాడు జట్టు, గోవా జట్టు చేతిలో నాలుగు వికెట్ల తేడాతో ఓడిపోయింది. గోవా ఓపెనర్ స్వప్నిల్ అస్నోద్‌కర్ జట్టు గెలుపుకు సహకరించాడు. అతడు 103 పరుగులు చేయడమేకాక, కెప్టెన్ సగున్ కామత్‌తో కలసి రెండో వికెట్‌కే 98 పరుగుల భాగస్వామ్యాన్ని సాధించాడు. దాంతో తమిళనాడు పెట్టిన లక్ష్యం ఛేదించడం గోవా జట్టుకు సులభమైంది. తమిళనాడు జట్టులో టాప్ బ్యాట్స్‌మెన్ కౌశిక్ గాంధీ 43 పరుగులు, మురళీ విజయ్ 51 పరుగులు, బాబా అపరజిత్ 52 పరుగులు మాత్రమే చేయగలిగారు. ఇక మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌లో విజయ్ శంకర్ ఒక్కడే కాస్త నిలదొక్కుకుని ఆడాడు. మరో గేమ్‌లో ఆంధ్ర ప్రదేశ్ జట్టు ఆరు వికెట్ల తేడాతో మధ్యప్రదేశ్ మీద గెలిచింది.

స్కోర్లు వివరాలు:
ముంబయి 317/8(50 ఓవర్లు), గుజరాత్ 276/10(47.4 ఓవర్లు)
గోవా 211/6(42.2 ఓవర్లు), తమిళనాడు 210/10(48.5 ఓవర్లు)
ఆంధ్రప్రదేశ్ 190/4(38.5 ఓవర్లు), మధ్యప్రదేశ్ 184/10(44.2 ఓవర్లు)



జులన్ గోస్వామి రికార్డు

కింబర్లే: భారత మహిళా క్రికెటర్ జులన్ గోస్వామి మరో అరుదైన ఘనతను అందుకుంది. సోమవారం దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో లక్ష్యఛేదనలో జుల న్ గోస్వామి (4/24), శిఖా పాండే (3/23), పూ నమ్ యాదవ్ (2/22) ధాటికి దక్షిణాఫ్రికా 43.2 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. దీంతో 88 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. అంతకుముందు 8 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన జులన్ గోస్వామి వెయ్యి పరుగుల మైలు రాయిని అం దుకుంది. దీంతో అంతర్జాతీయ మహిళల వన్డే క్రికెట్‌లో వెయ్యికి పైగా పరుగులతో పాటు 150కి పైగా వికెట్లు తీసిన ఏకైక్ క్రికెటర్‌గా జులన్ గోస్వా మి రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు 165 వన్డేలాడిన జులన్ 97 ఇన్నింగ్స్‌ల ద్వారా 1003 పరుగులు సాధించింది. అలాగే 164 ఇన్నింగ్స్‌ల ద్వారా 199 వికెట్లను తన ఖాతాలో వేసుకుంది. మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన క్రీడాకారిణిగా 35 ఏళ్ల జులన్ గోస్వామి అగ్రస్థానంలో ఉన్న సంగతి తెలిసిందే.

సింగిల్స్, డబుల్స్‌లో అదరగొట్టిన సింధు

- ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో అమ్మాయిల బోణీ



అలోర్ సెటార్(మలేసియా): ఒలింపిక్ పతక విజేత పి.వి. సింధు అటు సింగిల్స్‌తో పాటు, ఇటు మహిళల డబుల్స్‌లోనూ అదరగొట్టింది. దీంతో ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ 3–2 తేడాతో హాంకాంగ్‌పై విజయం సాధించింది. మొదటి సింగిల్స్‌లో సింధు 21–12, 21–18 తేడాతో ఇప్ పూ ఇన్‌పై విజయం సాధించి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. అనంతరం మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, ప్రజక్త సావంత్ జోడీ 22–20, 20–22, 10–21తో వింగ్ యుంగ్, టింగ్ చేతిలో పరాజయం పాలైంది. ఆ తర్వాత జరిగిన మరో మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో శ్రీ కృష్ణప్రియ కూడా 19–21, 21–18, 20–22 తేడాతో ఓటమి పాలైంది. దీంతో భారత్ 1–2తో వెనుకబడింది. మరో మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డితో జట్టుకట్టిన సింధు 21–15, 15–21, 21–14తో విజయం సాధించి 2–2తో సమం చేసింది. ఇక చివరిదైన మరో మహిళల సింగిల్స్‌పైనే అందరి దృష్టి. హోరాహోరీగా సాగిన మూడు సెట్ల పోరులో భారత క్రీడాకారిణి రుత్విక గద్దె 16–21, 21–16, 21–13తో విజయం సాధించింది. దీంతో భారత్‌కు 3–2 ఆధిక్యం లభించింది. ఇక టోర్నీలో భాగంగా గురువారం భారత మహిళల జట్టు జపాన్‌తో తలపడనుంది. యమగూచి, ఒకుహారాతో సింధు సేన తలపడనుంది.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.